

బందిపోటు యువరాజు

పచ్చగా కళకళలాడే కొండలకు దిగువన ఉన్న శాంతిపురం, పేరుకు తగ్గట్టు ఎంతో ప్రశాంతమైన నగరం. ఆ నగరం సుమేధ రాజ్యానికి రాజధాని. ఇంతవరకు సుమేధ రాజ్యాన్ని పరిపాలించిన రాజులు, ఆ నగరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దడానికి ఆలయాలు నిర్మించారు; ఉద్యానవనాలు ఏర్పరచారు; తటాకాలు తవ్వించారు. ప్రస్తుతం సుమేధను పరిపాలిస్తున్న రాజు శాంతిదేవుడు, నగర ప్రజలేగాక, రాజ్యంలోని ప్రజలందరూ సుఖశాంతులతో, సిరిసంపదలతో తులతూగడానికి కృషి చేస్తున్నాడు.

ఈ విషయం గురించి మాట్లాడుతూ ఒకనాడు సేనాధిపతి వీరసింహుడు రాజుతో, "రాజ్యంలో సంపదలు పెంచడానికి, పొరుగురాజ్యంపై దండెత్తడమే సులభమార్గం, మహారాజా! ఒక్కదెబ్బతో రాజ్యవిస్తరణతోపాటు, ఆ రాజ్యంలోని సంపదలన్నీ మన వశమవుతాయి." అన్నాడు.

అందుకు రాజు చిన్నగా నవ్వి. "వీరసింహా, అది సరైనమార్గం కాదు. పొరుగురాజ్యాన్ని కొల్లగొట్టి సంపాదించే ధనం అట్టేకాలం నిలవదు. పైగా అది సులభంగా లభ్యమవుతుంది కాబట్టి, ఆపైన మన ప్రజలు కష్టపడి పని చేయరు. దోచుకున్న ధనం అయిపోయాక, వేరొక రాజ్యంపైబడి దోచుకోవాలని బుద్ధిపుడుతుంది. యుద్ధంలో ఎప్పుడూ మనమే విజయం సాధించగలమన్న నమ్మకం



ఏమిటి ? మనం ఓడితే శత్రువులు మనల్ని దోచుకుంటారు. ఒకవేళ మనమే గెలిచినప్పటికీ, ఓడిపోయిన రాజులు మన మీద పగసాధించడానికి అదునుకోసం ఎదురు చూస్తుంటారు. ఆ పరిస్థితిలో శాంతి అసాధ్యం కదా !'' అన్నాడు.

''యుద్ధం వద్దంటే మరి మనకు సైనిక బలం దేనికి మహారాజా ?'' అన్నాడు వీర సింహుడు.

''పరులదాడినుంచి మనల్ని రక్షించుకోవడానికి మనకు సైనికబలం అవసరం. అయితే, యుద్ధకారణంగా వాటిల్లే అనర్థాలను రాజులందరూ గ్రహించి సైన్యాలను రద్దు చేయాలన్నదే మన ఆశయం. యుద్ధంవల్ల వాటిల్లే అపారజన నష్టం, ధననష్టం, కాలవ్యయం నీకు తెలియనిది కాదు. అసలు యుద్ధాలే లేకుంటే వీటినన్నిటినీ ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించవచ్చు కదా ?'' అన్నాడు శాంతిదేవుడు.

''ప్రభువులు క్షమించాలి. తమరు కలలు కంటున్నారు !'' అన్నాడు వీర సింహుడు హేళనగా.

సేనాధిపతి వీరసింహుడు రాజుకు దగ్గరిబంధువే కాక, బాల్యం నుంచి ఇద్దరూ కలిసిమెలిసి తిరిగినవారు. ఆ కారణంగా వీరసింహుడు రాజుతో చాలా చనువుగా మాట్లాడ కలిగేవాడు.

''నిజమే వీరసింహా, నేను కలలు కంటున్న మాట వాస్తవం. కపటంతో ఒకరి గొంతును మరొకరు కోయడంలో పోటీపడుతూ కాలం గడపకుండా, మాయ మర్మాలు లేకుండా ఒకరి మంచిలో మరొకరు ఆనందపడుతూ ప్రజలందరూ హాయిగా జీవించే అద్భుత ప్రపంచం కోసం కలలు కంటున్నాను. అందుకే, మన సేనలను ప్రజోపయోగ కార్యాలకు ఉపయోగించమంటున్నాను. మన సైనికుల సహాయంతో అవసరమైనచోట నదులపై వంతెనలు నిర్మిద్దాం. నదులు లేనిచోట కాలువలు తవ్విద్దాం. బాటల

కిరువైపులా ఫలవృక్షాలు నాటిద్దాం. ధాన్యరాసులు పండించడానికి పొలాలలో కాయకష్టం చేసే రైతులకు మన సైనికులు సాయపడాలి....'' అంటూ రాజు ఇంకా ఏదో చెప్పబోయాడు.



ఇంతలో వీరసింహుడు అడ్డుపడి, ''అద్భుతం మహారాజా, అద్భుతం. ఇక మీదట నా సైనికులకు, పశులకాపరులకు పాలుపితకడం నేర్పమని కట్టడిచేస్తాను; వంట పనిలో ఆడవారికి సాయపడమంటాను,'' అన్నాడు కాస్త కోపంగా.

రాజు చిన్నగా నవ్వాడు. సేనాధిపతి రాజుకన్నా ఒకటి రెండేళ్ళు చిన్నవాడు. అందువల్ల రాజుకు అతడంటే ఎంతో ఆప్యాయత.

''పశులకాపరులకూ, ఆడవారికీ సాయపడడం హీనం కాదు వీరసింహా. ఎదుటివారి ప్రాణాలు తీసి వారి ఆస్తిపాస్తులను అపహరించడంకన్నా ఇది ఎంతో ఉన్నతమైన కృత్యం కాదా! నిదానంగా ఆలోచించు. శాంతి విలువ నీకే అవగతమవుతుంది,'' అన్నాడు రాజు.

అప్పుడు అక్కడికి మంత్రి రావడంతో, సేనాధిపతి ఆ విషయాన్ని అంతటితో వదిలి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. రాజు మంత్రితో వేరొక విషయం గురించి చర్చించసాగాడు.

ఆనాటిరాత్రి సేనాధిపతి వీరసింహుడు దళనాయకులయిన తన అనుచరులు కొందరిని, రహస్యంగా ఒకచోట సమావేశపరచి, ''ఈ రోజు నుంచి, సైనికులయిన మిమ్మల్ని ఖడ్గాలను అవతలపెట్టి, పొలాలలో నాగళ్ళు పట్టమంటున్నాడు మన మహారాజు. ఆడవాళ్ళు వంట చేయడానికి మిమ్మల్ని వంటచెరకు అందించమంటున్నాడు మన మహారాజు!'' అన్నాడు.

దళనాయకులు, అమితాశ్చర్యం చెందారు. కొంతసేపు మౌనం వహించి వీరసింహుడు మళ్ళీ, ''మిత్రులారా, మనం సైనికులుగా శిక్షణ పొందినవాళ్ళం. సాహసం మన ప్రాణం. ఖడ్గ



చాలనం మన ప్రధాన కర్తవ్యం. వీరులమయిన మనం మన కర్తవ్యం మరిచిపోయి మన ఖడ్గాలను తుప్పుపట్టనిస్తామా?'' అని అడిగాడు ఆవేశంగా.

''పట్టనివ్వం!'' అన్నారు వాళ్ళు ముక్తకంఠంతో.


"అరవకండి. గోడలకు చెవులుంటాయి!" అని హెచ్చరించాడు వీరసింహుడు.

వీరసింహుడు ఎంతో జాగ్రత్త తీసుకున్నప్పటికీ, అతడి రహస్యాలోచన వార్త చారుల ద్వారా రాజుకు అందింది. కాని అతడి పథకాల వివరం తెలియలేదు. అయినా, రాజు ఆ విషయాన్ని అంతగా పట్టించుకోలేదు. రాజు స్వతహాగా మంచివాడు కావడంవల్ల, తన బంధువు అంతటి ఘోరకృత్యానికి పాల్పడగలడని ఊహించలేకపోయాడు. పైగా రాజకుమారుడి రెండవ జన్మదినం సమీపిస్తున్నది. రాజూ, మంత్రీ, ఇతర రాజోద్యోగులూ జన్మదినోత్సవ వేడుకల సన్నాహంలో నిమగ్నులై వున్నారు. జన్మదిన వేడుకలను అన్నదానాలతో, నృత్యగానాలతో అతి వైభవంగా జరపడానికి ఏర్పాట్లు జరుగుతున్నవి. తోరణాలు కట్టడానికీ, వేదికలు నిర్మించడానికీ వందలాదిమంది పనివాళ్ళు నియోగించబడ్డారు. బాణాసంచా వేడుకలు జరపడానికి నిపుణులు ఆయత్తమవుతున్నారు. ఈ ఉత్సవం ముగిసిన తరవాత వీరసింహుడితో మాట్లాడుదామనుకుని రాజు, ఆ విషయం గురించి ఉదాసీనం వహించాడు.

యువరాజు జన్మదినంనాడు, వేకువజామునుంచే శాంతిపురంలో మంగళవాయిద్యాలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. రాజప్రాసాదం లోపల అందంగా అలంకరించబడిన విశాలమైన మండపంలో రాణి తన బిడ్డను ఒడిలో కూర్చోబెట్టుకుని, ఉన్నతాసనంపై ఆసీనురాలయింది. ఆమె వెనుక చెలికత్తెలు నిలబడ్డారు. వందలాది స్త్రీపురుషులు తండోపతండాలుగా, రాణికీ,

రాకుమారుడికీ శుభాకాంక్షలు తెలియ జెప్పడానికి వచ్చారు.

అలా చాలాసేపు కూర్చోవడానికి రాణి గారికి ఇబ్బందిగానే ఉన్నది. అయినా రాజుపట్లా, రాజకుటుంబంపట్లా ప్రజలు చూపుతున్న ప్రేమకూ, భక్తికీ ఆమె ముగ్ధురాలయింది. రాత్రి అయ్యాక, నిద్రిస్తున్న బిడ్డ నెత్తుకుని రాణి శయన మందిరం చేరింది.



జరుగనున్న బాణాసంచా వేడుకలను తిలకించడానికి రాజభవనం ఎదుట వేలాదిమంది జనం గుమిగూడారు. ఒక వైపున నాట్యాలు, జరుగుతున్నవి. మరొక వైపున హాస్యనాటకం చూస్తూ జనం విరగ బడి నవ్వుతున్నారు. అక్కడి వాతావరణం కోలాహలంగా ఉన్నది. సాధారణంగా రాజప్రాసాద ద్వారాలను ఎప్పుడూ భటులు కాపలా కాచేవారు. కాని, ఉత్సవ కారణంగా ఆ రోజు రాకపోకలు సుల భంగా వుంటుందని తలుపులు బార్లా తెరిచి ఉంచారు!

రాణి శయనించబోతున్న సమయంలో, రాజు శయనమందిరంలోకి ప్రవేశించాడు. రాజు ఆగమనానికి రాణి కాస్త ఆశ్చర్యం చెందినా, ఆయన్ను చూసి చిన్నగా నవ్వింది. అంతకుపూర్వం రాజు ఎప్పుడు గాని అలా హఠాత్తుగా ప్రవేశించలేదు.

''మీరు చాలా అలిసిపోయినట్టున్నారు మహారాజా!'' అన్నది రాణి.

రాజు ఏమీ మాట్లాడలేదు. చెలికత్తె కేసి చూశాడు. ఆమె అక్కడి నుంచి వెళ్లి పోయింది.

''ఏమయింది మహారాజా?'' అన్నది రాణి ఎంతో ఉత్కంఠతో.

రాజు మౌనంగా తలుపులు మూసి, గడియవేసి, నుదుటికి పట్టిన చెమట బిందువులను తుడుచుకుంటూ, ''దేవీ, ఏం జరిగిందో వివరంగా చెప్పడానికి ఇది సమయం కాదు. మన ప్రాణాలకు ఆపద వచ్చింది. నువ్వు వెంటనే రహస్య మార్గం కుండా తప్పించుకుపోవాలి!'' అన్నాడు.



"ఏమిటీ ? రహస్యమార్గంకుండానా?" అన్నది రాణి అమితాశ్చర్యంతో.

"అవును!" అన్నాడు రాజుగంభీరంగా.

రాణికి పిడుగుపడ్డట్టయింది. శయన మందిరం నుంచి, అరణ్యమధ్యానికి ఒక రహస్య సొరంగమార్గం ఉన్నది. ఆ రహస్యమార్గం గురించి రాజుకు ఆయన తండ్రీ, తండ్రికి ఆయన తండ్రీ చెప్పారు. రాజు శాంతిదేవుడు ఒకసారి రాణికి ఆ మార్గం చూపించాడు కూడా. ఇరువురూ కలిసి ఒకనాడు ఆ మార్గంగుండా కొంత దూరం వెళ్ళి తిరిగి వచ్చారు. సరదాకు వెళ్ళి రావడమే తప్ప ఆ మార్గంగుండా ప్రాణరక్షణకు తప్పించుకుని పారిపోవలసిన దుస్థితి ఏర్పడుతుందని రాజదంపతులు కలలో కూడా అనుకోలేదు.

"నేను ఒంటరిగానే వెళ్ళిపోవాలా ?" అన్నది రాణి భయం భయంగా.

"ఒంటరిగా కాదు; మన బిడ్డతోపాటు తప్పించుకోవాలి!" అన్నాడు రాజు.

"మిమ్మల్ని ఇక్కడ వదిలి నేనొక్కతెనే ఎలా వెళ్ళను ?" అన్నది రాణి.

"దేవీ, మన బిడ్డకోసం నువ్వు ఈ త్యాగం చెయ్యకతప్పదు. శత్రువుల గురి నామీదే ఉన్నప్పటికీ, మన ముగ్గుర్నీ హతమార్చాలని పథకం వేశారు. నేనూ మీతో కలిసి తప్పించుకున్నట్టయితే, ఎలాగయినా మనల్ని పట్టుకోవడానికి వాళ్ళు ప్రయత్నిస్తారు. కాని, నేను ఇక్కడే వుండి పోరాడినట్టయితే, తాత్కాలికంగానైనా, వాళ్ళు నిన్నూ, బిడ్డనూ మరిచిపోవచ్చు." అని వివరించాడు రాజు.

ఆ తరవాత ఆయన, వీరసింహుడు తన అనుచరులతో కలిసి రాజ్యసింహాసనాన్ని కబళించడానికి పన్నిన కుట్ర గురించీ, వేడుకల కోలాహలంలో రాజకుటుంబాన్ని సర్వనాశనం చేయడానికి వేసిన పథకం గురించీ రాణికి క్లుప్తంగా చెప్పాడు.

ఇప్పుడు రాజప్రాసాద ద్వారాలన్నీ వీరసింహుడి అధీనంలో ఉన్నట్టు రాజుకు


చారుల ద్వారా తెలిసింది. మరొక అర గంటలో ప్రజలు కనీవినీ ఎరుగని బాణా సంచా వేడుకలు జరుగనున్నవి. బ్రహ్మాండమైన భవనం వంటి బాణాసంచా ఆకాశం లోకి ఎగిసి భయంకర శబ్దంతో పేలుతుంది. ప్రజలందరూ ఆ వేడుకలలో లీనమై ఉన్నప్పుడు, వీరసింహుడూ అతని అనుచరులూ రాజప్రాసాదంలో జొరబడి, రాజ కుటుంబాన్ని సర్వనాశనం చేసేస్తారు!

"మీ అంగరక్షకులు ఏమయ్యారు?" అని అడిగింది రాణి కన్నీళ్ళతో.

"వేడుకలు చూడమని వాళ్ళందరినీ నేనే పంపాను. ఇప్పుడు నేను రాజ ప్రాసాదం నుంచి బయట అడుగు మోపలేను. వీరసింహుడి భటులు ద్వారాలను కాపలా కాస్తున్నారు. వాళ్ళకంటబడకుండా వెళ్ళడం అసాధ్యం. మనమిప్పుడు ఇలా బందీలుగా వున్న విషయం బయట ఏ ఒక్కరికీ తెలియదు!" అన్నాడు రాజు విషాదంగా నవ్వుతూ.

"ఇప్పుడు మీరేం చేయాలనుకున్నారు?" అన్నది రాణి.

"వాళ్ళ నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తాను. సాధ్యం కానప్పుడు, ఎదిరించి పోరాడతాను. నువ్వు నేను చెప్పిన ప్రకారం చేశావంటే మనకు విజయం సగం సమకూరినట్టే!" అన్నాడు రాజు.



"నన్నేంచేయమనిఆజ్ఞ," అన్నదిరాణి, దిగులుగా.

"దేవీ, కాలయాపన చేయకుండా ఇక్కడి నుంచి పారిపో. నువ్వూ, బిడ్డా క్షేమంగా వుంటే అదే నాకు ఒక విధమైన విజయం. నిజం చెప్పాలంటే శత్రువుల దాడిని ఎదుర్కొని బయటపడగలననే నమ్మకం నాకు లేదు. ఇక వాదవివాదాలు వద్దు," అన్నాడు రాజు గద్గద స్వరంతో.

"మిమ్మల్ని మృత్యువుకు అప్పగించి, నేనుమాత్రం తప్పించుకుని పారిపోలేను," అని విలపించింది రాణి.

రాజు ఆ మాటలేవీ వినిపించుకోలేదు. ఆయన రహస్యమార్గాన్ని తెరవడంలో

లీనమయ్యాడు. ఎవరూ అనుమానించడానికి వీలుకాకుండా, శయనమందిరం ద్వారం దగ్గరే రహస్య మార్గద్వారం కూడా ఉన్నది!

రహస్యమార్గద్వారం తెరుచుకున్నది. రాజు చీకటిగా వున్న మార్గంలోకి తొంగి చూస్తూ, రాణితో, "ఒక చేతిలో బిడ్డనూ, మరొక చేత్తో కాగడానూ పట్టుకుని ఈ మార్గంలో ప్రవేశించు. సొరంగమార్గంలో ప్రతి ఐదువందల గజాలకూ ఒక మణి చొప్పున పన్నెండు మణులు పొదిగివున్న సంగతి నీకు తెలుసు. చీకట్లో అవి మెరుస్తూ వుంటాయి. కాగడా వెలుతురు పడినప్పుడు అవి మరింత ప్రకాశిస్తాయి. చిట్టచివరి మణిని చేరాక దానిని రెండు మూడుసార్లు కదిలించావంటే అవతలి ద్వారం తెరుచుకుంటుంది!" అన్నాడు.

రాజమందిరం వెలుపల వినిపిస్తూన్న నవ్వులూ, మాటలూ ఆగిపోయాయి.

"వీరసింహుడు వస్తున్నట్టున్నది దేవీ, వెళ్ళిరా. ఈ జన్మలో కాకపోతే వచ్చే జన్మలోనైనా తప్పక కలుసుకుందాం," అంటూ రాజు, నిద్రపోతూన్న బిడ్డను రాణి చేతుల్లో పెట్టాడు. ఆ తరవాత కాగడాను అందించి, ఆమె సొరంగ మార్గంలో దిగడానికి సాయపడ్డాడు.

కన్నీళ్ళతో తనకేసి దీనంగా చూస్తూన్న రాణితో, "నిన్నీవిధంగా పంపడానికి నాకు బాధగానే ఉన్నది. అయినా మన బిడ్డ కోసం ఈ పని చేయక తప్పడం లేదు, దేవీ," అన్నాడు రాజు.

కొంతసేపటికి రాణిని చీకటి ఆవరించుకున్నది.

రహస్యమార్గం తలుపులు మూసిన మరుక్షణమే, వెలుపలినుంచి దిక్కులు పిక్కటిల్లే బ్రహ్మాండమైన శబ్దం వినిపించింది. బాణాసంచా వేడుకలు జరుగుతున్నవి.

తలుపులను ఎవరో దబదబా బాదడం వినిపించింది. రాజు వెంటనే కత్తిదూసి, "ఎవరక్కడ?" అన్నాడు గంభీర స్వరంతో. —(ఇంకావుంది)





2

[సుమేధరాజ్య రాజధాని శాంతిపురం సుసంపన్ననగరం. రాజు శాంతిదేవుడు శాంతిప్రియుడు. రాజబంధువయిన సేనాధిపతి వీరసింహుడు, ప్రజలందరూ ఉత్సవవేడుకలలో నిమగ్నులై ఉన్నప్పుడు రాజకుటుంబాన్ని హతమార్చాలని కుట్రపన్నాడు. విషయం తెలిసిన రాజు, తన రెండేళ్ళ కుమారుణ్ణీ, రాణినీ రహస్య సొరంగ మార్గంగుండా పంపి వేశాడు. తరవాత—]

"తలుపు తెరువు!" అని కఠిన స్వరంతో కేకలు వినిపించాయి. రాజు శాంతిదేవుడు కొంతసేపు మౌనం వహించాడు. మళ్ళీ తలుపును దబదబా బాదుతూ, "తలుపు తెరువు!" అని అరవడం రాజుకు వినిపించింది. ఆయన కిటికీలోని రహస్య ద్వారం గుండా చూశాడు. వెలుపల ముఖ పరిచయం లేని పదిమంది భటులు రాజుకు కనిపించారు. బహుశా, వీరసింహుడు వాళ్ళను పొరుగురాజ్యం నుంచి రప్పించి ఉంటాడు. వాళ్ళు భీకరంగా చిందులు వేస్తున్నారు.

ఎంత అరిచినా తలుపు తెరవకపోయే సరికి భటుల ఓర్పు నశించింది. తలుపును బద్దలు కొట్టాలని, వాళ్ళు పెద్ద దూలాన్ని తలుపుకు ఢీకొట్టించడానికి పూనుకున్నారు. ఆ దూలం తాకిడిని తలుపు తట్టుకోజాలదని రాజు గ్రహించాడు. భటులు దూలాన్ని



భుజాలపై మోసుకువచ్చి, దానితో బలంగా తలుపును ఢీకొట్టించాలని, పదడుగులు వెనక్కు వేసి వేగంగా ముందుకు ఉరికే సమయం చూసి రాజు చటుక్కున తలుపు తెరిచాడు. అంతే, దూలంతోపాటు భటులు ముందుకు పడిపోయారు. మరుక్షణమే రాజు కత్తిదూసి, మెరుపులా ముందుకు దూకాడు. భటులు పరిస్థితి గ్రహించేలోగా వాళ్ళలో ఇద్దరి తలలు ఎగిరిపోయాయి.

''తప్పించుకున్నాడు, తప్పించుకున్నాడు!" అని అరిచారు మిగిలిన వాళ్లు.

"పట్టుకోండి. ఎలాగైనా వాణ్ణి చంపండి. వదిలారంటే మీ తలలు ఎగిరిపోతాయి. జాగ్రత్త!'' అని దూరం నుంచి ఒక భీకర కంఠస్వరం ఆజ్ఞాపించింది. అది సేనాధిపతి వీరసింహుడి కంఠస్వరం అని రాజు గ్రహించాడు.

రాజప్రాసాదానికి వెలుపల బాణాసంచా వేడుకలు బ్రహ్మాండంగా జరుగుతున్నవి. ఆకాశాన్నంటే కృత్రిమ వృక్షాకారంతో రకరకాల బాణాసంచాలు వింత వింత రంగులతో, చెవులు తూట్లుపడే శబ్దంతో పేలుతున్నవి. రాజభవనం లోపల జరుగుతూన్న పోరాటం గురించి అక్కడివాళ్ళలో ఏ ఒక్కరికీ తెలియదు!

రాణిగారి భవనం నిండా ఎన్నో గదులూ, మంటపాలూ ఉన్నాయి. కాని వాటి ద్వారాలన్నీ మూసి ఉన్నాయి. ఒక వేళ రాజూ, రాణీ తప్పించుకుని అడుగు బయటపెడితే, వాళ్ళను హతమార్చడానికి సిద్ధంగా, ఒక్కొక్క ద్వారం దగ్గరా, వీరసింహుడి భటులు కత్తులు దూసి కాపలా కాస్తున్నారు!

ఎదురుగా ఉన్న మెట్లకేసి రాజు వేగంగా పరిగెత్తాడు. అక్కడ కాపలా కాస్తున్న భటుడు రాజుపై కత్తి దూశాడు. అయినా, రాజు చటుక్కున తల కిందికి దించి, కత్తివేటు తప్పించుకుని, ఒక్క గెంతున సైనికుణ్ణి కిందికి తోసి చకచకా మెట్లెక్క సాగాడు. మెట్లచివర, పైన ఉన్న తలుపు



మూసి ఉన్నది. రాజు గడియ తీయసాగాడు. అప్పుడు ఇద్దరు భటులు ఆయనకేసి పరిగెత్తివచ్చారు. కాని, రాజు ఒక్క వేటుతో వాళ్ళిద్దరినీ కిందికి తోశాడు. వాళ్ళు భీకరంగా కేకలు పెడుతూ మెట్లపైబడి దొర్లుకుంటూ కిందపడ్డారు. రాజు తలుపు తెరిచి మేడమీదికి వెళ్ళి నిలబడ్డాడు.

రాజ ప్రాసాదానికి వెలుపల జరుగుతూన్న బాణాసంచా వేడుకలను చూసి జనం ఆనందోత్సాహాలతో ఉప్పొంగిపోతూ కేకలు వేస్తున్నారు; చప్పట్లు కొడుతున్నారు. అమాయకులైన శాంతిపుర ప్రజలు తమ యువరాజు జన్మదినోత్సవాన్ని కోలాహలంగా జరుపుకుంటున్నారు. తమ యువరాజూ, రాజదంపతులూ మృత్యువుతో ముఖాముఖి పోరాటం సాగిస్తున్నారన్న సంగతి వాళ్ళకు తెలియదు పాపం! భక్తి గౌరవాలతో చూసే ప్రజలకూ, రాజుకూ మధ్య కొన్ని గజాల దూరం మాత్రమే ఉన్నది. అయినా, వాళ్ళను చేరుకునే మార్గం రాజుకు కనిపించడం లేదు!

ఎవరో గబగబా మెట్లెక్కి వచ్చే అడుగుల చప్పుడు రాజుకు వినిపించింది. రాజు తలుపు దగ్గర నిలబడి, "ఎవరైనా నన్ను పట్టుకోవాలని ప్రయత్నించారో ప్రాణాలు దక్కవు, జాగ్రత్త!" అని హెచ్చరించాడు.

"వాణ్ణి చంపండి! పెట్టెనిండా బంగారం బహుమతిగా పొందండి!" అని మెట్లదిగువన నిలబడి ఒకడు వాళ్ళను ఉత్సాహపరుస్తున్నాడు. పేరాశ మనుషుల చేత ఎటువంటి చెడ్డపనులనయినా చేయిస్తుంది. మూర్ఖుల్ని గాడిదలు చేస్తుంది.

"బంగారం! బంగారం!!" అని అరుస్తూ ఇద్దరు భటులు ఒకరిని మించాలని మరొకరు పోటీపడి కత్తిదూసి రాజుకేసి మెట్లెక్కసాగారు.

"ఇదిగో పెట్టెనిండా బంగారం. అందుకోండి," అంటూ రాజు వాళ్ళపైకి కత్తి

చూశాడు. మరుక్షణమే వాళ్ళ చేతుల్లోని కత్తులు ఎగిరి దూరంగా పడ్డాయి. 'అమ్మా' అని చావుకేకలు పెడుతూ వాళ్ళు కిందికి దొర్లిపడ్డారు!

రాజు ప్రస్తుతం సురక్షిత స్థానంలోనే ఉన్నాడు. మెట్లమీదుగా ఎందరు వచ్చినా సరే వాళ్ళను ఆయన అవలీలగా తన కత్తికి ఎరచేయగలడు. అయితే, వీరసింహుడి బలగంలో కొంతమంది, మరొకవైపునుంచి పొడవాటి నిచ్చెన సాయంతో మేడమీదికి రావడానికి ప్రయత్నిస్తున్నారు. రాజు ఈపరిణామాన్ని ముందుగానే ఊహించాడు. ఒకవైపు మెట్లెక్కి వస్తూన్న వారితో పోరాడుతూనే, మరొకవైపుకేసి అప్పుడప్పుడు చూస్తున్నాడు. హఠాత్తుగా ఒక భటుడు మేడమీదినుంచి ఈటెను తనకేసి గురిపెడుతూ రావడం రాజు గమనించాడు. రాజు చటుక్కున కిందికి వంగి, ఒక్క ఊపుతో ముందుకు దూకి ఒక్క తాపు తన్నాడు. ఈటెతో వచ్చిన భటుడు కీచుమని అరుస్తూ నేలపైబడ్డాడు. రాజు వంగి కిందికి చూశాడు. ఇంకా కొందరు నిచ్చెన ఎక్కి వస్తున్నారు. వెంటనే ఆయన నిచ్చెనను కాలితో తన్నాడు.

అయితే, ఈ లోపుగానే మరి కొందరు భటులు మెట్లదారిగుండా మేడపైభాగానికి వచ్చారు. ఇంకా కొందరు వస్తున్నారు. ఇదే విధంగా వాళ్ళతో పోరాడడం అంత ప్రయోజనకరం కాదనీ, పరిస్థితి మరింత ప్రమాదకరంగా పరిణమించగలదనీ రాజు




గ్రహించాడు. వీరసింహుడు కనీసం వంద మందినైనా వెంటబెట్టుకుని వచ్చి వుంటాడు. కొంతసేపటికి వాళ్ళందరూ తనను చుట్టుముట్టవచ్చు. ఒంటరిగా తను ఎంతమందినని చంపగలడు? మరణం తప్ప మరొక మార్గాంతరం కనిపించడం లేదు. రాజుకు మరణిస్తాననే భయం కలగలేదు. తన బిడ్డనూ, రాణినీ సారంగ మార్గంగుండా తెలియని చోటికి పంపి వేయడం ఆయనకు ఎంతో తృప్తినిచ్చింది. తెలిసవచ్చే మరణాలకన్నా, ఏమవుతుందో తెలియని పరిస్థితే నయమేమో!

శత్రుసైనికులు రాజును సమీపించారు. రాజు తలమీదుగా ఆకాశంలో ఒక బాణా సంచా పేలింది. మెరుపులాంటి దాని వెలుతురులో, భటుల వెనక నిలబడి వున్న వీరసింహుడి ముఖం రాజుకు కనిపించింది.

"నమ్మకద్రోహీ, పాపాత్ముడా, కాచుకో," అంటూ రాజు ఆగ్రహంతో తన నడుముకు వేలాడుతూన్న చురకత్తి తీసి వీరసింహుడి మీదికి విసిరాడు. వీరసింహుడు పక్కకు తప్పుకోవడంతో చావు తప్పించుకున్నాడు. కాని, వాడి ఎడమ చెవి కొద్దిగా తెగిపోయింది.

"చంపండి వాణ్ణి!" అంటూ వీరసింహుడు పట్టరాని ఆగ్రహంతో బిగ్గరగా కేకపెట్టాడు. భటులు అమితోత్సాహంతో రాజును సమీపించబోయారు. కాని, రాజు, ఈలోగా వీరసింహుడి భటులు మళ్ళీ





మేడపైకి వేసిన నిచ్చెనగుండా కిందికి దిగసాగాడు.

"నిచ్చెనను కిందికి తోయండి, కిందికి తోయండి," అని ఆజ్ఞాపించాడు వీరసింహుడు. ఆ సమయంలో వాడి భటులు ఒకరిద్దరు నిచ్చెన ఎక్కుతున్నారు. అయినా మేడపైనున్న భటులు నిచ్చెనను కిందికి తోసేశారు. అయితే, ఈ లోపలే రాజు సగందూరం కిందికి వచ్చేశాడు కాబట్టి, ఆయన సులభంగా కిందికి దూకి నిచ్చెనను ఎత్తి, పక్కనే ఉన్న ఎత్తయిన ప్రహరీ గోడకు చేరవేశాడు!

"నిచ్చెనను కిందికి లాగండి! కిందికి లాగండి!" అంటూ మేడమీదినుంచి వీరసింహుడు అరవసాగాడు. అయినా, ఆసరికి వాడి భటులందరూ మేడమీదికి చేరారు. రాజును ఎలాగైనా పట్టుకుని పెట్టెనిండా బంగారమూ, వీరసింహుడి అభిమానమూ పొందాలన్న ఉత్సాహంతో భటులందరూ మేడపైభాగానికి చేరారు. కిందవున్న భటులిద్దరూ నిచ్చెనపైనుంచి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డారు. వాళ్ళు లేచి నిలబడి కుంటుకుంటూ వెళ్ళి నిచ్చెనను లాగేలోపల రాజు గోడమీదికి చేరుకున్నాడు. అయినప్పటికీ, వాళ్ళు నిచ్చెనను కిందికి లాగడానికి ఎంతో శ్రమ పడుతున్నారు.

"మూర్ఖుల్లారా, ఇంకా ఎందుకు నిచ్చెన పట్టుకుని లాగుతున్నారు? పైకి వెళ్ళి వాణ్ణి చంపండి!" అని అరిచాడు వీరసింహుడు.

ప్రహరీగోడ నానుకుని సుమతీనది ప్రవహిస్తున్నది. రాజు గోడమీద నిలబడి ఏం చేయాలా అని ఆలోచించసాగాడు. చెవితెగి నెత్తురు కారుతున్నప్పటికీ, పట్టించుకోకుండా వీరసింహుడు గబగబా కిందికి దిగాడు. రాజు ప్రాణాలతో తప్పించుకుంటే వాడి ప్రాణం దక్కదు. "ఎక్కండి. ఎక్కండి. పైకి వెళ్ళి రాజును ఎలాగైనా హతమార్చండి!" అని భటుల్ని పురికొల్పుతూ, వీరసింహుడు ఒక ఈటెను



రాజుకేసి గురిపెట్టాడు. గురిచూసి కొట్ట డంలో వీరసింహుడు కడునేర్పరి. ఆ నైపుణ్యానికి మెచ్చి, రాజు వాణ్ణి ప్రత్యేకంగా సత్కరించాడు కూడా.

వీరసింహుడు, ఈటెను గురిచూసి రాజుమీదికి విసిరాడు. వెన్నెల ఆకాశంలో ఈటె రివ్వున ముందుకు దూసుకుపోయింది. అయితే, అది రాజుకు తగిలిందా లేదా అన్నది ఎవరూ చూడలేదు. హఠాత్తుగా రాజు గోడ మీదినుంచి అదృశ్యమయ్యాడు.

వీరసింహుడు వేగంగా నిచ్చెన ఎక్కి గోడమీదికి వెళ్ళి చూశాడు. రాజు నదిలోకి పడిపోయి ఉండాలి; లేదా కావాలనే నదిలోకి దూకి వుండాలి. ఈటె తగిలివుంటే ఆయన పడిపోయి వుంటాడు. తగలకుండా ఉన్నట్టయితే, రాజు కావాలనే నదిలోకి దూకి వుండాలి. ఏం జరిగిందో తెలుసుకోవడం ఎలా? రాజు మరణించాడా? ప్రాణాలతో తప్పించుకున్నాడా? తెలుసుకోవడం ఎలా?

''నేను విసిరిన ఈటె రాజుకు తగలడం ఎవరైనా స్పష్టంగా చూశారా?'' అని అడిగాడు వీరసింహుడు తన చుట్టూ చేరిన భటులను చూసి.


పెట్టెనిండా బంగారం అందకుండా జారిపోయిందికదా అని భటులందరూ నిరుత్సాహంగా కనిపించారు.

''ప్రభువులు విసిరిన ఈటె గురి ఎలా తప్పుతుంది మహారాజా!'' అన్నాడు వాళ్ళలో ఒకడు వీరసింహుణ్ణి పొగడాలన్న ఉద్దేశంతో.

''నోర్ముయ్. నా ఈటె తగిలి రాజు నదిలోకి పడడం నువ్వు చూశావా? చూసివుంటే చెప్పు. లేకుంటే నోరు మూసుకో, పిచ్చి వాగుడు కట్టిపెట్టు,'' అన్నాడు వీరసింహుడు కోపంగా.

అందరూ మౌనం వహించారు. వీరసింహుడు వేగంగా ప్రవహిస్తూన్న నదీ ప్రవాహం కేసి చూడసాగాడు. గలగలా ప్రవహిస్తూన్న నది వాణ్ణి చూసి పకపకా నవ్వుతున్నట్టనిపించింది! -(ఇంకావుంది)





బందిపోటు యువరాజు

3

[శాంతిప్రియుడయిన సుమేధరాజు శాంతిదేవుణ్ణీ, రాణినీ, రెండేళ్ళ రాకుమారుణ్ణీ హత మార్చడానికి సేనాధిపతి వీరసింహుడు తన సహచరులతో కలిసి కుట్రపన్నాడు. విషయం తెలిసిన రాజు రాణినీ, కుమారుణ్ణీ రహస్య సొరంగమార్గం గుండా పంపివేశాడు. రాజు, వీరసింహుడి భటులతో ఒంటరిగా పోరాడి నదిలోకి దూకేశాడు. తరవాత—]

రాణి మెట్లగుండా కిందికి దిగి, కన్నీళ్ళతో పైకి చూసింది. అంతలోనే రాజు తలుపు మూసి వేశాడు. రాజును ఈ జన్మలో ఇక చూడలేనేమో అన్న భావం రాణి మనసులో బాధగా మెదిలింది. కొన్ని నిమిషాలక్రితం రాజదంపతులు ఎంత ఆనందంతో గడిపారు! ఇంతలో ఇటువంటి దుస్థితి సంభవించగలదని ఎవరు మాత్రం ఊహించగలరు?

తన వెనక తలుపు మూసుకున్నప్పుడు రాణికి ప్రపంచమే మూసుకుపోయినట్టనిపించింది. ఆమె జీవితంలో, ఇంతవరకు ఏనాడూ ఒంటరిగా పయనించి ఎరుగదు. రాకుమారిగా జన్మించి, అల్లారుముద్దుగా పెరిగి ధర్మపరుడయిన శాంతిదేవుణ్ణి వివాహమాడి రాణిగా శాంతిపురానికి వచ్చిన ఆమె ఎక్కడికి వెళ్ళినా, వెంట చెలికత్తెలు వెళ్ళేవారు!



ఆమె మౌనంగా రోదించింది. ఒడిలో బిడ్డ ఆదమరచి నిద్రపోతున్నాడు. బిడ్డ మేలుకోరాదని, రాణి, చేతిలోని కాగడా వెలుగులో జాగ్రత్తగా మెట్లు దిగి సారంగ మార్గం చేరుకున్నది. రెండుమూడు గజాల దూరం తప్ప ఆమెకేమీ కనిపించడం లేదు. కాటుకలా చీకటి కమ్ముకుని ఉన్నది. సారంగమార్గం బండలమధ్యగా తొలచబడినది. రాజప్రాసాదాన్నే, చదును చేయబడిన కొండమీద నిర్మించారన్న విషయం రాణికితెలుసు. ఇప్పుడామె కొండ లోపలి సారంగమార్గంలో పయనిస్తున్నది. ఇంకా ఎంతదూరం పయనించాలి? ఈ మార్గం ఎక్కడికి తీసుకుపోతుంది?

సారంగమార్గం తడితడిగా ఉన్నది. గాలి ఆడటం లేదు. ఏదో కాలికి అడ్డు తగలడంతో రాణి తూలిపడబోయి, ప్రయత్నం మీద నిలదొక్కుకున్నది. కాని, ఆమె చేతిలోని కాగడా ఎగిరి దూరంగాపడి ఆరిపోయింది. చుట్టూ గాఢాంధకారం. ఏమి చేయడానికీ తోచక ఆమె అలాగే నిలబడిపోయింది!

కొంతసేపటికి ఆమె కళ్ళు చీకటికి అలవాటుపడ్డాయి. దూరంగా వింతవెలుతురు ఆమె దృష్టి నాకర్షించింది. ఆమె మళ్ళీ మెల్లగా ముందుకు నడవసాగింది. మార్గానికి పక్కగోడలో పొదగబడిన మణి నుంచి ఆ వెలుగు ప్రసరిస్తున్నది. మార్గం పొడవునా అటువంటి మణులు అక్కడక్కడా కనిపించి ఆమెకుదారిచూపాయి.

ఇంతలో బిడ్డ నిద్రలేచాడు. ఆమె బిడ్డను రొమ్ముకు అదుముకుని, నిద్ర పుచ్చుతూ, వేగంగా నడిచింది. క్రమంగా రాణి బాగా అలిసిపోయింది. అడుగు తీసి అడుగువేయడం కూడా ఆమెకు సాధ్యం కాలేదు. అయినప్పటికీ, సారంగ మార్గం నుంచి ఎలాగైనా బయటపడా లన్న పట్టుదలతో, రాణి ప్రాణం బిగబట్టి నడవసాగింది.

ఆఖరికి ఆమె సారంగం చివరకు చేరుకున్నది. కాని వెలుపలికి వెళ్ళే



మార్గం ఏది? ఎదురుగుండా అడ్డుగోడ కనిపించింది. గోడ మధ్యగా కాంతివంతమైన రాతిపలక అమర్చబడి ఉన్నది. రాణి శక్తినంతా కూడగట్టుకుని దాపుననున్న మణిని రెండు మూడుసార్లు కదిలించింది. రాతిపలక పక్కకు తొలగింది. అక్కడ ఏర్పడిన ద్వారం గుండా ఆమె లోపలికి ప్రవేశించింది. మరొక విశాలమైన సొరంగం కనిపించింది. మరి కొంతదూరం వెళ్ళేసరికి, ఆమె ఒక మహారణ్యం మధ్యకు చేరుకున్నది!

వెన్నెల పిండారబోసినట్టు కాస్తున్నది. అరణ్యమంతా ప్రశాంత గంభీరంగా ఉన్నది. రాణి చల్లటి గాలిని గట్టిగా పీల్చింది. చేతిలో బిడ్డ మళ్ళీ నిద్రపోయాడు. అదీ మంచిదే అనుకున్నది రాణి. ఎందుకంటే బిడ్డ ఏడుపు ఏ వన్యమృగాలనైనా ఆకర్షించవచ్చు. ఆమెకు అప్పుడు చెప్పరానంత దాహం వేసింది. అయినా, ఈ అపరాత్రివేళ అడవిలో నీళ్ళ కోసం ఎక్కడని వెతకడం?

దూరంగా నక్కల కూతలు వినిపించాయి. తెల్లవారుతున్నది కాబోలు అని ఆమె బిడ్డను ఒడిలో పడుకోబెట్టుకుని, ఒక బండపై కూర్చున్నది. కొంతసేపటికి, ఎక్కడో నీళ్ళు ప్రవహించే శబ్దం ఆమెకు వినిపించింది. ఆమె లేచి ఆ ధ్వని వస్తున్న దిక్కుకేసి నడిచింది. అక్కడ ఒక చిన్న సెలయేరు కనిపించింది. రాణి బిడ్డను పచ్చిక మీద పడుకోబెట్టి, సెలయేటిలో నీళ్ళు తాగివచ్చి, బిడ్డకు పాలిచ్చింది.

బిడ్డ నవ్వుతూ తల్లికేసీ, చుట్టుపక్కల నూతన వాతావరణం కేసీ వింతగా చూడసాగాడు. తూర్పు దిక్కున అరుణోదయమవుతున్నది. నాలుగు వైపులా పక్షుల కలకల ధ్వనులు ఆరంభమయ్యాయి. బిడ్డ, తల్లి ఒడి నుంచి దిగి, వింత వాతావరణాన్ని చూసి ఆనందంతో తప్పటడుగులు వేస్తూ ముందుకు వెళ్ళాడు.

''బాబూ, వెళ్ళకు,'' అని పిలిచింది రాణి.



బిడ్డ రాణికేసి తిరిగి చూసి నవ్వి, మళ్ళీ ముందుకు నడిచాడు. రాణి లేచి, బిడ్డను పట్టుకోవడానికి ఒక్క అడుగు ముందుకు వేసింది. కాని, నీరసం కారణంగా నిలబడలేకపోయింది. సొమ్మసిల్లి అక్కడే పడిపోయింది.

''వెళ్ళకు బాబూ, వెళ్ళకు!'' అని మెల్లగా పిలువగలిగిందే తప్ప, అంతకు మించి ఏమీ చేయలేకపోయింది.

* * *

అరణ్యంలో నివసిస్తూన్న జయానందుడనే ముని యథాప్రకారం, సూర్యోదయానికి పూర్వమే, సెలయేటి సమీపాన గల వాగులో స్నానానికి బయలుదేరాడు.

ఆ వేకువజామున అక్కడ పసిబిడ్డ కేరింతలు విని, జయానందుడు ఆశ్చర్యంతో చుట్టుపక్కల కలయజూశాడు. దాపులనే ఒక అందమైన బిడ్డ మునిని చూసి ఆనందంతో నవ్వుతున్నాడు. ఏ దివ్యశిశువో దివి నుంచి భువికి దిగి వచ్చిందేమో అనుకుంటూ శిశువును సమీపించాడు ముని.

ఆ బిడ్డ నవ్వుతూ, పిలుస్తున్నట్టు బుల్లి చేతులను పైకెత్తాడు. ముని, బిడ్డను ఆప్యాయంగా ఎత్తుకున్నాడు. బిడ్డ మెడలో బంగారు హారం ఉన్నది. హారం మధ్య పెద్ద పతకం కనిపించింది. పతకం పైన, తామరపుష్పాన్ని తొండంతో పట్టుకున్న ఏనుగుబొమ్మ ఉన్నది. అది రాజకుటుంబానికి చెందిన ముద్రిక అని ముని గ్రహించాడు.

బిడ్డ, చేతులెత్తి పడమటి దిక్కుకేసి చూపుతూ, అటు వంగాడు. ముని ఆ వైపు కేసి నడిచాడు.

ఒత్తుగా ఉన్న పచ్చిక మీద రాణి స్పృహతప్పిపడి ఉన్నది. ముని సెలయేటి నుంచి నీళ్ళు తెచ్చి, ఆమె ముఖం మీద చల్లాడు. ఆమె మెల్లగా కళ్ళు తెరిచి, లేచి కూర్చోవడానికి ప్రయత్నించింది. కాని, సాధ్యపడలేదు.

''తల్లీ ఎవరు నువ్వు?'' అని అడిగాడు ముని ఆమె కేసి వంగి.


RAZI

''మీరు కరుణతో నన్ను తల్లీ అని పిలిచారు. నన్ను కూతురుగానే భావించండి. ఆ భగవంతుడే మిమ్మల్ని ఇక్కడికి పంపాడు. నేను దురదృష్టవంతురాలయిన ఈ రాజ్యానికి రాణిని. అర్ధరాత్రి సమయంలో శత్రువులు కోటను చుట్టుముట్టారు. అక్కడి నుంచి బిడ్డతో పాటు తప్పించుకోమని నా భర్త నన్ను ఆజ్ఞాపించాడు!'' అన్నది రాణి ఎంతో బాధగా.

''నిన్న యువరాజు జన్మదినం కదా?" అని అడిగాడు ముని.

''అవును మహాత్మా, అవును. శత్రువులు, మా బిడ్డ జన్మదిన వేడుకలను తమకు అవకాశంగా ఉపయోగించుకున్నారు!'' అన్నది రాణి నీరసంగా, గాలి పీల్చుకోడానికి కూడా ఎంతో కష్టపడుతూ.

''అలాగా! ఇక ఏమీ చెప్పకు. అంతా అర్థమయింది. నీరసంగా ఉన్నావు.'' అన్నాడు ముని. రాణి విషాదంగా నవ్వింది.

''ఇకపై మాట్లాడడానికి అవకాశమే రాదేమో అన్న భయం నాకు కలుగుతున్నది. భగవంతుడు మీ ద్వారా నా బిడ్డకు రక్షణ కల్పించాడని భావిస్తున్నాను. ఎటువంటి బాధా, భయమూ లేకుండా తృప్తిగా కళ్ళు మూస్తున్నాను. అయితే, రాజుగారు క్షేమంగా ఉన్నారని తెలిస్తే మరింత సంతోషంగా వెళ్ళిపోతాను.'' అన్నది రాణి.

''బిడ్డా, భగవదనుగ్రహమే లేకుంటే నేను ఇప్పుడిక్కడికి వచ్చి వుండే వాడినేనా? రాజుకు కూడా రక్షణ కల్పించమని కరుణామయుడైన ఆ భగవంతుణ్ణే ప్రార్థిద్దాం. ఈ తరుణంలో, ఇంతకన్నా మనం చేయగలిగిందేమీలేదు. అంతా భగవదేచ్ఛ!'' అన్నాడు ముని.

రాణి చిన్నగా నవ్వింది. పెదవులపై నుంచి నవ్వు దూరం కాకముందే, ఆమె కళ్ళు మూసుకున్నాయి. ముని నాడి పట్టి చూసి, ఇక ఆమె మూసిన కళ్ళు తెరవదని గ్రహించాడు! —(ఇంకావుంది)





4

[సుమేధరాజ్య సేనాధిపతి వీరసింహుడు, రాజకుటుంబాన్ని సర్వనాశనం చేయడానికి కుట్ర పన్నాడు. రాజు శాంతిదేవుడు, రాణినీ, తన రెండేళ్ళ కుమారుణ్ణీ రహస్య సొరంగ మార్గం గుండా పంపి, శత్రువులతో వీరోచితంగా పోరాడి, నదిలో దూకేశాడు. అరణ్యమధ్యానికి చేరుకున్న రాణి, బిడ్డను జయానందమునికి అప్పగించి కళ్ళు మూసింది. తరవాత—]

జయానందముని, రాణిగారి మృతదేహం ముందు మౌనంగా కూర్చున్నాడు. అప్పుడే మర్రిచెట్టు కొమ్మ మీదికి వచ్చిన ఒక కోతి కిచకిచమని అరిచింది.


ముని తల పైకెత్తి, ''రా, మారుతీ, దిగిరా. నీకొక కొత్త స్నేహితుడు వచ్చాడు, ఆడుకుందువుగాని,'' అన్నాడు.

కోతి ఒక్క గెంతున కిందికి దూకి ముని పక్కన వచ్చి కూర్చున్నది.

''మారుతీ, నువ్వు వెళ్ళి, వెంటనే భల్లూకిని వెంటబెట్టుకునిరా. నీ మిత్రుణ్ణి ఆమెకు అప్పగించాలి,'' అన్నాడు ముని చిన్నగా నవ్వుతూ.

కోతి ఆనందంగా లేచి, ఒక చెట్టుపై నుంచి మరొక చెట్టుమీదికి గెంతుతూ వెళ్ళిపోయింది.

యువరాజుకు తన తల్లి మరణించిందన్న విషయం తెలియదు కాబట్టి,



నవ్వుతూ తల్లి ముఖం కేసీ, ముని కేసీ చూడసాగాడు.

అప్పుడు ముని, "నువ్వు చాలా ధైర్యవంతుడివి. జీవితంలో మునుముందు ఎంతో సాధించాలి. తల్లికోసం బెంగపెట్టుకోకుండా, పెరిగి పెద్దవాడివై, ఆమె మరణానికి కారకులయిన పాపులను తగిన విధంగా శిక్షించాలి," అన్నాడు.

ఆ మాటలేవీ వినిపించుకోకుండా యువరాజు నవ్వుతూ, ముని గడ్డంతో ఆడుకోసాగాడు. ముని బిడ్డను చేతుల్లోకి ఎత్తుకుని, "నీ కంఠహారాన్ని తీసుకుంటున్నాను. హారంలోని పతకం చూస్తే, నువ్వు రాజకుమారుడివన్న సంగతి తెలిసిపోతుంది. అది క్షేమం కాదు," అంటూ బిడ్డ మెడలోని కంఠహారాన్ని మెల్లగా తీసుకున్నాడు.

ఇంతలో మారుతి అమితోత్సాహంతో, ఎక్కడలేని హడావుడి చేస్తూ, అరుస్తూ అక్కడికి వచ్చింది. తోకతో చెట్టుకొమ్మను ఒడిసి పట్టుకుని తల్లకిందులుగా వేలాడుతూ కుర్రవాణ్ణి నవ్వించడానికి ప్రయత్నించసాగింది. మారుతితోపాటు ఒక ఎలుగుబంటి కూడా వచ్చింది.

ముని ఎలుగుబంటితో, "భల్లూకీ, ఈ బిడ్డను జాగ్రత్తగా కాపాడడం నీవంతు," అంటూ యువరాజును చూపాడు.

ఎలుగుబంటి యువరాజుకేసి చేతులు సాచింది. దాని దగ్గిరికి వెళ్ళడానికి యువరాజు కాస్త భయపడ్డాడు. దానిని గ్రహించి ముని యువరాజుతో, "భల్లూకి చాలా మంచిది నాయనా, నిన్ను తల్లిలా కాపాడుతుంది. నువ్వు కోరినది ఇస్తుంది. రోజూ తప్పకుండా స్నానం చేస్తుంది. అందువల్ల ఆమె ఎంతో శుభ్రంగా వుంటుంది. నిర్భయంగా ఆమె దగ్గిరికి వెళ్ళు," అన్నాడు చిన్నగా నవ్వుతూ.

భల్లూకి రమ్మన్నట్టు తలాడించింది. యువరాజు మెల్లగా ఎలుగుబంటి కేసి నడిచాడు.

ముని ఎలుగుబంటినే కాదు; ఏ మృగాన్నయినా సరే సులభంగా మచ్చిక

చేసుకోగలడు. భయంకరమైన పులులనూ, సింహాలనూ సైతం ఆయన క్షణాలలో తన వశం చేసుకోగలడు. అంతేకాదు; వన్యమృగాలనన్నిటినీ తన అదుపు ఆజ్ఞలలో వుంచుకునే అపూర్వశక్తి ఆయనకున్నది. అయినా, ఈ విషయం అందరికీ తెలియదు. కావాలనే ఆయన ఆ సంగతిని రహస్యంగా దాచాడు.


ఆశ్రమంలో ఆయనతోపాటు శేఖరుడు, గోవిందుడు అనే ఇద్దరు శిష్యులు మాత్రమే వున్నారు. ధ్యాన పద్ధతులనూ, యోగాన్నీ అభ్యసిస్తూ, వాళ్ళు గురువుకు సేవలు చేస్తూ కాలం గడుపుతున్నారు. నిజానికి మునికి ఎలాంటి మానవ సహాయమూ అవసరంలేదు. ఎందుకంటే ఆయన కనుసన్నలలో మెలగడానికీ, కావలసిన పనులు చేసి పెట్టడానికీ వన్యమృగాలన్నీ సిద్ధంగా వున్నాయి.

శిష్యులిద్దరూ, యువరాజు జన్మదిన వేడుకలను చూడడానికి రాజధానీ నగరానికి వెళ్ళారు.

అప్యాయంగా చేతులు సాచిన భల్లూకి అనురాగానికి ముగ్ధుడై యువరాజు చిన్నగా నవ్వుతూ దానిని సమీపించాడు. అది వెంటనే బిడ్డను చంకకెత్తుకుని, వెనుతిరిగి ముందుకు నడిచింది. మారుతి పట్టరాని ఆనందంతో నాట్యం చేస్తూ దాని వెంట బయలుదేరింది.

ముని సంతోషంగా, ఆ దృశ్యం కేసి చూస్తూ కొంతసేపు అలాగే నిలబడ్డాడు.





వాళ్ళు కనుమరుగయ్యాక, ఆయన దృష్టి రాణిగారి కాయంమీదికి మళ్ళడంతో, ఆయన హృదయం మళ్ళీ విచారంతో నిండి పోయింది.

సూర్యోదయమై నాలుగు దిక్కులూ తెల్లబడ్డాయి. పక్షుల కిలకిల ధ్వనులు ఎక్కువయ్యాయి.

ఇంతలో శిష్యులిద్దరూ ఎంతో ఆదుర్దాగా గురువు వద్దకు వచ్చారు.

"ఏమిటి విశేషాలు?" అన్నట్టు చూశాడు ముని.

"చాలా విషాదకరమైన వార్తను తీసుకు వచ్చాము గురుదేవా, రాజకుటుంబం ఆపదలపాలయింది. రాజుగారు మరణించారన్న వదంతులు ప్రబలాయి!" అన్నాడు శేఖరుడు.

"రాణిగారు ఏమయ్యారో, ఎక్కడికి వెళ్ళారో, ఎవ్వరికీ తెలియదు," అన్నాడు గోవిందుడు.


మునిగాఢంగా నిట్టూర్చి, ఎడమవైపుకు తిరిగాడు. శిష్యులిద్దరూ ఆ వైపుకేసి చూసి ఆశ్చర్యంతో ఒక్క అడుగు వెనక్కు వేశారు. ఆ తరవాత తేరుకుని, రాణిగారిని సమీపించి చూసి, "రాణి మరణించిందా?" అని అడిగారు.

"అవును, శత్రువుల కత్తి నుంచి తప్పించుకున్నది గాని, ప్రాణసమానమైన రాజు నుంచి హఠాత్తుగా దూరమయ్యామన్న అదురుపాటును రాణి భరించలేక పోయింది. ఇక్కడికి వచ్చి, బిడ్డను మనకు అప్పగించి శాశ్వతంగా కళ్ళు మూసింది! యువరాజును ఇప్పుడే భల్లూకి తీసుకు వెళ్ళింది," అన్నాడు ముని.

శేఖరుడు గట్టిగా నిట్టూర్చి, "వివాహమహోత్సవంలో రాణిగారిని మొట్ట మొదట చూశాను. మూడు నాలుగేళ్ళు గడిచిపోయినా, ఆమె రూపంలో ఎటువంటి మార్పూ కనిపించడం లేదు," అన్నాడు.

"రాజుగారి లాగానే రాణిగారు కూడా ప్రజలపట్ల ఎంతో కరుణ చూపేవారని


RAZI



అందరూ చెప్పుకుంటారు. అటువంటి వారికి ఇలాంటి దుస్థితి ఏర్పడడం ఘోరం,'' అన్నాడు గోవిందుడు.

''రాణి మనపట్ల చూపిన నమ్మకాన్ని వృథా చేయకూడదు. ఆమె బిడ్డను శ్రద్ధగా పెంచి పెద్ద చేయడం మన బాధ్యత.'' అన్నాడు ముని.

''మీ ఆజ్ఞను శిరసా వహిస్తాము, గురుదేవా,'' అన్నారు శిష్యులిద్దరూ ముక్తకంఠంతో.

''ఇప్పుడు రాణిగారి భౌతిక కాయం సంగతి ఆలోచించాలి. రాజు ఏమయ్యాడో, ఎక్కడున్నాడో తెలియదు. శత్రువుల బలం ఎటువంటిదో కూడా మనకు తెలియదు. ఎందుకయినా, రాణిగారి మరణవార్తను రహస్యంగా వుంచడం మంచిది.'' అన్నాడు ముని.

''మరణవార్త తెలిసినంత మాత్రాన శత్రువులు ఏం చేయగలరు? అసలు ఆమె ప్రాణాలతో లేదుకదా!'' అని అడిగాడు శేఖరుడు.

''రాణిగారినేమీ చేయలేరన్న మాట వాస్తవమే. కాని ఆమె ఈ ప్రాంతంలో మరణించిందని తెలియగానే, యువరాజు కోసం వెతికించవచ్చు; వాళ్ళు బిడ్డకు అపకారం తలపెట్టవచ్చుకదా!'' అన్నాడు ముని.

''నిజమే గురుదేవా. మరి ఇప్పుడు రాణిగారి మృతదేహాన్ని దహనంచేయాలా? సమాధి చేయాలా?'' అని అడిగారు శిష్యులిద్దరూ.

''అది రాణి అభీష్టానుసారమే జరగాలి ఆమె కోరిక ఏమిటో తెలుసుకోవాలి!'' అని, ముని మౌనంగా వాగులో స్నానం చేసివచ్చి, రాణిగారి మృతదేహం పక్కన ధ్యానంలో కూర్చున్నాడు. కొంత సేపయ్యాక కళ్ళు తెరిచి, ''ఆమె కాయాన్ని సమాధి చేయాలనే రాణి ఆత్మ కోరుతున్నది. పైగా భూస్థాపితం చేయడానికి ముందు, తన శరీరం మీద తన కుమారుడిచేత కొన్ని పువ్వులు ఉంచమని

కూడా ఆమె కోరింది. ప్రాణం పోయిన వెంటనే కాయాన్ని పాతిపెట్టడం శుభం కాదు. ఎందుకంటే భౌతిక కాయం చుట్టూ కొంతకాలం ఒక విధమైన అదృశ్య ప్రకాశం వుంటుంది. అది మాయమయ్యే వరకు శరీరాన్ని అలాగే వుంచాలి. కాబట్టి సూర్యాస్తమయం వరకు ఈ కాయం ఇక్కడే వుండాలి. మీరు ఇక్కడే వుండండి,'' అన్నాడు ముని.

''కట్టెలు కొట్టేవాళ్ళెవరయినా ఇటు వైపువస్తే రహస్యం బయటపడుతుంది కదా గురుదేవా ?'' అని అడిగారు శిష్యులు.

''అదీ నిజమే. వాళ్ళేమో మంచివాళ్ళే. అయినా ఈ విషయంలో మనం ఏమాత్రం అజాగ్రత్త వహించకూడదు,'' అంటూ ముని కళ్ళు మూసుకుని ఏదో మంత్రం జపించాడు. మరుక్షణమే దూరంగా పులుల గాండ్రింపు వినిపించింది. మరి కొంతసేపటికి ఆ ధ్వనులు దగ్గరయ్యాయి. భయంకరమైన ఒక మగపులీ, ఒక ఆడ పులీ, మూడు పులి పిల్లలూ అక్కడికి వచ్చాయి. పెద్ద పులులు రెండూ తలలను ముని పాదాలకు తాకించాయి. పులి కూనలు మూడూ సంతోషంగా గెంతుతూ ముని దగ్గరికి వచ్చాయి. రెండు పిల్లలను ఆయన చేతులలోకి తీసుకున్నాడు. మూడవ పులిపిల్ల ఎగిరి ముని భుజం మీద కూర్చున్నది.

పులులతో ముని, ''సూర్యాస్తమయం వరకు మీరిక్కడే వుండి, అప్పుడప్పుడూ గాండ్రిస్తూ వుండాలి. మానవమాత్రులెవరూ ఈ దరిదాపులకు రాకూడదు. ఇక్కడ వున్న ఈ శవం ఎవరికంటా పడకూడదు. తెలిసిందా,'' అన్నాడు.

''అలాగే,'' అన్నట్టు పులులు రెండూ మెల్లగా గాండ్రిస్తూ తలలూపాయి.

ముని శిష్యులవైపు తిరిగి, ''ఇప్పుడు మనం సరైన స్థలంలో గొయ్యి సిద్ధం చేయాలి. ఈలోగా రాణి కాయం మీద పువ్వులు వుంచడానికి, యువరాజును కూడా ఇక్కడికి తీసుకురావాలి,'' అన్నాడు. —(ఇంకావుంది)





బందిపోటు యువరాజు

5

[సుమేధ రాజకుటుంబాన్ని హతమార్చి, రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి సేనాధిపతి వీరసింహుడు కుట్రపన్నాడు. రాజు శాంతిదేవుడి ఆజ్ఞప్రకారం, రాణి సారంగమార్గం గుండా వెళ్ళి అరణ్యమధ్యం చేరుకుని, తమ రెండేళ్ళ కొడుకును, జయానందమునికి అప్పగించి కళ్ళు మూసింది. రాజువీరోచితంగా పోరాడి నదిలోకి దూకేశాడు. —తరవాత]

రాజప్రాసాదం లోపల జరిగిన పోరాటం గురించి, వెలుపల క్రిక్కిరిసి వున్న జనసమూహంలో ఏ ఒక్కరికీ తెలియదు. కొందరు యువరాజు జన్మదినసందర్భంగా ఏర్పాటు చేసిన బాణాసంచా వేడుకలను చూడడంలో లీనమైపోయారు. మరి కొందరు ఆటపాటలను, చూడడంలో తన్మయులైపోయారు. ఇంకా కొందరు అందమైన దీపాలంకరణలనూ, జనసందోహాన్నీ చూస్తూ అటూ ఇటూ తిరగసాగారు.

ఇలా రాత్రి మూడోజాముకరకు గడిచిపోయింది. నాలగవజాముకల్లా ఒక్కొక్క కార్యక్రమం పూర్తికావడంతో వేడుకల సందడి తగ్గుముఖం పట్టింది. ఎక్కడ చూసినా కాలిపోయి కింద పడివున్న బాణాసంచాలు చెల్లాచెదరుగా నిర్జీవంగా కనిపించాయి. నటీనటులూ, నర్తకులూ



తమ తమ వేషాలనూ, అలంకరణలనూ తీసి వేయసాగారు. జనం మెల్లగా తమ తమ ఇళ్ళకు చేరుకోసాగారు.

రాజభవనంలో పని చేసేవాళ్ళందరినీ ఒక్కచోట గుమిగూడమని వాళ్ళ అధికారి అజ్ఞాపించాడు. అతడు ఒక ఎత్తయిన వేదిక మీద నిలబడి, "రాజ్యాధికారం ఇప్పుడు శాంతిదేవుడి నుంచి సేనాధిపతి వీరసింహుడి వశమయింది. ఎందుకిలా జరిగిందని మీరెవ్వరూ అడగకూడదు. అది, ఇప్పటి మన రాజుకూ, మునుపటి రాజుకూ సంబంధించినవ్యవహారం. అందువల్ల ఈ విషయంగా మీరెవ్వరూ నోరు కదపకూడదు. ఒకరితో ఒకరు చర్చించుకోకూడదు. ఇది రాజాజ్ఞ. ఇక వెళ్ళి మీమీ పనులు చూడండి," అని ఆజ్ఞాపించాడు.

సేవకులందరూ తలలు వంచుకుని మౌనంగా తమ పనులకు వెళ్ళిపోయారు.

తెల్లవారేలోపల, అధికారమార్పిడి గురించి నగరం నాలుగు మూలలా చాటింపు జరిగింది. చాటింపు చేసే భటులకు రక్షణగా వారి కిరువైపులా ఆయుధాలు ధరించిన సైనికులు వెళ్ళారు. ఎవరైనా అధికారమార్పిడిని నిరసిస్తూ నోరుకదిపితే తలలు ఎగిరిపోతాయని సైనికులు హెచ్చరించారు. ఈ చాటింపు విని నగర పౌరులు దిగ్భ్రాంతి చెందారు. ఒక రచ్చబండవద్ద ఈ చాటింపు వినగానే ఒక వృద్ధుడు, "ఆనందకరమైన తరుణంలో ఎటువంటి దుర్వార్త వినవలిసి వచ్చింది. హతవిధీ!" అని వాపోయాడు.

మరుక్షణమే ఇద్దరు సైనికులు ఆ వృద్ధుడిపైబడి, అతణ్ణి బంధించి అవతలికి లాక్కుపోయారు.

నగరమధ్యంలో ఒకచోట, చాటింపు వినడానికి అసంఖ్యాకంగా ప్రజలు గుమిగూడారు. చాటింపు వినడంతో వాళ్ళపై పిడుగుపడ్డట్టయింది. ఎవ్వరూ నోరు తెరవలేక పోయారు. ప్రజల మధ్య నుంచి ఒక యువకుడు, "రాజుగారు మనస్ఫూర్తిగానే ఈ ఏర్పాటు చేశారా? ఇప్పుడు రాజు

గారూ, రాణీ యువరాజూ ఎక్కడున్నారు?'' అని అడిగాడు.

''అవన్నీ నీకనవసరం!'' అని అరిచాడు చాటింపు వేసిన భటుడు.

''శాంతిదేవ మహారాజు పరిపాలనలో మేము ఏ కొరతా లేకుండా జీవిస్తున్నాము. మా రాజుగారికి సంబంధించిన విషయం కాబట్టి, ఆయన ప్రజలయిన మాకూ సంబంధించినదే. అందుకే అడుగుతున్నాను!'' అన్నాడు యువకుడు.

''అలాగా! అయితే మావెంట రా. చెబుతాము,'' అన్నాడు భటుడు.

''మీ వెంట నేనెందుకు రావాలి? నిన్నటివరకు ఎంతో ఆరోగ్యంతో, ఆనందంతోవున్న రాజుగారు హఠాత్తుగా రాజ్యాధికారాన్ని త్యజించవలసిన కారణం మాకు తెలియాలి!'' అన్నాడా యువకుడు.


దానికి భటుడు ఎటువంటి సమాధానమూ చెప్పలేదు. కాని, చేయెత్తి తన అనుచరులకు సైగచేశాడు. మరుక్షణమే నలుగురు సైనికులు ఆ యువకుడిపైబడి, బంధించి దూరంగా లాక్కుపోయారు. వాళ్ళనుంచి బయటపడడానికి యువకుడు పెనుగులాడాడు. కాని, ప్రయోజనం లేకపోయింది.

ఈ సంఘటనతో, పరమదుర్మార్గుడు రాజ్యసింహాసనాన్ని ఆక్రమించినట్టు



ప్రజలు గ్రహించారు. రాజుకూ, రాజకుటుంబానికీ ఏమయిందో తెలియలేదని ప్రజలెంతగానో బాధపడ్డారు. కాని, రాజకుటుంబం గురించి ఎవరైనా నోరెత్తితే చాలు; నానా బాధలకు గురికావలసి వచ్చేది. ఆ కారణంగా రాజధానీనగరాన్ని శ్మశానమౌనం, శోకం ఆవహించాయి!

శాంతిపురంలో జరిగిన ఘోరమైన ద్రోహచర్య గురించిన వార్త రాణీగారి తండ్రి రాజ్యమైన అమృతపురికి అందింది. అయినా, సుమేధతో పోల్చినట్టయితే అమృతపురి సైనికబలం చాలా స్వల్పమైనది. అందువల్ల రాణిగారి తండ్రి ఏమి చేయడమా అని ఆలోచించసాగాడు.



వీరసింహుడు మరునాడు రాజపురోహితుణ్ణి పిలిపించి, తనకు రాజ్యాభిషేకం చేయమని కోరాడు. అందుకు రాజపురోహితుడు, "మన సంప్రదాయం ప్రకారం, రాజు మరణిస్తేనే, లేదా విశ్రాంతి తీసుకుంటేనేతప్ప, కొత్తరాజుకు రాజ్యాభిషేకం చేయడం సాధ్యం కాదు. పైగా, రాజు లేదా రాజకుటుంబం అభీష్టానుసారమే కొత్తరాజుకు పట్టాభిషేకం జరగాలి. ఈ పరిస్థితిలో శాంతిదేవమహారాజు అనుమతి లేకుండా నేను నిన్నెలా మకుటాభిషిక్తుణ్ణి చేయగలను?" అని అడిగాడు.

వీరసింహుడు పట్టరాని ఆగ్రహంతో చూశాడు. మరుక్షణమే అతడి భటులు, రాజపురోహితుణ్ణి బంధించి, కారాగారంలోకి తోశారు!

వెంటనే మరొక కొత్త పురోహితుణ్ణి తీసుకువచ్చారు. వీరసింహుడి మకుటాభిషేకం హడావుడిగా జరిగిపోయింది!

శాంతిదేవుడికి ఆప్తులూ, విశ్వాసపాత్రులూ అయిన వారినందరినీ, ఆస్థాన పదవులనుంచితొలగించి, ఆయాస్థానాలలో తనకు విశ్వాసపాత్రులయిన వారిని నియమించాడు వీరసింహుడు.

సభ సమావేశమయిన మొదటి రోజున వీరసింహుడు, వృద్ధమంత్రితో, "మంత్రివర్యా, రాజ్యం వీరభోజ్యం అన్న సత్యం మీరెరిగినదే. అయితే, శాంతిపురం చాలా కాలం నుంచి విజయయాత్రకు బయలుదేరలేదు. మన సైనికులు సోమరితనానికి అలవాటుపడిపోయారు. సాటిరాజులను జయించడంలోని ఆనందాన్ని అనుభవించలేనివారు రాజులనిచెప్పుకోవడానికే అర్హులు కారు. అందువల్ల మనం ప్రప్రథమంగా ఏ రాజ్యం మీదికి దండెత్తడం ఉత్తమమో తెలియజేయడం, అనుభవజ్ఞులయిన మంత్రిగా మీ కర్తవ్యం!" అన్నాడు మీసాన్ని గోటితో దువ్వుతూ.

వృద్ధమంత్రి లేచినిలబడి, మెల్లగా దగ్గి, "సేనాధిపతీ....ఒక్క విషయం...." అని ఏదో చెప్పబోయేంతలో, వీరసింహుడు





అడ్డుపడి, "నన్ను సేనాధిపతీ, అని సంబోధించడానికి మీకెన్ని గుండెలు! నేను నిన్నటివరకు సేనాధిపతినే; కాదనను. కాని ఈ రోజు ఈ సుసంపన్న శాంతిపురానికి తిరుగులేని రాజును! ఇకపై నన్ను సేనాధిపతీ అని పిలవడం మానుకోవడం శ్రేయస్కరం!" అంటూ, తన ఎడమచెవి తెగిన సంగతి సభికుల కంటపడకుండా, కిరీటాన్ని సర్దుకున్నాడు.

"చిత్తం! అయితే, పొరుగురాజ్యాల మీదికి దండెత్తడంకన్నా మన రాజ్యంలోని ప్రజల సుఖశాంతులకోసం కృషి చేయడం పాలకుల ప్రధానకర్తవ్యం అని నా అభిప్రాయం," అన్నాడు మంత్రి.

"మీ అభిప్రాయం ఏదైనా కానీయండి, ఫరవాలేదు. తుది నిర్ణయం మేమే తీసుకుంటాం. అయితే తమరు రాజునైన నన్ను 'మహాప్రభూ' అని సంబోధించలేదన్న విషయం గుర్తించడం అవసరం," అన్నాడు వీరసింహుడు కోపంగా.

"నేను వృద్ధుణ్ణయిపోయాను. పాత అలవాట్లు మార్చుకోవడం అంత సులభం కాదు కాబట్టి సెలవిప్పించారంటే మంత్రి బాధ్యత నుంచి వైదొలగి విశ్రాంతి తీసుకుంటాను,' అన్నాడు మంత్రి.

"మంత్రి పదవి నుంచే కాదు; మేము తలిచామంటే మీకు జీవితం నుంచే విశ్రాంతి ఇవ్వగలం మహామంత్రీ!" అని అరిచాడు వీరసింహుడు ఆగ్రహంగా.

మంత్రి మరేమీ మాట్లాడలేదు. నీ ఇష్టప్రకారమే కానివ్వు అన్నట్టు చేతులెత్తి సైగచేశాడు.

"ఈ క్షణమే నిన్ను మంత్రిపదవి నుంచి తొలగిస్తున్నాను," అన్నాడు వీరసింహుడు.

మంత్రి చేతులు జోడించి సభకు నమస్కరించి, మౌనంగా బయటకు వెళ్ళిపోయాడు. వెళుతూన్న మంత్రిని చూసి, వీరసింహుడు పరిహాసంగా నవ్వాడు. ఆ తరవాత అతని అనుచరులందరూ సభ మారుమోగేలా పకపకా నవ్వారు!

వృద్ధమంత్రి ఆ రోజు సాయంకాలం, యథాప్రకారం నగరం శివార్లలో వున్న శివాలయానికి వెళ్ళి దైవదర్శనం చేసుకుని వస్తున్నాడు. సూర్యాస్తమయమై అప్పు డప్పుడే చీకటి అలముకుంటున్నది. ఇరు వైపులా చెట్లూ, దట్టమైన పొదలూగల బాటలో మంత్రి నడుస్తున్నాడు. ఒక పొద చాటునుంచి హఠాత్తుగా ముగ్గురు భటులు ముందుకు దూకారు. ఒక భటుడు మంత్రి చేతులు పట్టుకున్నాడు. రెండవవాడు, మంత్రి అరవకుండా ఆయన నోటిని చేత్తో బలంగా మూశాడు. మూడవవాడు దారి చూపగా, ఇద్దరూ కలిసి మంత్రిని నిర్మా నుష్యమైన ప్రదేశానికి బరబరా లాక్కు పోసాగారు.


వాళ్ళ పట్టునుంచి తప్పించుకునే శక్తి మంత్రికి లేదు. అందువల్ల ఏం జరుగు తుందో జరగనీ అని, ఆయన దేవుడిపై భారం వేసి ఊరుకున్నాడు. మూడవ భటుడి చేతిలోకత్తి తళుక్కున మెరి సింది. వాడు కత్తిని మంత్రి మెడకు గురి పెట్టి పైకెత్తాడు. కాని, మరుక్షణమే వాడి చేతిలోని కత్తి ఎగిరి, దూరంగా వున్న ఒక బండపై బడి ఖంగున మోగింది. వాడు బాధగా మూలుగుతూ వెనక్కు తిరిగి చూశాడు. మిగిలిన ఇద్దరు భటులూ, మంత్రిని వదిలిపెట్టి, ఏం జరిగిందో తెలుసుకోవడానికి చుట్టుపక్కల కలయ జూశారు. కాని అందుకు అవకాశమే లేకుండా, క్షణంలో ఒక కత్తి వేటుకు ముగ్గురి తలలూ ఎగిరి దూరంగా పడ్డాయి!

మెరుపులాంటి ఖడ్గచాలనంతో ముగ్గు రినీ హతమార్చిన మర్మవీరుడు మంత్రితో, "రేపు తెల్లవారేవరకూ, ఈ హంతకుల మరణం గురించి ఎవరూ తెలుసుకోలేరు. రాత్రికిరాత్రే నువ్వు ఈ రాజ్యం వదిలి వెళ్ళి అమృతపురి చేరుకో!" అన్నాడు.

"మీరు...." అని వృద్ధమంత్రి కృతజ్ఞ తతో ఇంకేదో అనబోయాడు.

"మరేమీ మాట్లాడకు!" అని హెచ్చ రించి, మర్మవీరుడు మరుక్షణమే చీకటిలో కలిసిపోయాడు. —(ఇంకావుంది)





బందిపోటు యువరాజు

6

[సేనాధిపతి వీరసింహుడు సుమేధరాజ్య సింహాసనాన్ని ఆక్రమించాడు. రాజుకూ, రాజ కుటుంబానికీ ఏమయిందో చెప్పమని ప్రశ్నించిన ఒక యువకుణ్ణి భటులు బంధించారు. వీర సింహుణ్ణి రాజుగా అంగీకరించడానికి తిరస్కరించిన వృద్ధమంత్రిని హతమార్చడానికి ఏర్పాట్లు జరిగాయి. కాని, సమయానికి ఒక మర్మవీరుడు వృద్ధమంత్రిని రక్షించాడు. తరవాత—]

మరునాడు సూర్యోదయం వేళ వీర సింహుడు రాజోద్యానంలో, శాంతిదేవుడి నడకను అనుకరిస్తూ అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. అయినా, శాంతిదేవుడి నడక లోని హుందాతనం అతనికి అబ్బలేదు. సూర్యోదయ సమయంలో ప్రకృతి సౌందర్యాన్ని తిలకించడంలో శాంతిదేవుడు పరమానందం చెందేవాడు. ఆయన ప్రకృతిని ప్రేమించేవాడు. పైగా ఆయన హృదయంలో ఏ కోశానా భయం అన్నది వుండేదికాదు. అందుకే ఆయన నడకలో నిండుదనం వుండేది; గాంభీర్యం ఉట్టి పడేది. అయితే, వీరసింహుడికి ప్రకృతి పట్ల ప్రేమలేదు. ప్రకృతేమిటి? తన్ను తాను ప్రేమించడం తప్ప ప్రపంచంలో మరెవరి మీదా అతనికి ప్రేమలేదు. పైగా, ఏ క్షణాన ఎటువైపు నుంచి ఏ అపద ముంచుకొస్తుందో అన్న భయం! తను



చంపలేకపోయిన శాంతిదేవుడు ఏమయ్యాడు? రాజ్యంలో తనను వ్యతిరేకించేవాళ్ళెందరున్నారు? వాళ్ళందరూ ఏకమై తనపై కుట్ర పన్నుతున్నారా? ఇలాంటి అనుమానాలతో అతడు అనుక్షణం లోలోపల భయపడసాగాడు. అందువల్ల అతని నడకలో నిలకడలేదు; హుందాతనం లేదు!

"మహాప్రభూ!" అని పిలిచాడు కొత్వాలు వీరసింహుణ్ణి సమీపించి.

"ఏమిటి?" అన్నట్టు తిరిగి చూశాడు వీరసింహుడు.

"జరగకూడనిది జరిగిపోయింది మహాప్రభూ!" అన్నాడు కొత్వాలు.

"అసలు జరిగిందేమిటో చెప్పు!" అని గద్దించాడు వీరసింహుడు.

కొత్వాలు చుట్టుపక్కల కలయజూసి, సమీపంలో ఎవరూ లేరని నిర్ధారించుకుని, "వృద్ధమంత్రి మన భటులనుంచి ప్రాణాలతో తప్పించుకున్నాడు ప్రభూ!" అన్నాడు.

"ఏమిటీ! మంత్రి తప్పించుకున్నాడా? అంటే నువ్వాపనికి మేకలను పంపావన్నమాట! ఇంతకీ ఎలా తప్పించుకున్నాడట ఆ ముసలిమంత్రి?" అని అడిగాడు వీరసింహుడు చాలా కోపంగా.

"ఆ విషయం తెలియజేయడానికి భటులు ప్రాణాలతో లేరు ప్రభూ! వాళ్ళు ముగ్గురూ హతులైపోయారు." అన్నాడు కొత్వాలు మెల్లగా.

"ఛీ....ఛీ....మేకలను కాదు; గొర్రెపిల్లలను పంపావు!" అని అరిచాడు వీరసింహుడు పట్టరాని ఆవేశంతో.

"ప్రభువులు క్షమించాలి. ఏంజరిగిందో తెలియదుగాని, తెల్లవారేసరికి నగరం పొలిమేరలో భటులు ముగ్గురూ చచ్చిపడివున్నారు. అయితే ఒకటి మాత్రం ఖాయం. మన భటుల్ని మంత్రి చంపలేదన్నది నిజం. ఎందుకంటే మంత్రి కత్తి పట్టడం మనమెప్పుడూ చూడలేదు. అలాంటి వృద్ధమంత్రి, యోధులయిన



ముగ్గురు భటులను హతమార్చడంటే నమ్మశక్యంగా లేదు ప్రభూ! ఆపని వేరెవరో చేసి వుంటారు!'' అన్నాడు కొత్వాలు.

''ఎవరు చేశారంటావు?'' అని అడిగాడు వీరసింహుడు.

''అదే అంతుచిక్కడం లేదు. అసలు ఏం జరిగిందో తెలుసుకోవడానికి మన గూఢచారులను నియోగించాను!'' అన్నాడు కొత్వాలు క్షమాపణలు చెప్పుకుంటున్న ధోరణిలో.

వీరసింహుడు మౌనంగా కొంతసేపు ఒకేచోట నిలబడి, ఆ తరవాత పిడికిలి బిగించి, ''ఈ అపాయాన్ని మనం మొగ్గలోనే చిదిమివేయాలి. ముదరనిస్తే ప్రాణాలు తీస్తుంది. మనకు వ్యతిరేకంగా ఏదో కుట్ర జరుగుతున్నది. కుట్రదారులందరూ ఏకమై తిరగబడేలోగా మనం వాళ్ళ అంతం చూడాలి. అవును....నిన్న మన భటులను, శాంతిదేవుణ్ణి గురించి ప్రశ్నించిన యువకుడెక్కడున్నాడు? వాడు కుట్రదారులలో ఒకడై వుంటాడు!'' అన్నాడు.

''ఆ యువకుడి పేరు వసంతుడు ప్రభూ! అయినా వాడు కుట్రదారుగా కనిపించడం లేదు ప్రభూ! అయితే రాజ్యాధికారాన్ని తమరు చేపట్టడం గురించి మాత్రం ఇంకా వ్యతిరేకిస్తూనే వున్నాడు. శాంతిదేవుడి క్షేమం గురించి అడుగుతూనే వున్నాడు,'' అన్నాడు కొత్వాలు.

''పిచ్చిగా వాగకు. కుట్రదారు కాకుంటే, మన అధికారాన్ని వ్యతిరేకించే ధైర్యం ఒంటరిగాడికి ఎలా వస్తుంది? వాణ్ణి వేధించండి, నిజం కక్కుతాడు.'' అన్నాడు రాజు.

''వాణ్ణి అప్పుడే రకరకాల బాధలకు గురి చేశాం. కాని, ప్రయోజనం లేదు.'' అన్నాడు కొత్వాలు.

''అలా అయితే వాణ్ణి వెంటనే హతమార్చు. ఆ నీచుణ్ణి నగరవీధులగుండా వధ్యభూమికి లాక్కుపో. మన అధికారా

నికి ఎదురుతిరిగితే జరిగేదేమిటో నగర పౌరులందరికీ తెలిసిరావాలి. వాణ్ణి బహిరంగంగా ఉరి తీయించు. ఆ దెబ్బతో ప్రజలందరూ గడగడలాడి పోతారు!'' అని ఆజ్ఞాపించాడు వీరసింహుడు.

కొత్వాలు సరేనని అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

రాజుకు ఎదురుతిరిగిన వసంతుడికి ఉరిశిక్ష విధించినట్టు అప్పటికప్పుడే చాటింపు జరిగింది. నగరాన్ని ఆనుకుని వున్న విశాలమైదానంలో అతణ్ణి ఉరి తీయడానికి తగిన ఏర్పాట్లు జరిగాయి.

ఆ రోజు మధ్యాహ్నం, కారాగారం నుంచి నగర వీధులగుండా వసంతుడి ఊరేగింపు బయలుదేరింది.

ఆ సమయంలో నగర ప్రజలందరూ తనను చూసి మెచ్చుకోవాలని, కొత్వాలు ముతకరంగు వింత దుస్తులు ధరించి, బలమైన గుర్రమెక్కి ఊరేగింపుకు ముందుగా, ''దూరంగా తప్పుకోండి....తప్పుకోండి.'' అని మాటిమాటికీ కేకలు వేస్తూ వెళ్ళాడు. వసంతుడికి విధించిన మరణశిక్ష చూసి నగరప్రజలు భయభ్రాంతులవుతారో లేదో గాని, తన గొప్పదనం చూసి అందరూ మెచ్చుకోవాలన్నది కొత్వాలు ఆకాంక్ష. అయినా, హఠాత్తుగా అప్పుడే పొగమంచు కురవడంతో, ప్రజలు కొత్వాలును స్పష్టంగా చూడలేకపోయారు. దాంతో అతనికి కాస్త ఆశాభంగమయింది.



కొత్వాలు ఎక్కిన గుర్రం వెనకగా, చేతులు బంధించబడిన వసంతుడూ, అతనికి ఇరువైపులా భటులూ నడిచారు. వాళ్ళకు వెనకగా ఆయుధాలు ధరించిన మరికొందరు భటులు నడుస్తున్నారు. వసంతుడు ఎలాంటి చలనమూ లేకుండా మౌనంగా నడుస్తున్నాడు.

దారికి అడ్డు ఎవరూ లేరు. కాని, ప్రజలదృష్టిని తన మీదికి ఆకర్షించడానికి కొత్వాలు, మాటిమాటికీ, "దూరంగా తప్పుకోండి....దూరంగా వెళ్ళండి," అని అరవసాగాడు.


హఠాత్తుగా, ఎవరో కొత్వాలును గుర్రం పైనుంచి బలంగా తోశారు. అతడు దభీమని కిందపడి విలవిల తన్నుకోసాగాడు. మరుక్షణమే ఎవరో మెరుపులాంటి ఖడ్గ చాలనంతో, వసంతుడి చేతికి బంధించబడిన తాళ్ళను ఛేదించారు.

వసంతుడు వెనుదిరిగి చూశాడు. ముసుగు వీరుడొకడు, "గుర్రమెక్కి నా వెనక కూర్చో," అని హెచ్చరిస్తూ, ఒక్క ఊపున కొత్వాలు గుర్రమెక్కి, కళ్ళాన్ని పట్టుకున్నాడు. వసంతుడు కూడా మరుక్షణమే ఒక్క గెంతున గుర్రంమీదికి లంఘించి, మర్మ వీరుడి పక్కన కూర్చున్నాడు.

గుర్రం శరవేగంతో వెళ్ళిపోయింది.

భటులు భయాశ్చర్యాలతో మాటా పలుకూ లేకుండా నిలబడిపోయారు. కొత్వాలు మూలుగు విని స్పృహలోకి వచ్చి,





పరిగెత్తిపోయి, అతన్ని మెల్లగా లేవనెత్తి కూర్చోబెట్టారు.

"నన్ను గుర్రంపైనుంచి కిందికి తోసిందెవరు? నా గుర్ర మెక్కడ?" అని అడిగాడు కొత్వాలు బాధగా.

"గుర్రం పారిపోయింది!" అన్నారు భటులు.

"పారిపోయిందా?" అని అడిగాడు కొత్వాలు నిస్పృహతో.

"ఖైదీ కూడా తప్పించుకున్నాడు," అన్నాడు మరొక భటుడు.

"ఖైదీ తప్పించుకున్నాడా! ఇంకేం నాపని కూడా అయిపోయినట్టే!" అన్నాడు కొత్వాలు బాధతో మూలుగుతూ.

ముసుగు వీరుడు అరణ్య మధ్యానికి చేరుకుని, ఒక గుహ ముఖద్వారం ముందు గుర్రాన్ని ఆపాడు.

ఇద్దరూ గుర్రంపైనుంచి కిందికి దిగారు.

"మీరేగాని రాలేదంటే ఈపాటికి నా ప్రాణాలు పోయేవి!" అన్నాడు వసంతుడు కృతజ్ఞతాభావంతో ముసుగువీరుడికి చేతులు జోడిస్తూ.

"నిజమే! అయినా నువ్వేం అపరాధం చేశావు? నీకెందుకు మరణశిక్ష విధించారు?" అని అడిగాడు ముసుగువీరుడు.

"శాంతిదేవ మహారాజు ఎక్కడున్నారు? రాత్రికి రాత్రే సేనాధిపతి రాజు ఎలా అయ్యాడు? అని చాటింపు వేసిన భటులను అడిగాను. అంతే! నా ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా భటులు నన్ను బంధించారు. ఆపైన, రాత్రి ఎవరో అజ్ఞాత వ్యక్తులు, ముగ్గురు భటులను హతమార్చారట. వాళ్ళను హతమార్చినవారికీ, నాకూ సంబంధం వుందనీ, వీరసింహుడి అధికారాన్ని కూలద్రోయడానికి వాళ్ళతో కలిసి కుట్ర పన్నుతున్నాననీ నా మీద నిందారోపణ చేసి, మరణశిక్ష విధించారు," అన్నాడు వసంతుడు.

"అదిసరే, శాంతిదేవుడికి ఏమయితే నీకేం? ఆయనపై నీకెందుకింత అభి



మానం?'' అని అడిగాడు మునుగు వీరుడు.


''శాంతిదేవ మహారాజు ప్రజలను కన్న బిడ్డల్లా పాలించిన కరుణామయుడు. అటువంటి ధర్మప్రభువుకు ఏమయిందో తెలుసుకోవడం మా కర్తవ్యం కాదా? పైగా, వీరసింహుడు పరమదుర్మార్గుడు. అధికారాన్ని చేపట్టిన క్షణంనుంచీ మితిమించిన గర్వంతో ప్రజలను హింసిస్తున్నాడు!'' అన్నాడు వసంతుడు.

''నిజమే. మనం ఆ దుర్మార్గుడి అంతం చూడాలి. అయితే, ఒంటరిగా కాదు; కలసి కట్టుగా ఆ కార్యం సాధించాలి. వాడికి వ్యతిరేకంగా ఉన్న వారందరినీ మనతో కలుపుకోవాలి!" అన్నాడు మునుగువీరుడు.

''రాత్రి ముగ్గురు భటులను హతమార్చింది మీరేనా?'' అని అడిగాడు వసంతుడు.

''అవును. అయినా, వాళ్ళను చంపాలన్న ఉద్దేశం నాకు లేదు. వాళ్ళు వృద్ధ మంత్రిని చంపబోయారు. ఆ క్షణంలో ఆయన్ను కాపాడాలంటే ఆ హంతకులను హతమార్చడం తప్ప నాకు మరో మార్గం కనిపించలేదు. అందుకే అలా చేశాను. అధికారుల ఆజ్ఞానుసారం నడుచుకునే అమాయకులను ప్రాణాలు తీయడమంటే నాకు చిరాకు. ఈ రోజు ఎవరి ప్రాణమూ తీయకుండా నిన్ను కాపాడగలిగినందుకు నాకెంతో ఆనందంగా వున్నది. పిరికి పందలే అమాయకులపై కత్తి దూస్తారు. మనం మహోన్నత కార్యం సాధించడానికి దీక్షబూని వున్నాము. అందుకే మనం ధైర్యంగా పోరాడాలి,'' అని చెప్పి మునుగు వీరుడు గుహలోపలికి వెళ్ళి కొన్ని మధుర ఫలాలు తెచ్చి వసంతుడికి ఇచ్చాడు. ఆ తరవాత అరణ్యం నుంచి అమృతపురికి చేరుకునే దగ్గరి మార్గం తెలియజేసి. ''నువ్వు అమృతపురికి వెళ్ళి, నగరానికి పడమర సరిహద్దులో వున్న మహాకాళి ఆలయాన్ని చేరుకో. అక్కడ కలుసుకుందాం,'' అని చెప్పి, గుర్రంమీద ఎక్కి వెళ్ళిపోయాడు. —(ఇంకావుంది)





7

[సుమేధరాజ్య సింహాసనాన్ని కుట్రతో ఆక్రమించుకున్న సేనాధిపతి వీరసింహుడి దురాగతాలు మితిమించిపోయాయి. తన అధికారాన్ని అంగీకరించని వృద్ధమంత్రినీ, తన భటులకు ఎదురు తిరిగిన వసంతుడనే యువకుణ్ణీ హతమార్చడానికి వీరసింహుడు పథకం వేశాడు. కాని, సమయానికి ముసుగు వీరుడొకడు వచ్చి ఆ ఇద్దరినీ ప్రాణాలతో రక్షించాడు.—తరవాత]

ముసుగువీరుడి సహాయంతో, వసంతుడు కొత్వాలు నుంచి తప్పించుకున్నాడన్న వార్త వినగానే, వీరసింహుడు ఆగ్రహావేశంతో వణికిపోయాడు.

"మీ సమక్షానికి వచ్చి, ముఖం చూపడానికి కొత్వాలు సిగ్గుపడుతున్నాడు ప్రభూ!" అన్నాడు చిన్నకొత్వాలు వీరసింహుడి దగ్గరికి వచ్చి భయంతో చేతులు జోడిస్తూ.

కొత్వాలు, వీరసింహుడితో చేతులు కలిపి, శాంతిదేవుడిపట్ల విశ్వాసఘాతుకంగా ప్రవర్తించాడు. కొత్తగా అధికారాన్ని చేపట్టిన వీరసింహుడి అడుగులకు మడుగులొత్తుతూ, అతని దయకు పాత్రుడయ్యాడు. ఆ కారణంగా వీరసింహుడు క్షమించి, తనను రమ్మని కబురు చేయగలడన్న ఆశతో, అతడు చిన్నకొత్వాలను దూతగా పంపాడు.



అయితే, వీరసింహుడు ఆ మాటలకు మండిపడి, "ఆ చేతకాని దద్దమ్మ ముఖం చూడాలని మాకు లేదు. వెంటనే వాణ్ణి రాజ్యం వదిలి పొమ్మని చెప్పు. ఈ క్షణం నుంచి నిన్ను మా కొత్వాలుగా నియమిస్తున్నాం!" అన్నాడు.

చిన్న కొత్వాలుకు పట్టరాని సంతోషంతో ఎగిరి గంతేయాలనిపించింది. మరుక్షణమే వాడు, వీరసింహుడి కాళ్ళపైబడి, "మహాప్రభూ, మీ కోసం నా ప్రాణాలివ్వడానికైనా సిద్ధంగా వున్నాను!" అన్నాడు.

"మూర్ఖుడా, అదేచేయవద్దంటున్నాను. మాకు నీ ప్రాణాలెందుకు? నువ్వు చస్తే మేము వేరొక కొత్వాలును నియమించవలసి వస్తుంది!" అన్నాడు వీరసింహుడు కోపంగా.

"ప్రభువులు నా కళ్ళు తెరిపించారు. ఇక నా ప్రాణాలు వదలను కాని, ప్రభువులను ఎదిరించేవారి ప్రాణాలు తీస్తాను. ఆజ్ఞాపించండి." అన్నాడు కొత్తకొత్వాలు లేచి నిలబడుతూ.

"సెభాష్! వెళ్ళు. మాకు కావలసింది ఒట్టి మాటలు కాదు. చేతలు!" అన్నాడు వీరసింహుడు.

వీరసింహుడికి చేతులెత్తినమస్కరించి అక్కడి నుంచి బయలుదేరిన కొత్త కొత్వాలు, పాతవాడికన్నా పరమ కర్కోటకంగా ప్రవర్తించసాగాడు.

తనకు కొత్వాలు పదవిని అంటగట్టిన వీరసింహుణ్ణి సంతోషపెట్టాలన్న తపనతో, పదిమంది భటులను వెంట బెట్టుకుని, శాంతిపురనగరం పొలిమేరలో వున్న వసంతుడి గ్రామం చేరుకున్నాడు. వృద్ధులయిన వసంతుడి తల్లిదండ్రులనూ, వసంతుడి తమ్ముణ్ణీ, చెల్లెనూ, గ్రామం మధ్య వున్న రచ్చబండవద్దకు బరబరా లాక్కుపోయి నిలబెట్టి, వారి గుండెలకు ఈటెను గురిపెట్టి చూపుతూ, "చెప్పండి. వసంతుణ్ణి ఎక్కడ దాచారో చెప్పండి," అని అడిగాడు.



"వసంతుణ్ణి రాజభటులు బంధించి తీసుకుపోయారు బాబూ," అన్నాడు వసంతుడి తండ్రి చేతులు జోడించి.

"ఆ సంగతి ఎవరికి తెలియదు? ఇప్పుడు వసంతు డెక్కడ వున్నాడు? పాతకొత్వాలును గుర్రం పైనుంచి కిందికి తోసి, భటులనుంచి వసంతుణ్ణి తీసుకు వెళ్ళిన ఆ దుర్మార్గు డెవ్వడు? నిజం చెప్పు," అని గద్దించాడు కొత్వాలు.

"మా అన్నను ముసుగు వీరుడు రక్షించినప్పుడు మేము అక్కడలేము. ఆ సమయంలో మీరు కూడా అక్కడే వున్నారని విన్నాం. కాబట్టి మా అన్న ఎక్కడికి వెళ్ళాడో మాకన్నా మీకే తెలిసివుండాలి!" అన్నాడు వసంతుడి తమ్ముడు.

"ఊరేగింపులో మీరు కొత్వాలు వెనకే నడిచి వెళ్ళారు కదా! ముసుగువీరుడు వచ్చినప్పుడు కూడా మీరు అక్కడే వున్నారు కదా!" అని అడిగాడు అక్కడ చేరిన గుంపులో నుంచి ఒక యువకుడు.

"నోర్ముయ్, కుర్ర వెధవా! నేనే గనక అక్కడ వుండి వుంటే మీలో ఒక్కరయినా ప్రాణాలతో తప్పించుకునేవారా?" అంటూ కొత్వాలు కుర్రవాణ్ణి కొరడాతో కొట్టసాగాడు.


"అమాయకుడయిన ఆ కుర్రవాణ్ణెందుకలా కొడుతున్నారు?" అని అడిగాడు మరొక గ్రామస్థుడు.

"శాంతిదేవమహారాజు కాలంలో ఇలాంటి ఘోరం ఎన్నడూ జరగలేదు!" అన్నాడు ఇంకొక పెద్దమనిషి.

"ఇది తిరుగుబాటుదార్లు నివసించే గ్రామం. తక్షణమే దీనిని తగలబెట్టండి. గ్రామమంతా భస్మమైపోవాలి. ఊఁ.... నిప్పంటించండి," అని భటులను ఆజ్ఞాపించాడు కొత్వాలు.

"మా గ్రామాన్నెందుకు తగలబెడతారు బాబూ, మేమేం తప్పు చేశాం?" అని అరిచారు గ్రామస్థులందరూ దీనంగా ఏకకంఠంతో.

అయినా, ఆ మాటలను పట్టించుకోకుండా, ఇద్దరు భటులు ఒక ఇంట్లోకి జొర



బడి, మండుతూన్న కొరివిని తెచ్చి, ఆ ఇంటి చూరుకు నిప్పంటించారు.

కొత్వాలు ఆనందంతో మీసందువ్వుతూ, "ఒక్క కొంపను కూడా వదలకూడదు. నిప్పంటించండి!" అని అరిచాడు.

కొంతసేపటికల్లా ఊరు ఊరంతా అల్లకల్లోలమయింది. ప్రతి ఇల్లూ అగ్ని జ్వాలలకు ఆహుతయిపోయింది. జనం భయంతో హాహాకారాలు చేశారు. ఒకచోట ఆర్పితే, మరొకచోట మంటలు భగ్గున మండసాగాయి! మంటలలో ఇళ్ళ వెదుళ్ళు పగిలి పెద్దపెద్ద ధ్వనులు పుట్టాయి. అతి భీకరంగా మారిన ఆ దృశ్యాన్ని చూసి కొత్వాలు వికటాట్టహాసం చేసి, భటులు వెంటరాగా గుర్రంపై రాజధానికి తిరిగి వెళ్ళాడు.

* * *

అదొక వర్షం కురుస్తున్న రాత్రి. ఆకాశం మేఘావృతమై అప్పుడప్పుడూ మెరుస్తున్నది. అరణ్యం నుంచి జయపురికి వెళ్ళే మార్గంలో జయానంద ముని ఒంటరిగా నడుస్తున్నాడు. ఆయన వెనక నెమ్మదిగా పులి నడుస్తున్నది. ముని భుజం మీద ఒక అందమైన చిలుక కూర్చుని ఉన్నది.

ఆ రాజ్యానికి జయపురి రాజధాని. కాని, అది శాంతిపురం లాగా పట్టణం కాదు. చూడడానికి పెద్ద గ్రామం లాగా ఉంటుంది. జయపురి రాజ్యం చాలా చిన్నది. అయినా, స్వతంత్రమైనది. రాజ్యానికి ఒకవైపు సుమేధరాజ్యం, మరొకవైపు సముద్రం సరిహద్దులు. మిగతా రెండువైపులా మహారణ్యం విస్తరించి ఉన్నది.

కొన్ని తరాలకిందట జయపురి సామంతరాజు, సుమేధరాజ్యాధిపతిని ప్రాణాపాయం నుంచి రక్షించాడు. ఆనాటి నుంచి శాంతిపుర రాజులు, జయపురికి సర్వస్వతంత్రం ప్రసాదించారు. పైగా, దానికి రక్షణ కూడా కల్పించారు! ఎందుకంటే, జయపురిపై దాడిజరపాలంటే,

శత్రువులు సుమేధరాజ్యాన్ని దాటుకునే వెళ్ళాలి!

జయపురి రాజు శంకరవర్మ. ఆయన జయానందముని ముఖ్యశిష్యులలో ఒకడు!

ముని, నిర్మానుష్యంగా వున్న బాట గుండా నడిచి, జయపురి పొలిమేరలో వున్న అలయం వద్ద ఆగి, "నేను తిరిగి వచ్చేవరకు ఇక్కడే వుండు!" అని పులితో చెప్పి, భుజం మీద వున్న చిలుకను చేతిలోకి తీసుకుని, "మల్లీ, నువ్వు వెళ్ళి, నేను వస్తున్నట్టు రాజుకు చెప్పు." అన్నాడు.

చిలుక రెక్కలల్లార్చి, కోటకేసి రివ్వుమని ఎగిరి వెళ్ళింది.

రాజు శంకరవర్మ ఆలస్యంగా భోజనం ముగించి, శయన గృహానికి బయలుదేరే సమయంలో, "నాయనా!" అన్న పిలుపు విని వెనక్కు తిరిగి చూశాడు.


చిలుక రివ్వున వచ్చి రాజు భుజంపై వాలి, "నాయనా!" అన్నది మళ్ళీ.


"ఏం మల్లీ! ఏమిటి విశేషం," అని అడిగాడు వర్మ.

"మహాత్మా!" అన్నది చిలుక.

"అలాగా!" అంటూ వర్మ భటులను పిలిచి, కోటద్వారాలు తెరవమని అజ్ఞాపించాడు!

జయానందముని శంకరవర్మను "నాయనా" అని పిలుస్తాడు. శంకరవర్మ జయానందమునిని "మహాత్మా" అని





సంభోదిస్తాడు. ఈ రెండు మాటలూ పలికి, చిలుక తను వచ్చిన పని నెరవేర్చింది!

శంకరవర్మ మునికి ఎదురు వెళ్ళి నమస్కరించి, "మీరు వర్షంలో ఇంత దూరం రావాలా? మల్లిని పంపితే నేనే మీ సమక్షానికి వచ్చేవాణ్ణి కదా?" అన్నాడు.

"నిజమే. అయినా, నువ్వు నా ఆశ్రమానికి వచ్చావంటే, అది అందరి దృష్టినీ ఆకర్షిస్తుంది కదా! అందుకని నేనే వచ్చాను." అన్నాడు.

ముని ఏదో రహస్యం చెప్పడానికి వచ్చాడని వర్మ గ్రహించాడు. ఆయన్ను గౌరవంగా రాజమందిరంలోకి తీసుకుపోయి, బట్టలు మార్చుకోమని చెప్పి ఉన్నతాసనంలో కూర్చోబెట్టి, శంకరవర్మ స్వయంగా వేడిపాలు అందించాడు. ఆ తరవాత, ముని ఆజ్ఞానుసారం, ఆయన ఎదుట కూర్చున్నాడు.

"నాయనా, ఈమధ్య నువ్వు మనసులో చాలా బాధపడుతున్నట్టు విన్నాను, నిజమేనా?" అని అడిగాడు ముని.

"అవును మహాత్మా! నిజానికి నేనే మిమ్మల్ని దర్శించి, నా బాధలు చెప్పుకోవాలనుకున్నాను," అన్నాడు వర్మ.

"శాంతిపురంలో జరిగిన సంఘటనలు నీకు బాధకలిగించాయా?" అని అడిగాడు ముని.

"అవును. ఎన్నో తరాలుగా కీర్తిగాంచిన సుమేధ రాజవంశం ఈనాటికి అంతరించిపోయింది. రాజకుటుంబానికి చెందినవాడయినప్పటికీ వీరసింహుడు పరమ కిరాతకుడుగా మారిపోయాడు. రోజు రోజుకూ వాడి దురాగతాలు మితిమించిపోతున్నాయి. వాడి దృష్టి త్వరలో మన రాజ్యం మీద పడవచ్చు!" అన్నాడు శంకరవర్మ.

"ఆ పురాతన వంశం అంతం కాలేదు నాయనా," అని, ముని తన పిడికిలిని తెరిచాడు. ఆయన అరచేతిలో పతకంగల బంగారు హారం కనిపించింది. పతకంమీద సుమేధ రాజవంశపు ముద్ర వున్నది!



దానిని చూడగానే, శంకరవర్మ నేత్రాలు ఆనందాశ్చర్యాలతో మెరిశాయి.

''ఇది సుమేధ యువరాజు కంఠహారం! మీ చేతికెలా వచ్చింది?'' అని అడిగాడు శంకరవర్మ.

''యువరాజుతోసహా హారం నా దగ్గరికి వచ్చింది నాయనా. యువరాజు నాదగ్గరే ఉన్నాడు!'' అన్నాడు ముని.

''ఆనందకరమైన మాటను వెలి బుచ్చారు! యువరాజును పెంచే బాధ్యత నేను వహిస్తాను, మహాత్మా!'' అన్నాడు వర్మ సంతోషంగా.

''ఆ విషయం నాకూ తెలుసు. అయినా అది, నీకుగాని, బిడ్డకుగాని క్షేమమవుతుందా?'' అని అడిగాడు ముని.


శంకరవర్మ కొంతసేపు మౌనంవహించి, తలపంకించి, ''మహాత్మా, తీరాఆలోచిస్తే, అలా చేయడం ఇరువురికీ క్షేమం కాదని పిస్తున్నది. ఎందుకంటే, ఆ దుష్టుడైన ఏరసింహుడు, బిడ్డను వెతకడానికి నాలుగు దిక్కులకూ గూఢచారులను పంపాడని తెలిసింది. ఇలాంటి స్థితిలో యువరాజును రహస్యంగా దాచలేము కదా!'' అన్నాడు.

''సత్యం గ్రహించావు. యువరాజు అరణ్యం మధ్య రహస్యంగా పెరగడమే క్షేమం. అయితే, యువరాజుకు చెందిన ఈ హారాన్ని మాత్రం నువ్వు జాగ్రత్తగా భద్రపరచాలి. ఇది అతని మెడలో వుండడం క్షేమంకాదు,'' అన్నాడు ముని.

''చిత్తం, మహాత్మా! అయినా, ఈ స్థితిలో ఇంతకుమించి నేను చేయగలిగిందేమయినా ఉన్నదా?'' అని అడిగాడు శంకరవర్మ.

"నువ్వు చేయవలసింది చాలా ఉన్నది! అయితే, అందుకు తగిన సమయం ఆసన్నం కావాలి. దేనికైనా కాలం కలిసి రావాలికదా. అంతవరకు నిర్భయంగా ఓర్పు వహించు. సుమేధ రాజ్య ప్రజల బాధలనూ, దుఃఖాలనూ పోగొట్టడానికి మనం మన కర్తవ్యాన్ని నిర్వహించాలి!'' అన్నాడు ముని. —(ఇంకావుంది)





బందిపోటు యువరాజు

8

[సుమేధ రాజ్య సింహాసనాన్ని కుట్రతో ఆక్రమించిన వీరసింహుడికి మనశ్శాంతి కరువయింది. వృద్ధమంత్రినీ, వసంతుణ్ణీ రక్షించిన ముసుగువీరు డెవరో తెలియడం లేదు. ఏ నిమిషాన ఎవరు తిరుగుబాటు చేస్తారో, ఎటువైపు నుంచి ఏ ఆపద ముంచుకు వస్తుందో అని ప్రతిక్షణం భయపడుతూ, అనుమానం కలిగినవారినందరినీ వేధించసాగాడు. —తరవాత]

క్రాలం గడిచేకొలదీ వీరసింహుడిలో ఓర్పు నశించింది. ఇరుగుపొరుగు రాజ్యాలను జయించాలన్న కోరిక అతనిలో ఎక్కువకాసాగింది. తన చిరకాలవాంఛను దళపతులకు తెలియజేశాడు. వాళ్ళందరూ అతని ఆజ్ఞకోసం ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే పరాయిరాజ్యాలను జయిస్తే, వీరసింహుడితోపాటు తాము కూడా అక్కడి సంపదలను దోచుకుని రావచ్చునన్న పేరాశతో ఉన్నారు. వీరసింహుడు ఒకనాడు, తన అనుచరులలో ముఖ్యుడైన కపాలకంఠుడనే దళపతిని సేనాధిపతిగా నియమించాడు. మరునాటి రాత్రి, కపాలకంఠుణ్ణి తన రహస్యమందిరానికి పిలిపించి, "మనం పొరుగు రాజ్యాలపై దండెత్తవలసిన తరుణం ఆసన్నమయింది. ఏమంటావ్?" అని అడిగాడు వీరసింహుడు.



కపాలకంఠుడి ముఖం ఆనందంతో వెలిగిపోయింది. వాడు వీరసింహుడికి నమస్కరించి, "నేనూ, అదే అనుకుంటున్నాను ప్రభూ. మనం పొరుగు రాజ్యంపై యుద్ధం ప్రకటించామంటే ప్రజల దృష్టి అటు మళ్ళిపోతుంది. యుద్ధంలో జయమా, అపజయమా అన్న విషయం గురించే వారి ఆలోచనలు వుంటాయి కాబట్టి, తమరంటే ఇప్పుడున్న అసంతృప్తి తగ్గుతుంది. పైగా పొరుగు రాజ్యాలను జయించామంటే, ఆ రాజ్యాల లోని సంపదలన్నీ మన వశమవుతాయి. ఆ విధంగా మన రాజ్య భోగభాగ్యాలు పెరుగుతాయి కాబట్టి, తమరి పట్ల మన ప్రజల అదరాభిమానాలు ఇనుమడిస్తాయి," అన్నాడు కపాలకంఠుడు.

"అవును. నువ్వన్నది ముమ్మాటికీ నిజం. సరే, మనం మొట్టమొదట ఏ రాజ్యం మీదికి దండెత్తడం బావుంటుంది?" అని అడిగాడు వీరసింహుడు.

"ప్రభూ, ఈ విషయం గురించి నేను ముందే బాగా ఆలోచించాను. మనం మన దండయాత్రను అమృతపురి నుంచి ప్రారంభించాలి. ఎందుకంటే, అమృతపురి రాజు సత్యసేనుడు శాంతిదేవుడి మామ. అతడు మీ మీద ద్వేషంతో మీకు హాని కలిగించడానికి ఈ సరికే ఏదైనా పథకం ఆలోచించి వుండవచ్చు. అందుకే అమృతపురి నుంచి వచ్చిన ప్రయాణీకులందరినీ, ఆ రాజ్యపు వేగులేమో అన్న అనుమానంతో ఖైదు చేయమన్నాను," అన్నాడు కపాలకంఠుడు.

ఆ మాటలకు వీరసింహుడు తల పంకిస్తూ, "నీ అభిప్రాయంతో మేమూ ఏకీభవిస్తున్నాము. సత్యసేనుడు అనారోగ్యం పాలయ్యాడని వేగుల ద్వారా తెలిసింది. ఇది మనకొక అద్భుత అవకాశం. వెళ్ళి వెంటనే యుద్ధ సన్నాహాలు ప్రారంభించు. అయినా, నది దాటడానికి కావలసినన్ని పడవలు మన వద్ద వున్నాయా?" అని అడిగాడు.

"ఆయుధాలను దాటవేయడానికీ, దళపతులు నది దాటడానికి కావలసిన పడవలకు మనవద్ద లోటు లేదు. ఇక మామూలు సైనికులు ఈదుతూ నదిని దాటవచ్చు. ఎందుకంటే ఈ రుతువులో సుమతీనది రొమ్ముల లోతే ప్రవహిస్తుంది," అన్నాడు కపాలకంఠుడు.

"మంచిది. మరి, నది దాటడానికి నువ్వు ఎన్నాళ్లలో సైన్యాన్ని సిద్ధం చేయగలవు?" అని అడిగాడు వీరసింహుడు.

"ప్రభువులు ఆజ్ఞాపించారంటే రేపే సిద్ధం చేస్తాను," అన్నాడు కపాలకంఠుడు.

"శభాష్. సేనాధిపతి అంటే ఇలా వుండాలి. నిన్ను ఘనంగా సత్కరిస్తాము. అయితే ఇప్పుడు కాదు; అమృతపురిని జయించి తిరిగి వచ్చాక. ఎల్లుండి రాత్రే నదిని దాటడానికి సైన్యాన్ని సిద్ధం చెయ్," అన్నాడు వీరసింహుడు.

"ప్రభువులు మహా మేధావులు! ఎల్లుండి పౌర్ణమి. మన సేనలు రహస్యంగా నదిని దాటి, హఠాత్తుగా అమృతపురి రాజధాని మీద పడినట్టయితే, ఏమరుపాటుతో వున్న ఆ రాజ్యం తెల్లవారేసరికి మన వశం అవుతుంది కదా!" అన్నాడు కపాలకంఠుడు.

వీరసింహుడు నవ్వుతూ, కపాలకంఠుడి వీపు తట్టాడు. కపాలకంఠుడు



అతనికి నమస్కరించి అక్కడి నుంచి బయలుదేరాడు.

ఆ రాత్రే కపాలకంఠుడు దళనాయకుల సమావేశం ఏర్పాటు చేసి, వీరసింహుడి నిర్ణయం తెలియజేశాడు. ఆ సంగతి విని దళనాయకులందరూ పరమానందభరితులయ్యారు. ఎందుకంటే అమృతపురి సేనలు తమ సేనలను యుద్ధంలో ఎదుర్కొన లేవని వారికి తెలుసు. తమకన్న బలహీనులను దెబ్బతీయడంలో అల్పులకు అమితానందం వుంటుంది. పైగా అమృతపురి ప్రజలు ధనవంతులు. యుద్ధానంతరం అక్కడి సంపదలన్నీ తమ వశమవుతాయని దళనాయకులు



భావించారు. ముట్టడి ఎలా జరపాలో అందరూ కలిసి పథకం వేశాక, కపాలకంతుడు, "ఈ క్షణంనుంచే యుద్ధ సన్నాహాలు ప్రారంభంకావాలి. ఈ రహస్యం బయటకు పొక్కిందో మీ ప్రాణాలు దక్కవు. జాగ్రత్త!" అని హెచ్చరించాడు.

అయినా, ఒక దళనాయకుడు అక్కడినుంచి సరాసరి ఒక పానశాలకు వెళ్ళి, కూర్చుని పానం సేవిస్తూ దుకాణం యజమానితో, "నీకు నేను యాభై వెండి నాణాలు బాకీపడ్డానుకదా. మరేమీ దిగులు పడకు. నేను తిరిగి వచ్చిన వెంటనే, వెండి నాణాలేం ఖర్మ నీకు యాభై బంగారు నాణాలే ఇస్తాను," అన్నాడు.

"ఎక్కడినుంచి తిరిగి వచ్చిన తరవాత?" అని అడిగాడు దుకాణం యజమాని.

"నది దాటి వెళ్ళి తిరిగి వచ్చిన తరవాత. సరే, ఈ విషయం గురించి ఇక నన్నేమీ ప్రశ్నించకు," అన్నాడు ఆ దళనాయకుడు.

"ఎప్పుడు తిరిగి వస్తావేంటి?" అని అడిగాడు దుకాణం యజమాని మళ్ళీ.

"రేపు తరవాత ఎప్పుడయినా తిరిగి రావచ్చు; ఎందుకంటే ముట్టడి జరపబోయేది రేపు రాత్రికే కదా!" అన్నాడు దళనాయకుడు చిన్నగా నవ్వుతూ.

దుకాణం ముందు కూర్చున్న యువకుడొకడు అక్కడి సంభాషణలను జాగ్రత్తగా వింటున్నాడన్న విషయం వాళ్ళు గమనించ లేదు. చూడడానికి బికారిలా వున్నప్పటికీ ఆ యువకుడి కళ్ళల్లో అచంచలమైన ధైర్యం, వివేకం స్పష్టంగా కనిపిస్తున్నాయి. అతడే వసంతుడు. అమృతపురిలో వున్నప్పటికీ, వసంతుడు తన రాజ్యంలో ఏంజరుగుతున్నదో తెలుసుకోవాలన్న ఆసక్తితో, రకరకాల మారు వేషాలు ధరించి సుమేధ రాజ్యమంతటా తిరుగుతూ, శక్తిసంపన్నులయిన యువకులను తన పక్షానికి చేర్చుకుంటున్నాడు. వీరసింహుడి దుష్టపాలనను కొనసాగనివ్వ

కూడదు. దాని అంతం చూడాలి. అయినా అది ఎలా ఎప్పుడు సాధ్యమవుతుందో మాత్రం అతనికి తెలియదు. కాని, వీరసింహుడు విధించిన మరణశిక్ష నుంచి తనను కాపాడిన ముసుగువీరుడిపట్ల వసంతుడికి అచంచలమైన విశ్వాసం వున్నది. ముసుగు వీరుడు అప్పుడప్పుడూ, "వీరసింహుడి దురాగతాల నుంచి మనం అమాయక ప్రజలను తప్పక రక్షించాలి. అయితే, అలా చేయడంలో మనం అనవసరంగా ఏ ఒక్కరికీ—వారు వీరసింహుడి భటులయినా సరే హాని కలిగించకూడదు. ఎందుకంటే సైనికులు గాని, దళనాయకులు గాని నాయకుడి ఆజ్ఞను తలదాల్చే వాళ్ళేకదా. అయితే ఏ అధికారి అయినా; మన హెచ్చరికను లక్ష్యపెట్టకుండా, అమాయక ప్రజలనూ, స్త్రీలనూ హింసించినట్టయితే, చూస్తూ ఊరుకోరాదు. వారిని శిక్షించడానికి వెనుకాడ కూడదు," అని అనేవాడు.

ఎంత పరిశీలనగా చూసినా, ఆ ముసుగు వీరు డెవరో పోల్చుకోవడానికి వసంతుడికి సాధ్యపడలేదు. ఆ విషయం అడిగితే, "కాలం ఆసన్నమయినప్పుడు నీకే తెలుస్తుంది. ఏ విషయంలోగాని తొందర పాటు పనికి రాదు," అనే వాడు ముసుగు వీరుడు గంభీరమైన కంఠస్వరంతో.



వసంతుడు మౌనంగా దుకాణం నుంచి బయటకు వచ్చాడు. ద్వారం ముందు చీకటిగా వున్నది. అక్కడ ఒక స్తంభానికి దళనాయకుడి గుర్రం కట్టబడి వున్నది. వసంతుడు చుట్టుపక్కల కలయచూసి గుర్రాన్ని సమీపించి, మెల్లగా దానిని మచ్చిక చేసుకుని, జాగ్రత్తగా కట్టుతాడు విప్పి, సద్దుకాకుండా చీకటిలో గుర్రాన్ని మరికొంత ముందుకు నడిపించి, ఒక్క ఊపుతో గుర్రం మీదికి లంఘించి కూర్చుని ముందుకు అదిలించాడు.

ఒక గంటసేపట్లో అతడు సుమతీనదీ తీరాన్ని చేరుకుని, గుర్రాన్ని అక్కడే వదిలి, లోతు తక్కువగా వున్నచోట



నదిని ఈదుకుంటూ మరొక గంటసేపట్లో అవతలి గట్టున వున్న అమృతపురిని చేరుకున్నాడు. అమృతపురి చిన్న నగరం. శాంతిప్రియులైన ఆ నగర ప్రజలందరూ గాఢనిద్రలో వున్నారు. వసంతుడు తిన్నగా మంత్రి భవనం దగ్గరికి వెళ్ళి కాపలా భటులతో తక్షణమే మంత్రిని చూడాలన్నాడు. సమయానికి మంత్రి కూడా మేలుకొని వుండడంతో, ఆయన వసంతుడి కంఠస్వరంలోని ఆతృతను గమనించి, అతణ్ణి లోపలకు పంపమని భటులను ఆజ్ఞాపించాడు.


వసంతుడు లోపలికి వెళ్ళి, వీరసింహుడి దురాక్రమణ పథకం గురించి మంత్రికి తెలియజేశాడు. మంత్రి వెంటనే తమ సేనాధిపతిని రప్పించి, ఇరువురూ కలిసి రాజభవనానికి బయలుదేరారు.

అనారోగ్యంతో వున్న సత్యసేనుడు మంత్రి చెప్పిన వార్త విని, "నా అల్లుడూ, కుమార్తే దూరమయ్యారు. ఇప్పుడు రాజ్యం కూడా శత్రువుల వశమయ్యేట్టున్నది!" అన్నాడు విచారంగా నిట్టూరుస్తూ.

"నా శరీరంలో చివరి నెత్తుటి బొట్టు వున్నంతవరకూ మన రాజ్యాన్ని రక్షిస్తాను ప్రభూ," అన్నాడు సేనాధిపతి.

"నీ రాజభక్తి నేనెరిగినదే. కాని, సుమేధతో పోలిస్తే మన సైనికబలం మరీ స్వల్పం కదా? మొదట మీరు నదీతీరం చేరుకుని, శత్రువులు రాగానే వారితో సంధి చేసుకోవడానికి ప్రయత్నించండి. మనం సుమేధకు కప్పం చెల్లించడానికి కూడా సిద్ధంగా వున్నట్టు చెప్పండి," అన్నాడు రాజు.

మంత్రీ, సేనాధిపతీ కొంతసేపు మౌనం వహించారు. ఆ తరవాత మంత్రి, "ప్రభూ, మీ ఆజ్ఞానుసారమే నడుచుకుంటాం. ప్రస్తుత పరిస్థితులలో అదే సరైన మార్గంగా నాకూ అనిపిస్తున్నది. కాని, మన ప్రతిపాదనను వాళ్ళు గౌరవించి అంగీకరించకపోతే, యుద్ధం తప్పదు కదా!" అన్నాడు.



రాజు మరేమీ మాట్లాడకుండా మౌనం వహించాడు.

పథకం ప్రకారం పౌర్ణమినాటి రాత్రి వీరసింహుడి సేనలు సుమతీనది తీరానికి చేరాయి. అమితోత్సాహంతో ఆయుధాలను పడవలలోకి ఎక్కించారు. దళపతులు కూడా మరికొన్ని పడవలలోకి ఎక్కారు. ఆ తరవాత, కపాలకంఠుడు మిగతా సైనికులను, "మీరందరూ ఒక్కసారిగా నదిలోకి దిగి ఈదుకుంటూ అవతలిగట్టు చేరుకోండి," అని ఆజ్ఞాపించాడు.


పక్కనే వున్న వీరసింహుడు కపాలకంఠుడి కేసి గర్వంగా చూస్తూ తనూ ఒక పడవపై బయలుదేరాడు.

నదికి ఆవలిగట్టున అమృతపురి సేనలు గుమిగూడాయి. వీరసింహుడు రాగానే అతనితో మాట్లాడి సంధి కుదుర్చుకోవడానికి అమృతపురి మంత్రి సిద్ధంగా వున్నాడు.

ఆ సమయంలో ఉవ్వెత్తుగా ఉప్పెన లేచినట్టు హఠాత్తుగా భయంకరమైన శబ్దం వినిపించింది. మరుక్షణమే, వీరసేనుడి సేనల హాహాకారాలు మిన్ను ముట్టాయి. నదికి ఎగువన దూరంగా ఎక్కడో కొండలలో వర్షం కురిసి, హఠాత్తుగా వెల్లువ రావడంతో పడవలన్నీ తల్లకిందులయ్యాయి. నదిలో ఈదుతున్న సైనికులందరూ ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఎంతమంది వెల్లువకు బలయ్యారో, మరెంతమంది బతికి బయటపడ్డారో తెలియలేదు. వీరసింహుడు, కపాలకంఠుడు మాత్రం వెంట్రుకవాసిలో అపాయం నుంచి బయటపడి, ప్రాణాలతో తప్పించుకున్నారు. కొన్ని నిముషాలలో ఆ ప్రాంతమంతా మళ్ళీ ప్రశాంతంగా కనిపించింది.

ఆనందకరమైన ఈ హఠాత్ పరిణామం గురించి విన్న అమృతపురి రాజు సత్యసేనుడు, "ఈ ఆపదనుంచి ఆ భగవంతుడే మనల్ని రక్షించాడు. అయినా, మునుముందు మనం ఎలాంటి దాడినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా వుండాలి!" అన్నాడు మంత్రితో. —(ఇంకావుంది)





9

[సత్యసేనుడు పరిపాలించే అమృతపురి మీదికి దాడి జరపడానికి వీరసింహుడు రహస్య పథకం వేశాడు. ఈ వార్త తెలిసిన రాజు సత్యసేనుడు, వీరసింహుడితో సంధికుదుర్చుకోమని తనమంత్రిని కోరాడు. అయితే, వీరసింహుడి సేనలు పడవలపై సుమతీనదిని దాటుతున్నప్పుడు, హఠాత్తుగా వెల్లువ రావడంతో, సేనలు ప్రవాహంలో కొట్టుకుపోయాయి. తరవాత—]

హఠాత్తుగా జరిగిన ఈ ఘోరదుర్ఘటనకు దిగ్భ్రాంతి చెందిన వీరసింహుడు నది గట్టున శిలలా నిలబడిపోయాడు. కొత్త సేనాధిపతి కపాలకంఠుడు భయంతో నోరు తెరవలేకపోయాడు. చావు తప్పించుకున్న కొందరు దళనాయకులు మాత్రం, ప్రవాహంలో కొట్టుకుపోతూన్న ఆయుధ సామగ్రిని కొంత గట్టు మీదికి చేర్చారు. కాని, చాలవరకు ఆయుధాలు వెల్లువపాలయ్యాయి. కొన్ని ఆయుధాలను, నదికి అవలిగట్టున వున్న అమృతపురి సైనికులు గట్టుకుచేర్చారు. ప్రవాహంలో కొట్టుకుపోతూన్న వీరసింహుడి సైనికులు కొందరిని అమృతపురి సైనికులు గట్టుకు లాగి ప్రాణాలురక్షించారు. వారినందరినీ యుద్ధ ఖైదీలుగా చెరసాలలలో బంధించారు.

మరునాడు రాజు సత్యసేనుడు, అధికారులను సమావేశపరచి, ''శత్రు సైని



కుల నుంచి సాధించిన ఆయుధాలన్నిటినీ సిద్ధం చేసుకోండి, ఇకమీదట మనకు ఎవరి సానుభూతీ అవసరం లేదు. మన సైనికబలం స్వల్పమైనదే. కాని ఈ ప్రవాహంతో, వీరసింహుడి సైన్యం మనకన్నా బలహీనమైపోయింది. అయితే, ఆ దుర్మార్గుడు సైన్యాన్ని బలపరచుకుని మళ్ళీ మనపై దాడి జరిపితే ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉండాలి. పట్టుబడిన వీరసింహుడి సైనికులను వెంటనే విడిచిపెట్టండి," అని ఆజ్ఞాపించాడు.

ఆ రోజురాత్రి మంత్రీ, సేనాధిపతీ, ఇద్దరు దళనాయకులూ రాజు సత్యసేనుణ్ణి రహస్యంగా కలుసుకున్నారు. అప్పుడు సేనాధిపతి రాజుతో, "ప్రభూ, నదీ ప్రవాహం నుంచి మన సైనికులచే రక్షింపబడిన వీరసింహుడి సైనికులు చాలామంది, శాంతిపురానికి తిరిగి వెళ్ళడానికి ఇష్టపడడం లేదు. ప్రభువులు అనుమతిస్తే మన సైన్యంలో చేరడానికి సిద్ధంగా వున్నారు!" అన్నాడు.

రాజు ఒక్క క్షణం ఆలోచించి, "వీరసింహుడు సుమేధరాజ్య సింహాసనాన్ని ఆక్రమించినప్పుడు దురదృష్టవశాత్తు నేను అనారోగ్యం పాలయ్యాను. నా అల్లుడూ, కూతురూ, మనమడూ ఏమయ్యారో తెలియదు. వాళ్ళను గురించిన వివరాలు రాబట్టాలి. పైగా ఎక్కువ జననష్టం కలిగించే యుద్ధం చేయాలన్నది మన అభిమతం కాదు. కాని, దుర్మార్గుడయిన వీరసింహుడు, అమాయకులైన సుమేధ ప్రజలకు యుద్ధానికి మించిన కష్టాలు కలిగిస్తున్నప్పుడు, వాటిని అరికట్టే బాధ్యత మనకున్నది. కాబట్టి, మన పక్షం చేరాలని ఇష్టపడే వీరసింహుడి సైనికులను పరిశోధించి, మన సైన్యంలో చేర్చుకోండి," అన్నాడు.

తరవాత మంత్రి, "ప్రభూ మరొక శుభవార్త! శాంతిదేవమహారాజుగారి వృద్ధమంత్రి, వీరసింహుడు చేసిన హత్యాప్రయత్నం నుంచి తప్పించుకున్నాడు.



ఇప్పుడాయన మన రాజ్యంలో నేవున్నాడు!" అన్నాడు.

"అలాగా! వృద్ధమంత్రి సుగుణ శీలుడూ, వివేక సంపన్నుడూ అన్న విషయం మనమెరిగినదే. అయినా, హంత కుల బారినుంచి తప్పించుకోగలిగినంత వీరుడన్న విషయం తెలియదు!" అన్నాడు రాజు.

"వృద్ధమంత్రి అంతటి సాహసం చేయ లేదు ప్రభూ! సమయానికి ఒక ముసుగు వీరుడు గుర్రంపై వచ్చి, వీరసింహుడు నియోగించిన హంతకులను తృటిలో హత మార్చి, వృద్ధమంత్రిని రక్షించి మన రాజ్యానికి పంపాడు. వృద్ధమంత్రి అభి ప్రాయం ప్రకారం, ఆ ముసుగు వీరుడు మరెవరో కాదు...." అని ఇంకేదో చెప్ప బోయాడు మంత్రి.

అంతలో రాజు ఉత్సాహంతో లేచి పాన్పుపై కూర్చుంటూ, "ఎవరా ముసుగు వీరుడు? శాంతిదేవుడేనా? వెంటనే వృద్ధ మంత్రిని రప్పించు. ఆయనతో మాట్లా డాలి!" అన్నాడు.

"అలాగే రప్పిస్తాను ప్రభూ. ఇంకొక విషయం కూడా వినండి. వృద్ధమంత్రిని రక్షించిన ఆ ముసుగువీరుడే, సుమేధ రాజ్య పౌరుడయిన వసంతుడనే యువకుణ్ణి కూడా వీరసింహుడు విధించిన మరణ శిక్ష నుంచి రక్షించాడు. వసంతుడికి రాజు శాంతిదేవుడిపట్ల అభిమానమూ అపార గౌరవాదరాలూ వున్నాయి. వీరసింహుడి దుష్టపాలనను అంతమొందించాలన్న పట్టుదలతో, మారు వేషాలతో తిరుగుతూ సుమేధ రాజ్యంలోని యువకులందరినీ తన పక్షానికి తిప్పుకుంటున్నాడు. వసం తుడే వీరసింహుడి దాడి గురించి మనకు ముందే తెలియజేశాడు, అతనిపట్ల మనం ఎలా వ్యవహరించాలో తెలియడం లేదు," అన్నాడు మంత్రి.

రాజు మళ్ళీ కొంతసేపు మౌనంగా ఆలోచించి, "వీరసింహుడు, రాజకుటుం బాన్ని సమూలంగా నాశనం చేయడానికి

TL — F-3



పూనుకున్నా, మనం సుమేధ రాజ్య వ్యవహారాలలో ఎలాంటి జోక్యమూ కల్పించుకోలేదు. అయినా, ఆ విశ్వాసఘాతకుడు మనమీదికి దండెత్తడానికి వెనుకాడలేదు! అందువల్ల ఆ దుర్మార్గుడి పాలనకు ఎదురుదిరిగే వసంతుడికీ, అతని అనుచరులకూ తోడ్పడి ప్రోత్సహించడం మన కర్తవ్యం. ఎలా ప్రోత్సహించాలో మీకు తెలుసు కదా!'' అన్నాడు.

''ఈ క్షణంనుంచి మీ ఆజ్ఞానుసారం నడుచుకుంటాను.'' అని రాజుకు నమస్కరించి, మంత్రి, సేనాధిపతి దళనాయకులతో కలిసి బయలుదేరాడు.

* * *

నదీతీరం నుంచి విషాదంతో రాజప్రాసాదం చేరిన వీరసింహుడు, సేనాధిపతి కపాలకంఠుణ్ణి పిలిపించి, ''అయినా, వెల్లువ రావచ్చునని మనల్ని ముందుగా ఎవరూ హెచ్చరించలేదెందుకు?'' అని అడిగాడు.

''ఈ రుతువులో వెల్లువరావడం అనేది చాలా అరుదైన విషయం ప్రభూ. అందువల్ల ఈ అపాయాన్ని ఎవరూ ఊహించలేక పోయారు. ఇంతెందుకు? మన ఆస్థాన జ్యోతిష్కుడే, అది అద్భుతమైన ముహూర్తమని దండయాత్రకు కాల నిర్ణయం చేశాడు!'' అన్నాడు కపాలకంఠుడు.

''ఆ దుర్మార్గుణ్ణి వెంటనే హతమార్చు!'' అన్నాడు వీరసింహుడు.

''అతడు కనిపించడం లేదు ప్రభూ. సైన్యం నదీతీరానికి చేరినప్పుడు జ్యోతిష్కుడు సైన్యం వెనకే వున్నాడు. ఆ తరవాత నదీప్రవాహంలో కొట్టుకుపోయాడో, లేక ప్రాణాలతో తప్పించుకుని అమృతపురికి పారిపోయాడో తెలియడం లేదు ప్రభూ!'' అన్నాడు కపాలకంఠుడు.

''అమృతపురి! అమృతపురి! అది మనపాలిటి యమపురిలా దాపురించేలా వున్నది!'' అని అరిచాడు వీరసింహుడు ఆగ్రహావేశంతో.


"అలా అనకండి ప్రభూ! అమృత పురిని మనం జయించి తీరుతాం. కొత్తగా ఆయుధాలు సేకరించుకుని, సైన్యాన్ని బల పరచుకున్నట్టయితే అమృతపురి నిమిషా లలో మన వశమవుతుంది. అంతవరకు ఓపికపట్టాలి!" అన్నాడు కపాలకంఠుడు.

"ఇంకా ఎంతకాలం ఓపికపట్టడం? ఎక్కడి నుంచి ఆయుధాలు సేకరించడం?" అని ప్రశ్నించాడు వీరసింహుడు.

"మన దగ్గరధనం వుంటే ఎంత దూరం నుంచయినా ఆయుధాలు కొనుగోలు చేయవచ్చు. సైనికులను కొత్తగా చేర్చుకోవచ్చు." అన్నాడు కపాలకంఠుడు.

"అందుకు కావలసిన ధనం మనవద్ద లేదే! బావులు తవ్వడం, బాటలు వేయడం, విద్యాలయాలూ, ధర్మసత్రాలూ కట్టడం మొదలైన ప్రజోపయోగకార్యాల కని శాంతిదేవుడు ఖజానాలో వున్న ధనాన్నంతా ఖాళీ చేసేశాడు. ఇప్పుడు మనం ఏం చేయడం?" అన్నాడు వీర సింహుడు నిస్పృహతో.

"మహాప్రభూ, ఈ ఏడు మన రాజ్యంలో వరిపంట బాగా పండింది. మన రాజ్యంలో కన్నా చంద్రపురిలో వరికి ఐదురెట్లు ఎక్కువ ధర పలుకుతుంది. నాణ్యమైన కత్తులకూ, ఈటెలకూ చంద్రపురి పెట్టింది పేరు. మనం చంద్రపురిలో మన ధాన్యం



అమ్మి, అక్కడినుంచి ఆయుధాలను తెచ్చుకోవచ్చు." అన్నాడు కపాలకంఠుడు.

"అద్భుతమైన సలహా! సామాన్య రైతులనుంచి పంటలో సగభాగమూ, భూస్వాముల నుంచి పంటలో మూడు వంతులూ శిస్తుగా వసూలు చెయ్యమని చెప్పు." అని ఆజ్ఞాపించాడు వీరసింహుడు.

"చిత్తం మహాప్రభూ! శిస్తు వసూళ్ళు మొదటభూస్వాములనుంచిప్రారంభిస్తాం. ఈ రోజు భూస్వామి రఘునాథుడి ఇంటికి మనుషులను పంపిస్తాను," అని కపాల కంఠుడు అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

రామవరంలో రఘునాథుడు ధర్మబుద్ధి గల గొప్ప భూస్వామి. ఆయనకు వరి



పండే మాగాణి పొలాలు చాలా వున్నాయి. రామవరం ప్రజలు రఘునాధుడి వద్ద కావలసినప్పుడు, కావలసినంత ధాన్యం తీసుకునిపోయి, వీలయినప్పుడు డబ్బుగా గానీ, ఇతర వస్తురూపంలోగాని తిరిగి చెల్లించేవారు. ఇది రఘునాధుడి తండ్రి కాలం నుంచి వస్తున్నది.

ఆ రోజు మధ్యాన్నం రఘునాధుడి ధాన్యాగారం ముందు వందలాదిమంది గ్రామస్థులు చేతుల్లో గంపలతోనూ, సంచులతోనూ నిలబడి వున్నారు. అప్పుడు యువకుడయిన ఒక రాజోద్యోగి ఇరవై మంది రాజభటులనూ, యాభై ఎడ్లబళ్లనూ వెంటబెట్టుకుని గుర్రం మీద అక్కడికి వచ్చి, "ఈ ధాన్యంలో మూడు వంతులు రాజుగారికి చేరాలి!" అన్నాడు.

"ఎందుకు?" అని అడిగాడు రఘునాధుడు.

"నువ్వు చెల్లించవలసిన పన్ను," అన్నాడు అధికారి.

"నేను పన్ను పూర్తిగా చెల్లించాను. బాకీ ఏదీ లేదే!" అన్నాడు రఘునాధుడు.


"ఇది అదనపు పన్ను. ఈ ధాన్యాన్ని చంద్రపురికి తీసుకుపోవాలి!" అన్నాడు అధికారి.

"మరి ఈ ధాన్యాన్నే నమ్ముకుని వున్న ఈ గ్రామస్థుల గతేమిటి?" అని అడిగాడు రఘునాధుడు.

"ఈ ధాన్యాన్ని నమ్ముకోమని వాళ్ళకు ఎవరు చెప్పారు?" అన్నాడు అధికారి.

అతడి వెంట వచ్చిన రాజభటులు గ్రామస్థులకేసి కొరడాలు ఝుళిపిస్తూ, "ఊఁ... ధాన్యాన్ని బస్తాలలో నింపి, బళ్ళకెక్కించండి," అని ఆజ్ఞాపించారు.

"మా కడుపులు కొట్టకండి బాబూ," అని గ్రామస్థులు ఎంత మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. ఆఖరికి గ్రామస్థులే ఆ ధాన్యాన్ని బస్తాలలో నింపి, బళ్ళకెక్కించారు. బళ్ళన్నీ నిండేసరికి సాయంకాలమయింది. బళ్ళు పడమటి దిక్కుగా కదిలాయి. గ్రామస్థు లందరూ



తలలు వంచుకుని దీనంగా బళ్ళ వెంట కొంతదూరం నడిచారు. ఆ దృశ్యాన్ని చూసి, అధికారి లోలోపల ఆనందించ సాగాడు. అయితే, హఠాత్తుగా అతనికి ఒక అనుమానం కలిగింది. గ్రామస్థు లందరూ బళ్ళ వెనక ఎందుకు వస్తున్నారు? ఇందులో యువకుల కుట్ర వున్నదేమో అన్న భయంతో, గుర్రాన్ని వెనక్కు తిప్పి, కత్తి ఝుళిపిస్తూ, "ఇక, మీరందరూ తిరిగి వెళ్ళండి!" అని అరిచాడు.

ఆ సమయానికి బళ్ళన్నీ ఒక కొండ కనుమను సమీపించాయి. గ్రామస్థుల గుంపులో నుంచి ఒక యువకుడు "వెయ్!" అని కేక పెట్టాడు. మరు క్షణమే గుర్రం మీద వున్న రాజోద్యోగి మెడకు దూరం నుంచి విసిరిన దారం ఉచ్చు బిగించుకుపోయింది. వాడు గుర్రం పైనుంచి దభీమని కింద పడ్డాడు. పక్కనున్న కొండపై నుంచి ఆ ఉచ్చును విసిరిన యువకుడు, మరి కొందరు యువకులతో కలిసి వేగంగా కిందికి దిగివచ్చాడు. వాళ్ళు అధికారినీ, రాజభటులనూ, పెడ రెక్కలు విరిచి పట్టుకున్నారు. వాళ్ళతో ఆ యువకుడు, "భయపడకండి. మీ కెటువంటి హానీ తలపెట్టం," అని, బళ్ళ పైకి ఎక్కి, బస్తాలు దింపించి, గ్రామస్థులకు పంచి, "వీరసింహుడి మనుషులు మిమ్మల్ని ఇంకేమీ చేయలేరు. నిశ్చింతగా మీమీ ఇళ్లకు వెళ్లండి," అన్నాడు.

గ్రామస్థులు ధాన్యంతో సంతోషంగా వెనుదిరిగారు.

ఆ తరవాత ఆ యువకుడు, రాజోద్యోగినీ, రాజభటులనూ చెట్లకు బంధించమని తన అనుచరులకు ఆజ్ఞాపించాడు. ఆ తరవాత ఆ రాజోద్యోగితో, "మీరిక్కడ వున్నట్టు మీ నాయకుడికి తెలియజేస్తాం. ఈ రాజ్యంలో ఎవరి దగ్గరనుంచీ ధాన్యాన్ని బలాత్కారంగా పట్టుకుపోవడానికి అనుమతించమని కపాలకంఠుడికి మా హెచ్చరికగా తెలియజేయండి," అని అన్నాడు, ఆ యువకుల బృందానికి నాయకుడైన వసంతుడు. —(ఇంకా వుంది)





బందిపోటు యువరాజు

10

[అమృతపురిమీదికి దండెత్తిన వీరసింహుడి సేనలు, హఠాత్తుగా సుమతీ నదిలో వచ్చిన జలప్రవాహంలో కొట్టుకుపోయాయి. కొత్తగా సైన్యాన్ని సమీకరించడానికి పూనుకుని, ఆయుధ సేకరణకు అవసరమైన ధాన్యాన్ని రైతులనుంచి వసూలు చేయమని వీరసింహుడు కపాలకంఠుణ్ణి ఆదేశించాడు. అయినా, ప్రజలలో తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడింది.—తరవాత]

వసంతరుతువు రాకతో అరణ్యం సరికొత్త అందాలను సంతరించుకున్నది. పచ్చని చెట్టుచేమలపై పువ్వులు వింతవింత రంగులను సృష్టించాయి. ఎటు విన్నా కోకిల పాటలు; చిలుకల కిలకిలలు వీనుల విందు చేయసాగాయి!

శాంతిపుర యువరాజు అడవిలో అడుగుపెట్టినప్పటినుంచీ వసంతానికి మరింత శోభవచ్చింది. యువరాజుకు ఇప్పుడు ఆరేళ్ళు నిండాయి. జయానంద ముని అతనికి సందీపుడు అని నామకరణం చేశాడు. అడవిలోని పక్షులనూ, జంతువులనూ తన కనుసన్నలలో నడపగల శక్తి జయానందమునికి వున్నది గనక, వాటి సాయంతో ఆయన తన ముఖ్యమైన పనులను చేయించుకునేవాడు. అయితే, ఈ సంగతి చాలామందికి తెలియదు. ముని తనకున్న ఈ అపూర్వశక్తిని మెల్ల




మెల్లగా సందీపుడికి ప్రసాదించసాగాడు. అందువల్ల సందీపుడు మనుషులతో ఆడుకునే విధంగా, ఎల్లవేళలా అరణ్యమృగాలతో ఆటలాడుకునేవాడు! సందీపుడి మిత్రులలో పెద్దపెద్ద దంతాలతో కరీంద్రమనే పెద్ద ఏనుగు ఒకటి వుండేది. అది అడవిలోని ఏనుగు లన్నిటికీ పెద్దగా వ్యవహరించేది. కరీంద్రం రోజు తప్పకుండా సందీపుడి దగ్గరకు వచ్చేది. సందీపుడికి దానిమీద ఊరేగాలని ఉన్నప్పుడు నవ్వుతూ చేతులు పైకెత్తేవాడు. అది వెంటనే అతన్ని తొండంతో సుతారంగా పైకెత్తి దాని వీపుమీద కూర్చోబెట్టుకునేది. సందీపుడు కింద పడిపోకుండా పట్టుకోవడానికి ఒక కోతి అతని వెనక కూర్చునేది. మల్లి అనే చిలుక, చెట్టుచెట్టుకూ ఎగురుతూ ఏనుగు నడిచే మార్గాన్ని సూచిస్తూ ఉండేది.

యువరాజు అరణ్యానికి వచ్చినప్పటి నుంచీ, ముని ఆజ్ఞానుసారం, అతని రక్షణ బాధ్యతలు వహిస్తూన్న భల్లూకి అనే ఎలుగుబంటి, భూమికి అడుగున వున్న తియ్యటి కందమూలాలను తవ్వి, తెచ్చి అతనికి అందించేది. అరణ్యానికి దాపులనున్న పొలాలనుంచి చెరకు గడలను తెచ్చి ఇచ్చేది. ఇక, రెండు కోతులూ ఒకదానితో ఒకటి పోటీపడి, యువరాజుకు తియ్యటి మామిడిపళ్ళనూ, జామపళ్ళనూ, అరటిపళ్ళనూ తెచ్చి ఇచ్చేవి.

సందీపుడు తరచూ పులిపిల్లలతో దాగుడుమూతలాడుకునేవాడు. పచ్చగడ్డి మీద వాటితో కుస్తీ పట్టేవాడు.

సందీపుడు రోజూ తెల్లవారగానే సెలయేటిలో స్నానం చేసి, భక్తితో గురుసమక్షానికి వచ్చి కూర్చునేవాడు. గురువు అతనికి ప్రార్థనాశ్లోకాలనూ, ధ్యానపద్ధతులనూ నేర్పేవాడు. ఆ తరవాత కొంతసేపు చదవడమూ, రాయడమూ నేర్పేవాడు. ఆ పిమ్మట సందీపుడు గురువు వెంట అరణ్యంలో కొంతదూరం నడిచేవాడు. అప్పుడు జయానందముని, యువరాజుకు





నుంచే పుట్టాయి. రెండూ కూడా ప్రకృతిలో లభించే నీటినీ, గాలినీ సూర్యరశ్మినీ కావలసిన మేరకు ఉపయోగించుకుంటున్నాయి. అయినా, చంపక పుష్పాలకు ఒక విధమైన రంగూ, వాసనా ఉన్నాయి. మల్లెపువ్వు మరొక విధమైన వాసనలు వెదజల్లుతున్నది. పరిశీలించి చూస్తే ఇందులోని అద్భుతం అర్థమవుతుంది. ఇదే భూమి మీద పుట్టిన ఒక వృక్షం మామిడిపళ్ళనూ, మరొక వృక్షం పనసపళ్ళనూ మనకు అందిస్తున్నవి. ఇంతకన్నా అద్భుతం మరొకటున్నదా?'' అని వివరించేవాడు.

అక్కడి రకరకాల వృక్షాలనూ, చెట్లనూ, మొక్కలనూ, తీగలనూ చూపుతూ, వాటి పేర్లనూ, లక్షణాలనూ, గుణాలనూ వివరించి, ''నాయనా, మనం ఈ అందమైన ప్రకృతిని గౌరవించాలి. మనిషి పుట్టడానికి పూర్వమే ఈ ప్రకృతి ఉన్నది. భగవంతుడి అద్భుతాలను చూడడానికి మనమెక్కడికో వెళ్ళనవసరం లేదు. ప్రకృతిని ఒకసారి పరిశీలనగా చూస్తే చాలు. చూడగలిగిన కళ్ళకు అడుగడుగునా అద్భుతం కనిపిస్తుంది. ప్రతి మొక్కా, ప్రతి క్షణం ఒక అద్భుతాన్ని సృష్టిస్తున్నది. ఇలా చూడు, ఇది చంపక వృక్షం; ఇది మల్లె తీగ. రెండూ భూమి

సందీపుడు గురువు మాటలను ఏకాగ్ర చిత్తంతో ఆలకించేవాడు. ఆ తరవాత ప్రకృతిని పరిశీలనగా చూడడంలో అతడు అపూర్వమైన ఆనందం పొందేవాడు.

''మరొక విషయం గమనించావా? ఈ వృక్షాలు మనకు పళ్ళను ఇస్తున్నాయి గదా, దానికి ప్రతిఫలంగా అవి మననుంచి దేన్నీ ఆశించడంలేదు. నువ్వు జామపండునో, మామిడిపండునో కోసుకున్నావనుకో, చెట్టు దానికి ప్రతిఫలంగా నీనుంచి ఏదీ అడగడం లేదుగదా! ఎదుటివారికి ఇవ్వడంలోనూ, వారిని ఆనందపరచడంలోనూ, వాటి ఆనందమంతా ఇమిడి ఉన్నది. పరోపకారం చేయడంలో ఉన్న

ఆనందాన్ని మనుషులు కూడా పొంద గలగాలి. ప్రకృతిలోని ఈ మహోన్నత గుణాన్ని మానవజాతి అలవరచుకోవాలి!'' అని అనేవాడు జయానందముని.

సాయంకాల సమయాలలో ముని, సందీపుణ్ణి కొండమీదికి తీసుకుపోయి, ఆకాశంలో అప్పుడప్పుడే మెరుస్తూన్న చుక్కలను చూపి, వాటిపేర్లూ, వాటికి సంబంధించిన పురాణగాథలూ వివరించే వాడు.

ఈ విధంగా, రాజధానీ నగరానికి దూరంగా అరణ్యంమధ్య ప్రశాంత వాతావరణంలో, జయానందముని చల్లని నీడలో పెరగసాగాడు యువరాజు!

గురువు వివరించిన కథలలోని రాముడూ, కృష్ణుడూ, ధ్రువుడూ, నచికేతుడూ మొదలైనవారికందరికీ తల్లిదండ్రు లున్నారు కదా! మరి తనకెందుకు లేరన్న అనుమానం కలిగింది సందీపుడికి.అతడు ఒకనాడు మునితో, ''నా తల్లీ, తండ్రీ ఎవరు?'' అని అడిగాడు.

''ఒక బిడ్డకు, తల్లీ తండ్రీ అవసరం ఎందుకో తెలుసా? దేవుడు తన ప్రేమను, తల్లిదండ్రుల ద్వారా ఆ బిడ్డకు అంద జేయడానికే! మరి, నువ్వు అందరిలాంటి వాడివి కావు; చాలా గొప్పవాడివి! అందుకే మధ్యవర్తిలేకుండానే దేవుడి ప్రేమ



తిన్నగా నీకు లభ్యమవుతున్నది!'' అన్నాడు ముని ఎంతో ఆప్యాయంగా.

సందీపుడు తల ఊపి చిన్నగా నవ్వుతూ, ''ఆ దేవుడి ప్రేమ, నాకు కూడా తల్లిదండ్రుల ద్వారానే లభిస్తున్నది. మీరే నా తండ్రి; ఈ ప్రకృతే నా తల్లి!'' అని అన్నాడు.

అందుకు ముని నవ్వి, ''నువ్వెంతో వివేక సంపన్నుడివి. చుట్టూ వున్న ప్రతి వస్తువులోనూ దేవుడి ప్రేమను సందర్శించ గల శక్తి కలగాలని నిన్ను ఆశీర్వ దిస్తున్నాను!'' అన్నాడు సందీపుడి తల నిమురుతూ.

* * *



సింహాసనంపై కూర్చుని వున్న వీరసింహుడు, చారులు తెచ్చిన వార్త విని అగ్గిమీది గుగ్గిలంలా ఎగిరి పడ్డాడు. "కపాలకంఠా ఏమిటిదంతా? ఇవాళ కూడా అదేదుర్వార్త! ఈరోజు మళ్ళీ మన వారినుంచి ధాన్యం దోచుకున్నారట. మన మనుషుల్ని దోచుకునే ఆ దుర్మార్గులెవ్వరు?" అని అరిచాడు.

కపాలకంఠుడు వెంటనే ఏమి చెప్పడానికి తెలియక, మౌనంగా తల వంచుకున్నాడు.

"ఆ దోపిడీ ముఠాను ఎలాగైనా బంధించి, వాళ్ళందరినీ సమూలంగా నాశనం చేయాలి. ఆ దుర్మార్గులకు సాయపడేవాళ్ళను, వాళ్ళెవరయినాసరేకఠినంగా శిక్షించాలి." అన్నాడు వీరసింహుడు పళ్ళు కొరుకుతూ.

మరుక్షణమే ఎక్కడినుంచో ఒక బాణం సభామంటపం కిటికీగుండా దూసుకుని వచ్చి ఎదురుగా వున్న గోడకు ఖంగుమని తగిలి కిందపడింది. బాణం కొసకు చిన్న గుడ్డ కట్టబడి వున్నది.

వీరసింహుడు ఆశ్చర్యంగా సింహాసనం నుంచి లేచాడు. అతని వెంట సభికులందరూ లేచి నిలబడ్డారు.

ఆ బాణాన్ని అందుకోవడానికి కపాలకంఠుడు నాలుగడుగులు వేశాడు.

"మూర్ఖుడా, ఆగు!" అని అరిచాడు వీరసింహుడు.

కపాలకంఠుడు అక్కడే నిలబడిపోయాడు.

"మొదట వెళ్ళి ఆ బాణం వేసిన వాడెవడో వాణ్ణి పట్టుకో. రాజభవనం సమీపించి ఆ బాణం వేసిన దుర్మార్గుణ్ణి మన భటులు బంధించారేమో చూడు. లేకుంటే వాణ్ణి తరిమిపట్టుకో. వెళ్ళు.... ఊఁ" అని ఆజ్ఞాపించాడు వీరసింహుడు.

కపాలకంఠుడు గబగబా సభ నుంచి వెలుపలికి పరిగెత్తాడు. అతని వెంబడే మరి కొందరు అధికారులు కూడా వెళ్ళారు.

"ఇప్పుడు ఆ బాణం తీసుకురండి. అందులో ఏమున్నదో చూద్దాం," అన్నాడు వీరసింహుడు.

వీరసింహుడి ప్రధాన అంగరక్షకుడు వెళ్ళి బాణాన్ని తెచ్చి, దాని కొసకు కట్టి వున్న గుడ్డను విప్పి అందులో వున్న తాళ పత్రాన్ని వీరసింహుడికి అందించాడు. ఆ పత్రంలో ఇలా రాసి ఉన్నది: "మేము మీ మనుషులను దోచుకోవడం లేదు. నిజానికి మీరే అమాయక ప్రజలను అన్యాయంగా దోచుకుంటున్నారు. అసలు దోపిడీ దొంగలు మీరే! రైతులు కాయకష్టం చేసి పండించిన ధాన్యాన్ని వారి నుంచి మీరు బలవంతంగా దోచుకుపోతున్నారు. ఆ ధాన్యంతో అయుధాలు కొనడానికి మీరు ప్రయత్నిస్తున్నారు. మన ప్రజలకు కావలసింది కూడూ, గుడ్డా తప్ప ఆయుధాలు కావు. అందువల్ల, అమాయక ప్రజలనుంచి మీరు దోచుకున్న ధాన్యాన్ని మళ్ళీ రాబట్టుకోవడానికి ప్రజలే శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు!"

ఆ లేఖను చదివిన వీరసింహుడి కళ్ళు కోపావేశంతో ఎర్రబడ్డాయి. అంతటా ఒక నిమిషం నిశ్శబ్దం ఆవరించింది.

బాణం వేసిన వాణ్ణి, కపాలకంఠుడు కాళ్ళు చేతులు బంధించి లాక్కొని రాగలడన్న ఆశతో వీరసింహుడు కొంతసేపు ప్రధాన ద్వారం కేసి చూశాడు. అయినా వాడి జాడ కనిపించలేదు. వీరసింహుడు ఓర్పును కోల్పోయి అగ్రహావేశంతో ఊగి



పోతూ, "నేను మన మనుషుల్ని ఎవరో దోచుకుంటున్నారని ఇంతకుముందు అన్న మాటలు విన్న తరవాతే, ఎవడో ఈ లేఖను రాశాడు. అంటే మనమధ్యే శత్రువుల గూఢచారి ఎవడో వుండి, నా మాటలను శత్రువులకు చేరవేసి వుండాలి. లేదా, వాడే ఈ లేఖను రాసి వుండాలి. ఇది ఏమాత్రం సహించరానిది. అపాయం కూడా. ఈ క్షణమే ఆ దుర్మార్గుణ్ణి హతమార్చండి! హతమార్చండి! వద్దు, వద్దు....ఆగండి....వాణ్ణి చంపకండి. ఆ దుర్మార్గుడి నుంచి తిరుగుబాటుదారుల ముఠా రహస్యాలను కక్కించాలి!" అని పిచ్చివాడిలా అరవసాగాడు.

కపాలకంఠుడూ, అతడి అనుచరులూ తిరిగివచ్చి, సభామంటపంలో అడుగు పెట్టగానే, "ఎక్కడ ఆ దుర్మార్గుడు? వాణ్ణి హతమార్చేశారా?" అని అడిగాడు వీరసింహుడు.

"లేదు మహాప్రభూ! ఆ దుర్మార్గుడు తప్పించుకుని పారిపోయాడు. రాజభవనం కిటికీ గుండా వాడు బాణం ఎక్కుపెట్టేప్పుడు మన భటుడొకడు చూసి పట్టుకోవడానికి ప్రయత్నించాడట. కాని ఆలోగానే ఆ పిరికిపంద గుర్రంపై పారిపోయాడట!" అన్నాడు కపాలకంఠుడు.


"గుర్రంపై పారిపోయాడా? వాణ్ణి వెంబడించి పట్టుకోవడానికి మన వద్ద గుర్రాలే లేవా?" అని ప్రశ్నించాడు వీరసింహుడు కోపంగా.

"భటుడు అశ్వశాలకు వెళ్ళి, గుర్రమెక్కి వెళ్ళేలోగా ఆ దుర్మార్గుడు పారిపోయాడు ప్రభూ!" అన్నాడు కపాలకంఠుడు.

"ఆ చేతకాని భటుణ్ణి వెంటనే ఉరితీయించు! ఆగు ఆగు, ఆ గుర్రాన్ని కూడా చంపించు!" అని అరిచాడు వీరసింహుడు.

పట్టరాని ఆగ్రహంతో మతి చలించినవాడిలా మాట్లాడే వీరసింహుడి మాటలు విన్న సభలోని వారందరూ అమితాశ్చర్యంతో ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. —(ఇంకావుంది)





బందిపోటు యువరాజు


11

[వీరసింహుడు కొత్త సైన్యాన్ని సమీకరించడానికి పూనుకుని, ప్రజలనుంచి బలవంతంగా ధాన్యం వసూలుచేసి, ఆ ధాన్యంతో, చంద్రపురి నుంచి ఆయుధాలు కొనుగోలు చేయమని తమ అనుచరులను ఆజ్ఞాపించాడు. అయితే, అందుకు ప్రజలు ఎదురుతిరిగారు. వసంతుడి నాయకత్వంలో యువకులు కొందరు ప్రజారక్షణకు బద్ధకంకణులయ్యారు. —తరవాత]

ఒకనాటి మధ్యాహ్నం జయానందముని చెట్టుకింద విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు, ఆయన శిష్యుడు గోవిందుడు అక్కడికి వచ్చి, "గురువర్యా, ఒక ముసుగువ్యక్తి తరచూ మన ఆశ్రమ సమీపంలో తిరుగుతూ, సెలయేటి నీళ్ళు తాగుతూ, గుహలకేసి పరిశీలనగా చూస్తున్నాడు. నిన్న సాయంకాలం అతన్ని నేను మూడవసారి చూశాను," అన్నాడు.

"అవును, దూరం నుంచి నేనూ ఆయనను చూశాను. ఆయనెవరో గొప్పవాడై వుంటాడనీ, ఏదో మహత్తర కార్యం కోసమే ఇలా వస్తున్నాడనీ నాకనిపిస్తున్నది. ఇంకొకసారి కనిపించాడంటే నాతో చెప్పు. ఆయనతో మాట్లాడాలి," అన్నాడు జయానందముని.

కొన్నాళ్ళు గడిచింది. ఒకనాటి సాయంకాలం సందీపుడు పులిపిల్లలతో ఆడుకుంటున్నాడు. సందీపుడు పులిపిల్లలతో



కుస్తీపట్టడం చూసి పక్కనే వున్న భల్లూకి ఆనందంతో గంతులు వేయసాగింది. ఒక ముసుగువ్యక్తి బండచాటునుంచి ఆ విచిత్ర దృశ్యాన్ని చూస్తూ నిలబడ్డాడు.

జయానందముని ఆ వ్యక్తిని సమీపించి, "స్వాగతం," అన్నాడు.

ముసుగువ్యక్తి ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూసి, మరుక్షణమే తేరుకుని చేతులెత్తి మునికి నమస్కరించాడు.

"నువ్వు దేనినో వెదుకుతూ, తరచూ ఈ అరణ్యప్రాంతంలో తిరుగుతున్నావు కదా! ఆ వెదికేదేదో చెబితే, మేమేమైనా సహాయం చేయగలమేమో ఆలోచిస్తాం!" అన్నాడు ముని చిన్నగా నవ్వుతూ.

"నేనీ ప్రాంతంలో తిరగడం మూడో కంటికి తెలియదనుకున్నాను. అయినా, మీరు పసికట్టడం చాలా ఆశ్చర్యకరం!" అన్నాడు ముసుగువ్యక్తి.

"నీ ఉనికి వీరసింహుడి భటులకు తెలిసిపోతుందని నువ్వేమాత్రం సందేహించనవసరం లేదు. ఎందుకంటే ఈ ప్రాంతంలో కొత్తవారెవరయినా అడుగుపెడితే ఆ క్షణమే మాకు తెలిసిపోతుంది!" అన్నాడు ముని.

ముసుగువ్యక్తి మునిని పరిశీలనగా చూసి, "తమరు జయానందమునులే కదా! మీకిదే నా నమస్కారం," అన్నాడు.

ముని మందహాసం చేశాడు.

ముసుగువ్యక్తి ముని పాదాలు తాకి, "మహాత్మా, మిమ్మల్ని గురించి, నా మిత్రుడు జయపురి రాజు శంకరవర్మ ద్వారా చాలా విన్నాను. అయినా, వీరసింహుడి చారుల గురించి తమకు తెలియచేసే వారెవ్వరు? అలాంటి జాగరూకతవహించడానికి కావలసినంత మంది మనుషులు ఇక్కడ ఎవరూ కనిపించడం లేదే!" అన్నాడు.

"సహాయం చేయడానికి మనుషులు తప్ప మరెవ్వరూ వుండరని నీ అభిప్రాయమా?" అని అడిగాడు ముని నవ్వుతూ.

ఆ మాటలకు ముసుగువ్యక్తి మరింత ఆశ్చర్యపోతూ, ''అంటే, మీకు అతీత శక్తులున్నాయన్నమాట!'' అన్నాడు.

''ఆ మాత్రానికి అతీత శక్తులు ఎందుకు నాయనా! వాటిని సాధించడంకన్నా, మనతోపాటు, సహజీవనం సాగించే ఇతర ప్రాణులతో స్నేహం చేయడం సులభం కదా!'' అన్నాడు ముని.

ముని మాటలకు ముసుగువ్యక్తి ముఖం సంతోషంతో వికసించింది.

''పులులతోనూ, ఎలుగుబంటితోనూ, ఆ పసివాడు ఎలా ఆడుకోగలుగుతున్నాడో ఇప్పుడు నా కర్థమయింది మహాత్మా! అవునూ, ఇంతకూ ఆ కుర్రవాడెవరు?'' అని అడిగాడు ముసుగువ్యక్తి.

''నువ్వు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే మొదట నువ్వెవరో నాకు తెలియాలి,'' అన్నాడు ముని.


ముసుగువ్యక్తి, ఒక్క క్షణం మౌనం వహించి, ''మహాత్మా, నేను మిమ్మల్ని నమ్ముతున్నాను,'' అంటూ ముఖానికి వున్న ముసుగును తొలగించాడు.

ముని ప్రశాంతంగా నవ్వుతూ, ''మహా రాజా, ఆ పసివాడు వేరెవరో కాదు, నీ కుమారుడే! నిన్ను ఎప్పుడో ఒక్కసారే చూశాను. అయినా, యువరాజు రూపాన్ని బట్టే నిన్ను పోల్చుకోగలిగాను!'' అన్నాడు.



రాజు శాంతిదేవుడు నివ్వెరపోయాడు. ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి!

''రాజా, నువ్వు ప్రాణాలతో ఉన్నట్ట యితే, రాణిగారినీ, మీ కుమారుణ్ణీ వెదు క్కుంటూ, తప్పకుండా ఇక్కడికి రాగల వని నాకు తెలుసు. రాణిగారు యువ రాజును నాకు అప్పగించి, కళ్ళు మూసింది. నువ్వు ప్రాణాలతో క్షేమంగా వున్నావని తెలిసివుంటే ఆమె మరింత సంతోషంగా తనువు చాలించి వుండేది. అయినా, జరిగిపోయినదానికి విలపించకుండా భవిష్యత్తును భగవంతుడికి అర్పించమన్న నా సలహాను, ఆమె పాటించి, ప్రశాం తంగా వెళ్ళిపోయింది!'' అన్నాడు ముని.



"ఆ తరవాత?" అని అడిగాడు రాజు, పెల్లుబుకుతూన్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

"ఆ తరవాత ఆమె భౌతికకాయాన్ని అక్కడ సమాధి చేశాం," అంటూ దూరంగా వున్న ఒక బండరాతిని చూపాడు ముని.

ఆ బండ మీద రకరకాల పువ్వులు కనిపించాయి.

"ఊహ తెలిసిననాటి నుంచి, యువరాజు రోజు తప్పకుండా ప్రతి ఉదయం తన తల్లి సమాధి మీద పువ్వులుంచి పూజిస్తున్నాడు!" అన్నాడు ముని.

రాజు ఆ పైన దుఃఖాన్ని ఆపుకోలేక, సమాధి దగ్గరికి వెళ్ళి రాతికి తల ఆన్చి, పసిబిడ్డలాగా విలపించసాగాడు. ముని ఆయనన్ను సమీపించి, దగ్గర కూర్చుని మంచి మాటలతో ఓదార్చాడు.

కొంతసేపయ్యాక రాజు, "మహాత్మా, నేను నా బిడ్డను చూడవచ్చా?" అని అడిగాడు వినయంగా.

"అది నీ ఇష్టం. నా కెటువంటి అభ్యంతరమూ లేదు," అన్నాడు ముని.

రాజు కొంతసేపు మౌనంగా ఆలోచించి, "ఈ విషయంలో తమకేదో అసంతృప్తి ఉన్నట్టే తోస్తున్నది. మీరు మనస్ఫూర్తిగా అనుమతిస్తే తప్ప నేను నా బిడ్డను చూడను," అన్నాడు.

"రాజా, యువరాజు ప్రస్తుతం ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా పెరుగుతూ, నా దగ్గర విద్య నభ్యసిస్తున్నాడు. అతడు అద్భుతమైన తెలివితేటలు గలవాడు. నిన్ను చూడగానే తన తండ్రి అని గుర్తించగలడు. ఆపైన, జరిగిన సంగతులన్నీ బయటపడక తప్పదు. ధర్మబద్ధుడైన తన తండ్రి దుర్మార్గుల కుట్రకు బలి అయ్యాడన్న బాధ ఆ బిడ్డ మనసులో కలుగుతుంది. ఆ తరవాత, ఆ దుర్మార్గులపై పగసాధించాలన్న ఆగ్రహం ఆ పసిహృదయంలో ప్రజ్వలించవచ్చు. అది, అతని ప్రస్తుత ప్రశాంత జీవన విధానాన్నీ, విద్యావికాసాన్నీ దెబ్బతీయవచ్చునన్న అనుమానం కలుగుతున్నది," అన్నాడు ముని.





''మీరు నా బిడ్డను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. పైగా మీరిచ్చే విద్యను నేను ఇవ్వలేను. అంతేకాదు. నా సమయాన్ని ఒక్క నా బిడ్డ యోగక్షేమాల కోసమే వెచ్చించే స్థితిలో నేను లేను. అంతకన్నా ముఖ్యమైన పనులు నెరవేర్చవలసిన బాధ్యత నా మీద ఉన్నది!'' అన్నాడు రాజు.

''ఏమిటా గురుతరబాధ్యత?'' అని ప్రశ్నించాడు ముని.

''మహాత్మా, ప్రస్తుతం సుమేధ రాజ్యంలో నెలకొన్న పరిస్థితుల గురించి మీకు తెలుసో లేదో నాకు తెలియదు. నన్నూ, రాణినీ, మా బిడ్డనూ హతమార్చాలని వీరసింహుడు కుట్రపన్నాడు. నా భార్యాపిల్లల గతి ఏమయిందో, అసలు నేను ప్రాణాలతో వున్నానో లేదో కూడా వీరసింహుడికి తెలియదు. నిజానికి నేను వాణ్ణి వెంటాడుతూనే వున్నాను. అందువల్ల వాడు మనశ్శాంతిని కోల్పోయాడు. ఆందోళనతో ఆగ్రహానికి లోనయ్యాడు. ఆ ఆగ్రహాన్ని అన్నెం పున్నెం ఎరుగని అమాయక ప్రజలను వేధించడంలో చూపుతున్నాడు. పొరుగు రాజ్యాలపై దండెత్తి, అక్కడి సంపదలను దోచుకుని పంచుకుందామని దళనాయకులకు ఆశ చూపాడు. మా మామగారి రాజ్యమయిన

''నిజమే మహాత్మా, మీరన్నది అక్షరాలా నిజం!'' అన్నాడు రాజు.

''అయితే, ఇప్పుడు కాకపోయినా యువరాజుకు మునుముందు విషయం తెలియకపోదు. అప్పుడు అతడు తన ఇష్టానుసారం కర్తవ్యాన్ని నిర్వహించగలడు. అయితే, అందుకు ఇంకా కొంత కాలం గడవాలన్నది నా అభిప్రాయం!'' అన్నాడు ముని.

''అదీ నిజమే. పైగా, నా కుమారుడిపై నేను బంధం పెంచుకోవడం మంచిది కాదు,'' అన్నాడు రాజు.

''ఎందుకలా అంటున్నావు?'' అని అడిగాడు ముని.

అమృతపురి మీదికి దండెత్తాడు. కాని అదృష్టవశాత్తు సుమతీనదిలో హఠాత్తుగా వెల్లువరావడంతో వీరసింహుడి సేనలూ, ఆయుధాలూ కొట్టుకుపోయాయి. ఆ పైన కొత్తగా సైన్యాన్ని సమీకరించడానికి ప్రజలనుంచి, ధాన్యం దోచుకోవడం మొదలుపెట్టాడు. అయితే, వాడి దుష్కృత్యాలు కొనసాగకుండా అడ్డుపడడానికి నా శాయశక్తులా పాటుపడుతున్నాను,'' అన్నాడు రాజు.


ముని, ఆ మాటలకు సంతోషంగా తల వూపి, ''రాజా, సుమేధరాజ్యంలో జరుగుతూన్న అఘాయిత్యాలన్నీ నాకు తెలును. వీరసింహుడి భటుల ఆట కట్టించడానికి కొందరు యువకులు చేస్తూన్న ప్రయత్నాల గురించి కూడా విన్నాను. వీరసింహుడు, ఆ యువకులను హతమార్చాలన్న పట్టుదలతో ఉన్నట్టు కూడా తెలిసింది. ఏమాత్రం అవకాశం లభించినా, యువకులనూ వారి బంధుమిత్రులనూ నిర్దాక్షిణ్యంగా మట్టుపెట్టగల పరమ కిరాతకుడువాడు! అందువల్ల యువకులందరూ, కలిసికట్టుగా ఎంతో అప్రమత్తతతో ఒక పథకం ప్రకారం పోరాటం సాగించాలి. మొదట, వీరసింహుడు తన అరాచకాలను ఆపాలని హెచ్చరించి కొంత కాలం గడువిద్దాం. ఆ గడువులోపల వీరసింహుడు దారికి రాలేదంటే యుద్ధం తప్పదు. అయితే, ఆ యుద్ధం—వీరసింహుడి సేనలకూ, సాహసవంతులైన సుమేధరాజ్య యువకులకూ మధ్యమాత్రమే జరగాలి. అమాయకులయిన సామాన్య ప్రజలను హింసించరాదు. వారికి ఇసుమంత కష్టం కూడా వాటిల్లకూడదు. ఏమంటావు?'' అని అడిగాడు ముని.

''అవును మహాత్మా!'' అన్నాడు రాజు.

''నువ్వు ఆ యువకులను ఒకటిగా సమీకరించి, సుమేధ రాజ్య సరిహద్దులో వున్న అరణ్యంలోకి నడిపించడం శ్రేయస్కరం!'' అన్నాడు ముని.

"మీ ఆజ్ఞను శిరసావహిస్తాను మహాత్మా," అన్నాడు రాజు. —(ఇంకా వుంది)





బందిపోటు యువరాజు

12

[జయానందముని ఆశ్రమంలో పెరుగుతూన్న తన కుమారుణ్ణి రాజు శాంతిదేవుడు చూశాడు. నానాటికీ పెరిగిపోతూన్న వీరసింహుడి దురాగతాలను అరికట్టడానికి వసంతుడి నాయకత్వంలో పోరాటం సాగిస్తూన్న సుమేధరాజ్య యువకులను, సరిహద్దు ప్రాంతాలలోని అరణ్యమధ్యానికి నడపమని జయానందముని రాజుకు సలహా ఇచ్చాడు. —తరవాత]

పొరుగు రాజ్యాలపై దండెత్తి అక్కడి సంపదలను దోచుకోవాలన్న వీరసింహుడి కల, కలగానే మిగిలిపోయింది. వీరసింహుడి భటులు అమాయక ప్రజల నుంచి ధాన్యాన్ని దోచుకోవడానికి సుమేధ రాజ్య యువకులు అడ్డుతగిలారు.

తిరుగుబాటు జరిపే యువకుల రహస్య స్థావరాలను కనుగొనడానికి వీరసింహుడూ, సేనాధిపతి కపాలకంతుడూ అనేక విధాలుగా ప్రయత్నించారు. కాని ప్రయోజనం లేకపోయింది. ఎందుకంటే, ఆ యువకులందరూ అరణ్యంలో ఒకేచోట కాకుండా వేరువేరు స్థలాలలో దాగి వుండేవారు. నిర్ణీత సమయాలలో ఒక అందమైన లోయ వద్ద కలుసుకునేవారు. చుట్టూ కొండలతో, అక్కడక్కడ సన్నటి సెలయేళ్ళతో ఆ ప్రాంతం చిన్న లోయలాగా కనిపించినప్పటికీ నిజానికి అది



లోయ కాదు. మధ్య విశాలంగా వున్న పెద్ద కనుమ. ఇది అంత సులభంగా ఎవరికీ కనిపించదు. ఈ కనుమలో ప్రకృతి సిద్ధమైన గుహలూ, సొరంగాలూ వున్నాయి. అవసరమైనప్పుడు వాటిలోకి వెళ్ళి దాక్కోవడానికి వీలుగా వుండేది.

తిరుగుబాటుదార్లు వారానికొకసారి అక్కడ కలుసుకునేవారు. అమృతపురిలో శరణార్థులుగా స్థిరపడిపోయిన వీరసింహుడి సైనికులు కొందరిని రప్పించి, యువకులు వారిద్వారా యుద్ధ కళలో శిక్షణ పొందేవారు.

యువకులు విడివిడిగా సన్యాసులుగానూ, వ్యాపారులుగానూ, పరదేశంనుంచి వచ్చిన యాత్రికులుగానూ రకరకాల మారువేషాలు ధరించి, సుమేధ రాజధాని శాంతిపురంలోనూ, గ్రామాలలోనూ తిరిగేవారు. వీరసింహుడి సైనికులు ఎవరినైనా దోచుకోవడానికి పథకం వేస్తున్నట్టు తెలియగానే, అడవికి వెళ్ళి సంగతిని వసంతుడికి తెలియజేసేవారు. వసంతుడి అనుచరులు చిన్న చిన్న గుంపులుగా విడిపోయి, నలుదిశలనుంచీ ఒక్కసారిగా వీరసింహుడి భటులపైబడి వారి పథకాన్ని ధ్వంసం చేసేవారు!

ఇలాగే ఎనిమిది సంవత్సరాలు గడిచిపోయాయి. సుమేధ ప్రజల జీవితం మరీ దుర్భరమైన స్థితికి చేరుకున్నది!

ఒకనాటి మధ్యాన్నంవేళ, వసంతుడు పొడవాటి గడ్డం పెట్టుకుని, దండకమండలాలు ధరించి గొప్ప సాధువులాగా వేషం వేసుకుని కపాలకంఠుడి ప్రధాన సైనిక శిబిరం ఎదుట అరుగుమీద కూర్చున్నాడు. పట్టపగలు అంత ధైర్యంగా సైనికశిబిరం దగ్గరికి వచ్చిన వసంతుణ్ణి ఎవరూ అనుమానించలేక పోయారు.

అక్కడ గస్తీ తిరుగుతూన్న ఒక దళనాయకుడు వసంతుణ్ణి నిజమైన సాధువే అని భావించి, అతన్ని సమీపించి, "మహాత్మా, తమకు హస్తసాముద్రికం తెలుసా?" అని అడిగాడు.

"తెలుసు," అన్నాడు వసంతుడు గంభీరంగా.

"అలా అయితే, తమరు మా ఇంటికి విచ్చేసి, నా హస్తరేఖలను పరిశీలించి నా భవిష్యత్తు తెలియజేయగలరా," అని ప్రార్థించాడు దళనాయకుడు.

ఆ దళనాయకుడి వెంట వెళితే ఏవైనా రహస్యాలు తెలుస్తాయని వసంతుడు, "అలాగే, అభీష్ట సిద్ధిరస్తు," అని దీవిస్తూ పైకి లేచాడు.

అప్పుడు భవనం కప్పునుంచి వేలాడుతూన్న సన్నటి ఊచకు అతని తల తగిలి, తలపై పెట్టుకున్న పెద్ద జుట్టు కాస్త దాని కొసకు చిక్కుకున్నది!

ఆ దృశ్యాన్ని చూసిన దళనాయకుడు అదిరిపడి, "ఏమిటీ! నువ్వు దొంగసన్యాసివా? ఎవరు నువ్వు?" అని గద్దించాడు.

ఇక వాడితో మాట్లాడి ప్రయోజనం లేదని గ్రహించిన వసంతుడు వెంటనే పరుగుపట్టాడు!

"పట్టుకోండి వాణ్ణి....వాడొక గూఢచారి ...పట్టుకోండి," అని అరుస్తూ వసంతుడి వెంట పరిగెత్తసాగాడు దళనాయకుడు. దళనాయకుడి వెంట మరిద్దరు సైనికులు పరిగెత్తసాగారు. ఇలా కొంత దూరం పరిగెత్తారు కాని, వసంతుణ్ణి పట్టుకోలేకపోయారు. వాళ్ళకు ఎదురుగా



గుర్రం మీద ఒక వ్యక్తి రావడం కనిపించింది.

"వాణ్ణి పట్టుకో........పట్టుకుంటే నీకు మంచి బహుమతి ఇస్తాను," అని అరిచాడు దళనాయకుడు.

ఆ గుర్రం మీద వస్తూన్న వ్యక్తి ఏ రాజోద్యోగో అయి వుంటాడని దళనాయకుడు భావించాడు. అయితే, ఆ ముసుగు వ్యక్తి వసంతుడితో, "వేగంగా వెళ్ళి నదిని దాటు. వీళ్ళ పని నేను చూస్తాను," అని, గుర్రాన్ని ముందుకు అదిలించి, "ఆగు అక్కడే! అతన్ని పట్టుకోవద్దు!" అంటూ దళనాయకుడి మీదికి కొరడా ఝుళిపించాడు!



దళనాయకుడు ఒక్క దెబ్బకే కింద పడిపోయాడు. అతని వెంట వచ్చిన ఇద్దరు సైనికులూ అతన్ని లేవనెత్తడానికి వెళ్ళారు.

ఆ వ్యక్తి గుర్రాన్ని వెనక్కు తిప్పి, ముందుకు ఉరికించాడు. గుర్రం నందినీ నదీతీరాన్ని చేరుకుని, ఒక్క గెంతున సన్నగా పారుతూన్న నదిని మెరుపులా దాటి అవతలిగట్టును చేరింది!

అలోగా నదిని ఈదుకుంటూ వెళ్ళి అవతలిగట్టు ఎక్కుతూన్న వసంతుడికి తన చేతిని అందించాడు ముసుగు వ్యక్తి. అప్పుడు ఆయన ముఖం మీది ముసుగు ఒకపక్కకు తొలగిపోయింది. మరుక్షణమే వసంతుడు ఆయన పాదాలపైబడి, "మహారాజా, నా ప్రాణాలను అనేకసార్లు రక్షించిన మహానుభావులు తమరే అయి వుంటారని అనుకుంటూనే వున్నాను. ఈ రోజు కూడా తమచేత రక్షింపబడడమే కాదు; తమ దర్శనభాగ్యం కూడా కలిగింది. నేనెంతో అదృష్టవంతుణ్ణి!" అన్నాడు ఆనందబాష్పాలు రాలుస్తూ.

రాజు అతన్ని ఆప్యాయంగా లేవనెత్తి, "వసంతా, నీ ధైర్యసాహసాలూ, కార్యదీక్ష మెచ్చుకోదగినవి. ప్రజలపట్ల నీకున్న ప్రేమాభిమానాలు ప్రశంసనీయమైనవి. అయితే, నేను ప్రాణాలతో ఉన్నట్టు మాత్రం ఎవరికీ తెలియనీకు," అన్నాడు.

"ఎందుకు మహారాజా?" అని అడిగాడు వసంతుడు.

"ప్రజలలో అశాంతి ప్రబలుతుంది. నన్ను పట్టుకోవాలన్న ప్రయత్నంలో వీరసింహుడు అమాయక ప్రజలను హింసించగలడు!" అన్నాడు రాజు.

"మహారాజా, ప్రజలకోసం పోరాడుతూన్న మా యువకులకైనా తమరు ప్రాణాలతో ఉన్నట్టు తెలియడం అవసరం. ఈ విషయం తెలిస్తే వాళ్ళెంతగానో ఉప్పొంగిపోగలరు. ధర్మప్రభువులయిన తమకోసం పోరాడుతున్నామంటే మాలో ఉత్సాహం పెల్లుబుకుతుంది. దయచేసి ఒకే ఒకసారి



మా యువకులకు కనిపించండి. పైగా, మీరే మమ్మల్ని నడిపించాలి. ఇంకా ఎన్నాళ్ళని వీరసింహుడి భటులతో దాగుడుమూతలు సాగించడం? ప్రజల పరిస్థితి మరీ దయనీయంగా తయారయింది. త్వరలో దీనికొక అంతం చూడాలి. ఆ దుర్మార్గుణ్ణి గద్దెదించాలి!'' అన్నాడు వసంతుడు ఆవేశంగా.

రాజు కొంతసేపు ఆలోచించి, ''అవును, నీ వన్నది నిజం. మన యువకులందరినీ ఒకటిగా చేర్చుకుని, అమృతపురి సైనికుల సహాయంతో వీరసింహుడి దుష్టపాలనను తుదముట్టించాలి!'' అన్నాడు.

వసంతుడి ముఖం ఆనందంతో విప్పారింది. అతడు పట్టరాని ఆనందంతో రాజుకు మళ్ళీ ఒకసారి నమస్కరించాడు.

* * *

అది ఒక పున్నమిరేయి. వసంతుడి అనుచరులు వందమంది తమ రహస్య స్థావరమైన లోయలో గుమిగూడి రాజుగారి రాకకోసం ఎదురుచూడసాగారు.

హఠాత్తుగా ఒక బండచాటునుంచి ''వసంతా!'' అన్న పిలుపు వినిపించింది. అది రాజుగారి కంఠస్వరమే అనిగుర్తించిన వసంతుడు అటుకేసి వెళ్ళాడు. అక్కడ రాజు కనిపించగానే, ''మహారాజా,'' అంటూ నమస్కరించాడు.

రాజు, ''అపాయం ముంచుకొస్తున్నది. ఇక్కడ ఒక్క క్షణం కూడా జాగు చేయకూడదు. ఒక్కసారిగా కనుమ రెండు వైపుల ద్వారాలూ మూసివేసి మీలో ఒక్కరు కూడా బయటికిపోకుండా అందరినీ హతమార్చాలని వీరసింహుడు పథకంవేశాడు. సైన్యంతో కపాలకంఠుడు బయలుదేరి వస్తున్నాడు. ఇప్పుడు వాళ్ళు కనుమ పడమటి ద్వారాన్ని సమీపిస్తున్నారు. తూర్పు ద్వారాన్ని చేరుకోవడానికి మరి కొంతసేపు పట్టవచ్చు. నేను పడమటి ద్వారం దగ్గర నిలబడి వాళ్ళను లోనికి జొరబడకుండా చూసుకుంటాను. ఈలోగా మీరందరూ తూర్పు ద్వారం గుండా



తప్పించుకుని వెళ్ళండి. కదలండి .... ఊఁ," అని ఆజ్ఞాపించాడు.

వసంతుడు, విషమించిన పరిస్థితిని గ్రహించాడు. వీరసింహుడి పథకం నెరవేరినట్టయితే తిరుగుబాటు అసాధ్యమై పోతుంది. అందువల్ల వసంతుడు, తన అనుచరుల కేసి తిరిగి, "మీరందరూ తూర్పు ద్వారంగుండా, సురక్షిత ప్రాంతాలను చేరుకోండి," అని ఆజ్ఞాపించాడు.

మరుక్షణమే యువకులందరూ కనుమ తూర్పు ద్వారంకేసి నడిచారు. వసంతుడు మాత్రం రాజు దగ్గరే నిలబడ్డాడు.

"నువ్వు వెళ్ళవేం?" అని అడిగాడు రాజు కాస్త కటువుగా.

"నా ప్రాణం పోయినాసరే మిమ్మల్ని ఇక్కడ ఒంటరిగా వదిలి వెళ్ళను, మహారాజా!" అన్నాడు వసంతుడు దృఢమైన కంఠస్వరంతో.

ఇంతలో కనుమ పడమటి ద్వారం దాపులలో శత్రుసేనల అలికిడి వినిపించింది.

రాజు కత్తి దూసి ద్వారానికి అడ్డంగా నిలబడ్డాడు. ద్వార మార్గం మరీ ఇరుకుగా వుండడంతో వసంతుడు రాజు వెనక నిలబడ్డాడు.

"నడవండి ముందుకు. కనుమలో జొరబడి ఆ దుర్మార్గులను హతమార్చండి!" అని సైన్యాన్ని ఆజ్ఞాపించాడు కపాలకంతుడు, తను మాత్రం వెనకనే ఉంటూ.

కనుమలోకి ప్రవేశించడానికి ఒక్క అడుగు ముందుకు వేసిన మొదటి సైనికుడు, రాజుగారి కాలితాపుకు వెల్లకిలా వెనక్కు పడ్డాడు.

"లోపలికి అడుగువేస్తే ప్రాణాలు దక్కవు జాగ్రత్త!" అని హెచ్చరించాడు వసంతుడు, రాజు చేసిన సూచన ప్రకారం.

"వసంతా, ఇదే నీ జీవితంలో ఆఖరి రాత్రి! కాదు, కాదు ఆఖరి క్షణం!" అని అరుస్తూ కపాలకంతుడు ముందుకు దూకాడు. ద్వారానికి కాపలా వున్న వాళ్ళ దగ్గర ఆయుధాలు లేవని కపాలకంతుడు అనుకున్నాడు. ఆయుధాలు ఉన్నట్టయితే

లోపలికి అడుగుపెట్టిన సైనికుణ్ణి హత మార్చకుండా ఎందుకు వెలుపలికి తోస్తారు అని భావించాడు. నిరాయుధుడుగా వున్న వసంతుణ్ణి పట్టి బంధిస్తేనో లేదా హత మారిస్తేనో తనను వీరసింహుడు మెచ్చుకో గలడని ఆశించాడు కపాలకంఠుడు.

"కపాలకంఠా, నీ ప్రాణాలు కాపాడుకో. నిన్ను చంపాలన్నది మా ఆశయంకాదు. గుట్టుగా వచ్చినదారి పట్టి తిరిగి వెళ్ళిపో," అని హెచ్చరించాడు వసంతుడు.

అయినా, ఇంతలో కపాలకంఠుడు ద్వారంకేసి గురిచూసి ఒక ఈటెను విసిరాడు. ఆ ఈటె ఎదురుగుండా వున్న రాజు వక్షంలోకి దిగబడింది! ఆయన అలాగే కిందికి ఒరిగిపోయాడు. నేలకు ఒరిగిన వ్యక్తే వసంతుడనుకుని కపాల కంఠుడు ఉత్సాహంగా ముందుకు ఉరికాడు!

''దుర్మార్గుడా! పరమకిరాతకుడా!'' అని అరుస్తూ వసంతుడు కత్తి దూసి కపాలకంఠుడి తలను తెగనరికాడు! తల ఎగిరి దూరంగా పడింది!

మరుక్షణమే సైన్యంలో కలకలం చెల రేగింది. ''సేనాధిపతి మరణించాడు.... కపాలకంఠుడు మరణించాడు....'' అని హాహాకారాలు చేస్తూ సైనికులు భయపడి పోయి వెనుదిరిగి పారిపోయారు.



తూర్పుద్వారం గుండా కనుమలోకి ప్రవేశించాలనుకున్న వీరసింహుడి సైని కులు, వసంతుడి అనుచరులందరూ వెళ్ళిపోవడంతో, నిరాటంకంగా లోపలికి వచ్చారు. కాని అక్కడ ఎవరూ కని పించకపోయేసరికి ఆశ్చర్యంతో వెళ్ళి పోయారు.

ఈలోగా వసంతుడు రాజును, సన్నటి సెలయేటికి అవలవున్న ఒక గుహ లోపలికి మోసుకుపోయి, మెల్లగా దించి, తాగడానికి నీళ్ళు తెచ్చి ఇచ్చాడు. సైనికు లందరూ వెళ్ళిపోయారని నిర్ధారించు కున్నాక, అక్కడ వున్న చితుకులు ఏరి చిన్న మంట వేశాడు.

రాజు వసంతుడి తొడమీద తల ఆనించి పడుకుని, "వసంతా, నాకు మరణం సమీపిస్తున్నది. అయినా, నువ్వు పోరాటం కొనసాగించాలి. నాకు అధికారం పైన మక్కువలేదు. అందుకే ఇంతకాలం నా ఉనికి ఎవ్వరికీ తెలియకుండా గడిపాను. అయినా, వీరసింహుడి ధోరణిలో మార్పు వస్తుందన్న నమ్మకం నాకు లేదు. వాడు అమాయక ప్రజలను వేధించడం మానడు. వాడు పెట్టే బాధలనుంచి ప్రజలకు విముక్తి కలగాలి. అందుకే తుదిదాకా పోరాడమని ఆదేశిస్తున్నాను. ఇదే నా తుది సందేశం!" అన్నాడు.

రాజు వక్షస్థలం మీద వసంతుడు గుడ్డతో కట్టుకట్టాడు గాని, రక్తం స్రవిస్తూనే ఉన్నది. రాజు కంఠస్వరం మరీ నీరసంగా తయారయింది.


"మహారాజా, మీరు మరణించాక మేము ఎవరికోసం పోరాడాలి? వీరసింహుణ్ణి గద్దెదించగలం! కాని ఆ తరవాత ఎవరికి పట్టం గట్టడం? మీకు ముందే మహారాణీ, యువరాజూ మరణించారు కదా!" అన్నాడు వసంతుడు బాధగా.

"వసంతా, రాణి మరణించింది, నిజమే. కాని, ఆమె యువరాజుకు భద్రత కల్పించి మరీ వెళ్ళింది! ఒక ముని సంరక్షణలో యువరాజు క్షేమంగా పెరుగుతున్నాడు. ప్రస్తుతం ముని కాపాడుతున్నట్టే, కాలం ఆసన్నమయినప్పుడు, నువ్వే యువరాజుకు అండగా నిలబడాలి. ప్రజాక్షేమమే ప్రధాన లక్ష్యంగా పోరాడాలి!" అన్నాడు రాజు.

"యువరాజు క్షేమంగా ఉన్నారా? అలా అయితే ఆయన కోసం మేము పోరాటం కొనసాగిస్తాం. ఆ ఉదయ భానుడిని కమ్ముకున్న మేఘాలను తొలగించగలం! యువరాజు ఎక్కడ వున్నారు ప్రభూ?" అని అడిగాడు వసంతుడు పట్టరాని ఉత్సాహంతో.

శాంతిదేవ మహారాజు వసంతుడికి అంతా వివరంగా తెలియజేసి, తెల్లవారుజామున కళ్ళుమూశాడు.—(ఇంకా వుంది)






13

[వసంతుడి నాయకత్వంలో తిరుగుబాటు జరిపే యువకులను కాపాడే ప్రయత్నంలో రాజు శాంతిదేవుడు బలంగా గాయపడ్డాడు. వసంతుడు, క్రూరుడైన వీరసింహుడి సేనాధిపతి కపాలకంతుణ్ణి హతమార్చాడు. అరణ్యంలో జయానందముని ఆశ్రమంలో పెరుగుతూన్న యువరాజును గురించిన వివరాలను వసంతుడికి తెలియపరిచి రాజు మరణించాడు. —తరవాత]

వసంతుడు శాంతిదేవమహారాజు తెలియజేసిన వివరాలప్రకారం వెళ్ళి, అరణ్యమధ్యంలోని జయానందముని ఆశ్రమంలో పెరుగుతూన్న యువరాజు సందీపుణ్ణి కలుసుకున్నాడు. మహారాణి సమాధి సమీపంలోనే రాజుగారి భౌతికకాయాన్ని పాతిపెట్టారు. ఆ క్షణం నుంచి వసంతుడికీ, యువరాజుకూ మధ్య గాఢమైన మైత్రి ఏర్పడింది. దానిని చూసి జయానందముని ఎంతో సంతోషించాడు. వీరసింహుడు చేసే అఘాయిత్యాలను గురించి వసంతుడి ద్వారా విని, వాటిని అరికట్టడానికి సుమేధ రాజ్య యువకులతో కలిసి తాను కూడా పాలుపంచుకుంటాననేవాడు సందీపుడు. అయినా, వసంతుడు అందుకు ఒప్పుకునేవాడు కాదు. "యువరాజా, మీ ప్రాణం మాకు అమూల్యమైనది. మీకు ఎటువంటి ఆపదా రాకూడదు.



కంటక ప్రాయమయింది. మరొకవైపు ఎంత ప్రయత్నించినప్పటికీ వీరసింహుడు తన పథకాలకు అడ్డుతగిలే యువకులను అణచలేకపోయాడు. ఆఖరికి ఒకనాడు వీరసింహుడు తన కొత్త సేనాధిపతి సర్ప దంతుణ్ణి పిలిచి, "ఆ తిరుగుబాటుదార్ల అరాచకాలను ఇక సహించి లాభం లేదు. ఈనాటితో వాళ్ళ అంతు చూడక తప్పదు. అరణ్యాలే కదా ఆ దుర్మార్గుల రహస్య స్థావరాలు! అరణ్యాలను మన సైన్యంతో గాలించి వేయాలి," అన్నాడు.

"చిత్తం మహాప్రభూ! సేనలను అరణ్యం కేసి నడిపిస్తాను!" అన్నాడు సర్పదంతుడు.

"సేనలకు మేమే స్వయంగా నాయకత్వం వహించి నడిపిస్తాం," అన్నాడు వీరసింహుడు.

ఆ మాటలకు సర్పదంతుడు ఒక్క క్షణం ఆశ్చర్యపోయి, తరవాత తేరుకుని, "ప్రభువులు మన్నించాలి. మరే రాజ్యం మీదికో దాడి జరిపేప్పుడు ఫరవాలేదుగాని, కేవలం అలజడి సృష్టిస్తున్న కుర్రకుంకల మీదికి ప్రభువులంతటివారు స్వయంగా వెళ్ళాలా? ఆలోచించండి," అన్నాడు వినయంగా.

దానికి వీరసింహుడు ఎంతో పొంగిపోయి మందహాసం చేస్తూ, "నువ్వన్నదీ

మేమే ఆ దుర్మార్గుడి అంతు చూస్తాం," అనేవాడు.

యువరాజు సందీపుడు అరణ్యంలో వీరవిహారం చేసేవాడు. ఒక చెట్టు నుంచి మరొక చెట్టుకు ఉడతలా దాటేవాడు. స్వయంగా విలువిద్య నభ్యసించాడు. గురి చూసి బాణం వదలడంలో తనకు తానే సాటి అనిపించుకున్నాడు. తండ్రి లాగా ఒడ్డూపొడుగుతో ఎంతో ఆకర్షణీయంగా పెరిగి పెద్దవాడయ్యాడు.


రోజులు గడిచేకొలదీ సుమేధరాజ్యంలో శాంతి భద్రతలు కరువయ్యాయి. రైతులకూ, వ్యాపారులకూ రక్షణ లేకపోయింది. సామాన్య ప్రజల జీవితం మరీ

నిజమే. అయినా మేము బహిరంగంగా యుద్ధానికి వెళుతున్నట్టు వెళ్ళం. అరణ్యానికి సరదాగా వేటకు వెళ్ళేట్టు వెళతాం. మనకంటే ముందు మన సైనికులు అడవికి వెళ్ళి అరణ్యంలోని ఒక ప్రాంతాన్ని అర్ధచంద్రాకారంలో చుట్టుముట్టి, అక్కడి జంతువులను తరుముకుని మనం ఉండేచోటికి వస్తారు. ఇలా చేయడంవల్ల అరణ్య మృగాలతోపాటు ఆ దుర్మార్గులు కూడా మననుంచి తప్పించుకోలేరుకదా? ఈ విధంగా అడవినంతా గాలించినట్టయితే, కొన్నాళ్ళకు తిరుగుబాటుదారులందర్నీ అవలీలగా ఏరిపారేయవచ్చు. ఏమంటావ్?'' అని అడిగాడు.

''బ్రహ్మాండమైన ఆలోచన ప్రభూ!'' అన్నాడు సర్పదంతుడు.

''మన ఆలోచనకు కార్యరూపం ఇవ్వడానికి తక్షణమే బయలుదేరు!'' అని ఆజ్ఞాపించాడు వీరసింహుడు.


వేటకు బయలుదేరడానికి అప్పటికప్పుడే సన్నాహాలు ప్రారంభమయ్యాయి. మర్నాడు వీరసింహుడు వందలాదిమంది సైనికులను వెంటబెట్టుకుని సర్పదంతుడితో సహా అరణ్యానికి బయలుదేరాడు. సుమేధరాజ్య సరిహద్దులో ఉన్న అరణ్యం చాలా విశాలమైనదేగాని, దురదృష్టవశాత్తు, వీరసింహుడు మొట్టమొదట



చుట్టుముట్టాలనుకున్న ప్రాంతంలోనే జయానందముని ఆశ్రమం ఉన్నది!

వీరసింహుడు అడవిని ఒక్కసారి చుట్టుపక్కల కలయజూసి, ''ఈ రోజు మేము పులులూ, ఎలుగుబంట్లూ, తోడేళ్ళూవంటి పెద్ద పెద్ద వన్యమృగాలను చంపాలి. మీరందరూ డప్పులూ, కొమ్ముబూరలూ వాయిస్తూ వెళ్ళి, అడవిజంతువులను మా ఎదుటికి తరుముకుని రండి.'' అని సైనికులను ఆజ్ఞాపించాడు. సైనికులంధరూ ఉత్సాహంగా డప్పులూ, బూరలూ వాయిస్తూ అడవిలోకి వెళ్ళారు.

జయానందముని శిష్యులు గురువు దగ్గరికి వెళ్ళి, వీరసింహుడి దాడి గురించి



తెలియజేశారు. వెంటనే జయానందముని, యువరాజును వారి కంటబడకుండా రహస్యంగా దాక్కోమన్నాడు. చిలుకతో, "మల్లీ, నువ్వు వెళ్ళి పులీ, భల్లూకీ, ఏనుగూ మొదలైన వాటిని జాగ్రత్తపడమని హెచ్చరించు," అన్నాడు.

చిలుక ఎగిరి వెళ్ళిపోయింది.

అయినా, ఆలోగానే భల్లూకి అపాయంలో చిక్కుకున్నది. హఠాత్తుగా వినిపించిన కర్ణకఠోరమైన ధ్వనులకు కంగారుపడి, భల్లూకి యువరాజు కోసం చుట్టుపక్కల వెదకసాగింది. యువరాజు భద్రతను తలుచుకుని అటూ ఇటూ పరుగులు తీస్తూ తన సంగతి మరిచిపోయింది!

భల్లూకిని చూడగానే, "బంధించండి ఆ ఎలుగుబంటును!" అని అరిచాడు వీరసింహుడు.

పక్కనే ఉన్న వేటగాళ్ళు భల్లూకి మీదికి వలను విసిరారు. భల్లూకి వలలో పడగానే కొందరు సైనికులు దానిని చుట్టుముట్టారు. వల నుంచి బయట పడడానికి భల్లూకి ఎంతగానో ప్రయత్నించింది. కాని, ప్రయోజనం లేకపోయింది. కొందరు భటులు కొరడాలు ఝుళిపిస్తూ దానిని భయపెట్టసాగారు!


ఆ దృశ్యాన్ని చూసి వీరసింహుడు బిగ్గరగా నవ్వి, "సెభాష్! మంచి బహుమతే దొరికింది! ఇంతకన్నా దుష్టమృగాలను పట్టుకోవాలి," అని పక్కనున్న సర్పదంతుడికేసి తిరిగి, సన్నటి స్వరంతో, "దుర్మార్గులయిన తిరుగుబాటుదారులను కూడా పట్టి బంధించాలంటున్నాను," అన్నాడు.

"అవును ప్రభూ, తప్పకుండా పట్టి బంధించాలి!" అంటూ ముందుకు నడవబోయాడు సర్పదంతుడు.

అయితే వాళ్ళు అక్కడినుంచి కదిలేలోగా, "ఆగండి!" అన్న కంఠస్వరం వినిపించింది. అందరూ తిరిగిచూశారు.

ఒకపొదచాటునుంచిముందుకువచ్చిన జయానందముని వాళ్ళను సమీపించి,


RAZI



"దయచేసి ఒక్క క్షణం నా మాటలు ఆలకించండి. సుమేధ రాజ్యాధిపతులు గాని, శాంతిపుర ప్రముఖులుగాని ఇంతకు ముందెన్నడూ ఈ ప్రాంతానికి రాలేదు. వారి కులగురువులందరూ పరంపరగా ఇక్కడే ప్రశాంత జీవనం గడపడంవల్ల దీనిని ఎంతో పవిత్రంగా భావించేవారు. ఆ సంప్రదాయాన్ని పాటించి, మీరు కూడా ఇక్కడినుంచి తిరిగివెళ్ళడం మంచిది!" అన్నాడు.

వీరసింహుడు హేళనగా నవ్వి, "ఆహాఁ....ఒక రాజు ఒకసంప్రదాయాన్ని సృష్టిస్తే మరొక రాజు దానిని హాయిగా నిర్మూలించవచ్చు!" అన్నాడు.

"మంచి రాజు ఒక మంచి సంప్రదాయాన్ని నిర్మూలించడు!" అన్నాడు ముని.

"ఇంతకూ నువ్వనేదేమిటి? నేను మంచి రాజు కాననేనా?" అన్నాడు వీరసింహుడు గుర్రుమంటూ.

"మంచిరాజువో కాదో నువ్వే నిరూపించుకోవాలి!" అన్నాడు ముని.

"నిరూపించుకోవాలా? ఎవరి సమక్షంలో? నీ సమక్షంలోనా? నువ్వా నాకు న్యాయాధిపతివి? ఎంతపొగరు!" అని హుంకరించాడు వీరసింహుడు.

ఇంతలో వలలో బంధించబడి వున్న భల్లూకి, అతి ప్రయత్నం మీద చేతులు వెలుపలికి తెచ్చి, పంజాతో దాపులనున్న ఒక సైనికుడి చెంపను గాయపరచింది. భటుడు కెవ్వుమని అరిచాడు.

ఆ కేక విని అటువైపు తిరిగి చూసిన వీరసింహుడు, "ఆ దుష్ట మృగాన్ని చంపండి," అని అరిచాడు.

"అది దుష్టజంతువు కాదు వీరసింహా! మీరు దానిని హింసిస్తున్నారు. అది ఎదురొడ్డుతున్నది. అంతే!" అన్నాడు ముని.

"ఏమిటీ రాజ్యాధిపతినైన నన్ను పేరుపెట్టి పిలవడానికి నీకెన్ని గుండెలు! పైగా, నేనేదో నీ సరిహద్దులో ప్రవేశించినట్టు ఇలా చెయ్, అలా చెయ్ అని నన్నే ఆజ్ఞాపిస్తున్నావు!" అన్నాడు వీరసింహుడు.

"నీదీ నాదీ కాదు నాయనా, ఇది ప్రకృతి సరిహద్దు!" అన్నాడు జయానందముని.

ఆ మాటలకు వీరసింహుడు పట్టరాని ఆగ్రహంతో, "ఈ ముసలివాణ్ణి పట్టి బంధించండి!" అని ఆజ్ఞాపించాడు.

కొందరు సైనికులు మునిని సమీపించి, ఆయన్ను పట్టుకున్నారు. అంతే! ఆ క్షణమే అరణ్యమే రోదించినట్టు పక్షులన్నీ రకరకాల ధ్వనులు చేశాయి.

మరు క్షణమే ఒక బాణం, పొదల చాటునుంచి దూసుకువచ్చి వీరసింహుడి పాదాలదగ్గర నేలపై గుచ్చుకున్నది. ఆ బాణానికి ఒక లేఖ ఉన్నది. వీరసింహుడు బాణాన్ని అందుకుని లేఖ తీసి చదివాడు. అందులో ఇలా ఉన్నది: "వీరసింహా, కావాలంటే ఈ బాణంతో లేఖను పంపడానికి బదులు ఈ క్షణమే నీ ప్రాణాలు తీసి ఉండవచ్చు. అయినా, అలా దొంగచాటు హీనకృత్యానికి పూనుకోవడం మా అభిమతం కాదు. ఎలుగుబంటును వదిలిపెట్టి వచ్చిన దారిపట్టి గౌరవంగా తిరిగి వెళ్లు!"

లేఖను చదివి వీరసింహుడు ఆగ్రహావేశంతో ఊగిపోయాడు. "ఈ బాణం వేసిన దుర్మార్గుణ్ణి పట్టుకోండి. వాడిక్కడే, ఈ పరిసరాల్లోనే ఏ పొదలచాటునో దాగివుంటాడు!" అని కీచుస్వరంతో అరిచాడు.



సైనికులు నాలుగు దిక్కులకూ పరుగులు తీశారు. కాని, లేఖలోని విషయం తలుచుకుని వీరసింహుడు వణికిపోయాడు. నిజంగానే బాణం తనమీదికి వస్తే తన గతి ఏం కావాలి? అన్న ఆలోచన రాగానే వీరసింహుడు భయకంపితుడై, అంగరక్షకులతో, "వచ్చినందుకు ఈ ఎలుగుబంటునూ, దాని తాతయ్యలా వున్న ఈ ముసలివాణ్ణీ తీసుకుని రాజధానికి వెళదాం. బాణం వేసిన ఆ దుర్మార్గుణ్ణి మిగతా సైనికులు వెతికి బంధించి తెస్తారు!" అంటూ ముందుకు నడిచాడు.

కాని, కొన్ని క్షణాలలో చుట్టుపక్కల నుంచి సైనికుల హాహాకారాలు వినిపిం

చాయి. సైనికులందరూ ఆర్తనాదాలు చేస్తూ చెట్టుకొకరు పుట్టకొకరుగా పరుగులు తీస్తున్నారు!

"మనం పారిపోదాం మహారాజా, అరణ్యమృగాలన్నీ కలిసి కట్టుగా ఎదురు తిరిగి మనమీదికి వస్తున్నాయి!" అని అరిచాడు ఒక సైనికుడు.

పులుల గాండ్రింపులతో, ఏనుగుల ఘీంకారాలతో, కోతుల కిచకిచలతో, నక్కల ఊళలతో, దుమ్మలగొండ్ల నవ్వులతో—క్షణాలలో ఆ ప్రాంతమంతా అతి బీభత్సంగా మారిపోయింది. ఒక కోతి వీరసింహుడి పైకి దూకి కిరీటాన్ని ఎత్తుకుపోయింది. ఒక కాకి సర్పదంతుడి తలపాగాను తన్నుకుపోయింది.


ఈ ధ్వనులకు భయపడి చెట్టుకు కట్టబడినగుర్రాలు,పగ్గాలుతెంచుకునిఎటో పారిపోయాయి. ఇక చేసేదిలేక వీరసింహుడూ, సర్పదంతుడూ భల్లూకినీ, జయానందమునినీ అక్కడే వదిలి ప్రాణాలను గుప్పెట్లో పట్టుకుని పరుగుతీశారు. అరణ్యమృగాలచే గాయపడి నెత్తురోడుతూన్న దేహాలతో, సైనికులు హృదయవిదారకంగా హాహాకారాలు చేస్తూ, కిందా మీదా పడుతూ పరిగెత్తసాగారు.

కొంతసేపటికి వీరసింహుడూ, అతని అనుచరులూ ఎలాగో అడవినుంచి బయటపడి, దాపులనున్న ఒక పెద్ద మైదానం చేరారు. అయినా, అడవి మృగాలు వాళ్ళను వదలకుండా తరుముతూనే ఉన్నాయి. ఒక పెద్ద పులి వీరసింహుడి మీదికి దూకడంతో, వాడు హడలిపోయి మూర్ఛపోయాడు!

"మిత్రులారా! చాలు, ఇక వెనక్కు రండి!" అన్న మధురగంభీరమైన కంఠస్వరం వినిపించడంతో, జంతువులన్నీ ఒక్కసారి వెనక్కు తిరిగి చూశాయి.

అడవికీ మైదానానికి మధ్య ఉన్న చిన్న కొండశిఖరం మీద నిలబడి, ఒక అందమైన యువకుడు చేసిన ఆజ్ఞప్రకారం జంతువులన్నీ వెనుదిరిగి అడవిలోకి వెళ్ళసాగాయి. —(ఇంకావుంది)





బందిపోటు యువరాజు

14

[అరణ్యమధ్యంలో రహస్యస్థావరాలు ఏర్పరచుకున్న తిరుగుబాటుదారులను ఏరిపారేయాలని, వీరసింహుడు వేట సాకుతో అడవికి వెళ్ళాడు. జయానందముని ఎంత వారించినా వినకుండా ఆగ్రహించి ఆయనను బంధించబోయాడు. మరుక్షణమే అరణ్య మృగాలన్నీ తరుముకోవడంతో, చావగా మిగిలిన సైనికులతో వీరసింహుడు రాజధానికి చేరాడు.—తరవాత]

అడవిలో జరిగిన ఘోరపరాభవంతో వీరసింహుడు కొన్నాళ్ళపాటు సభకు రావడం మానేశాడు. ఆ సంఘటనతో వీరసింహుడి గర్వం అణిగింది. అంతకు ముందెన్నడూ అతడు మంచిచెడ్డలూ, ముందువెనుకలూ ఆలోచించేవాడు కాదు. కాని, ఇప్పుడు కాలం కలిసిరాకపోవడం వల్లే అన్నిటా అపజయం పాలవుతున్నట్టు భావించ సాగాడు. ఇలా కొంతకాలం గడిచింది.

ఇంత జరిగినా, వీరసింహుడిలోని గర్వం కాస్త తగ్గిందిగాని అతడి దుష్ట స్వభావం మాత్రం మారలేదు. ఒకరోజు ఇద్దరు గూఢచారులు వచ్చి, వీరసింహుడి పథకాలకు అడ్డుతగిలే యువకులకు అమృతపురితోపాటు, శంకరవర్మ పాలిస్తూన్న చిన్న రాజ్యం జయపురినుంచి కూడా సహాయం లభిస్తున్నట్టు అతనికి తెలియజేశారు.



అమృతపురిని కబళించాలన్న వీర సింహుడి కోరిక నెరవేరలేదు. ఇకమీదట నెరవేరే అవకాశం లేదు. ఎందుకంటే, అమృతపురి ఇప్పుడు సైనికబలాన్ని బాగా పుంజుకున్నది. రాజు అనారోగ్యం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. ఇక, వీర సింహుడు కావాలంటే శంకరవర్మపై పగ సాధించవచ్చు!

''శంకరవర్మ తన సంపదలను చూసి తెగమురిసిపోతున్నాడు ప్రభూ! ఇటీవల ఒక రహస్యనిధి కూడా బయటపడింది. పూర్వుల శిథిలభవనాల తవ్వకాలలో కనకదుర్గరూపంలో వున్న అద్భుతమైన బంగారు విగ్రహం ఒకటి బయటపడింది. అది చాలా అందంగా వున్నది!'' అన్నాడు మంత్రి వీరసింహుడితో.

''ఆ విగ్రహం అందంగా ఉన్నదా? అందవిహీనంగా ఉన్నదా అన్నది మన కనవసరం. అది బంగారందయితే చాలు. బంగారం! బంగారం! అదీ మనకిప్పుడు కావలసింది. ధాన్యం మార్పిడికి ఆయుధాలు కొనాలన్న మన పథకం ఫలించ లేదు. బంగారంతో అయితే సులభంగా కొనవచ్చు.'' అన్నాడు వీరసింహుడు.

దాపులనుంచి వారి సంభాషణలను వింటూన్న సేనాధిపతి సర్పదంతుడు, ''ప్రభూ! జయపురి మీదికి దండెత్తమని సెలవా!'' అని అడిగాడు.

''ఛీ, ఛీ! పిచ్చుకపై బ్రహ్మాస్త్రమా! కుందేలును వేటాడడానికా నిన్ను సేనాధిపతిని చేశాము! జయపురికి సైన్యమే లేదు. దానిసరిహద్దులను ఒకవైపు సుమేధ, మరొకవైపు అమృతపురి రక్షిస్తున్నాయి. అంతే కాదు; మనం జయపురి మీదికి దండెత్తినట్టయితే, దానిని రక్షించడానికి అమృతపురి సేనలు రావచ్చు. వాటిని ఎదుర్కొనేశక్తి నీ సైన్యానికి ఉన్నదా?'' అని అడిగాడు వీరసింహుడు.

ఏమి చెప్పడానికీ తోచక సర్పదంతుడు నేలచూపులుచూడసాగాడు. వీరసింహుడు మళ్ళీ, ''అందుకే మనం జయపురి మీదికి

దండెత్త కూడదు. అయితే, ఆ రాజ్యానికి మనం ఎంతోకాలంగా రక్షణ కల్పిస్తున్నాము కాబట్టి, శంకరవర్మ నుంచి కప్పం వసూలు చేయవచ్చు. ఇప్పుడే ఆ విషయం శంకరవర్మకు తెలియజేద్దాం. మన ఆజ్ఞను ధిక్కరించే ధైర్యం శంకరవర్మకు ఉండదనుకుంటాను," అన్నాడు.

* * *

జయపురిలో ఎక్కడ చూసినా ప్రజలు ఆనందోత్సాహాలతో ఉన్నారు. పురాతన భవన శిథిలాల నుంచి అద్భుతమైన బంగారు విగ్రహం ఒకటి బయటపడింది. నిగనిగలాడే ఆ బంగారు విగ్రహం మీద చిన్న గీర కూడా లేదు. దానిని చూసి శంకరవర్మ పరమానందం చెంది, ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి చిన్న గుడి ఒకటి కట్టించాడు. ఆ గుడిలో విగ్రహం ప్రతిష్ఠించడానికి తగిన ముహూర్తం కూడా నిర్ణయించారు.

శంకరవర్మ ఉద్యానవనంలో ఉన్నప్పుడు ఒక భటుడు అక్కడికి వచ్చి నమస్కరించి, "ప్రభూ, శాంతిపురం నుంచి దూతవచ్చాడు!" అన్నాడు.

"శాంతిపురం నుంచి దూతా! అంటే వీరసింహుడే పంపాడన్నమాట!" అని ఒక్క క్షణం ఆగి, "సరే ఇక్కడికి తీసుకురా," అన్నాడు శంకరవర్మ.



కొంతసేపటికి దూత ఒకడు వచ్చి, శంకరవర్మకు నమస్కరించి, "ప్రభూ, వీరసింహమహారాజు మీకు తమ శుభాకాంక్షలు తెలియజేసి, వారికి చేరవలసిన బాకీ గురించి గుర్తు చేయమన్నారు," అన్నాడు.

"బాకీ గురించా! మేము ఎవరికీ బాకీ అంటూ ఏదీ లేదే!" అన్నాడు శంకరవర్మ.

"సుమేధరాజ్యం సమకూర్చే రక్షణ కారణంగానే మీ రాజ్యం శత్రువుల వశం కాకుండా సురక్షితంగా ఉన్నది. అందువల్ల మీరు మా రాజ్యానికి కప్పం చెల్లించవలసిందిగా మా రాజుగారు మీకు తెలియజేయమన్నారు," అన్నాడు దూత.



''అలాగా !'' అని శంకరవర్మ కొంత సేపు మౌనం వహించి, ఆ తరవాత, ''సరే, మీ రాజు మా నుంచి ఆశిస్తున్న దేమిటి ?'' అని అడిగాడు.

''మీకు లభించిన కనకదుర్గ స్వర్ణ విగ్రహాన్ని ఇచ్చినట్టయితే మా ప్రభువులు సంతోషిస్తారు !'' అన్నాడు దూత.

ఆ మాట విని శంకరవర్మ ఉలిక్కి పడ్డాడు. కాని తన అదురుపాటు బయటకు కనిపించకుండా, ''ఆ కనకదుర్గ విగ్రహాన్ని మీ రాజుకే కాదు; మరెవ్వరికి ఇవ్వడానికీ నాకు అధికారం లేదు. మేము కొత్తగా కట్టిన గుడిలో ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలనుకున్నాము. అయినా, ఆ గుడి చాలా చిన్నది. మరొక పెద్ద ఆలయం నిర్మించి, ఆ విగ్రహాన్ని అందులోకి మార్చాలనుకుంటున్నాము. త్వరలో ఆలయ నిర్మాణం పూర్తిచేసి, విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవానికి సుమేధ పాలకులనూ, అమృతపురి పాలకులనూ ఆహ్వానించగలం !'' అన్నాడు.

''ప్రభూ, మా రాజుగారు పంపిన సందేశాన్ని మీకు తెలియజేయడం దూతగా నా బాధ్యత. 'ఆ విగ్రహాన్ని మర్యాదగా మాకు అప్పగించు. లేదా దానిని మేమే బలవంతంగా తీసుకుపోతాం !' ఇదీ మా రాజుగారి సందేశం,'' అన్నాడు దూత తల వంచుకుని.

శంకరవర్మ ఆకాశం కేసి చూస్తూ, ''అదా సంగతి ! ఆ విగ్రహాన్ని అప్పగించడానికి నేను సిద్ధంగా లేనని మీ రాజుకు తెలియజెయ్యి. కావాలంటే, కొంత ధనం చెల్లించగలం. అది కూడా అన్యాయమైన కోరికకు తలవంచడమే అవుతుంది. ఈనాటివరకు సుమేధను పరిపాలించిన ధర్మప్రభువు లెవ్వరూ ఇలా మా నుంచి ఏదీ ఆశించలేదు. ఇక నువ్వు వెళ్ళవచ్చు !'' అన్నాడు.

దూత శంకరవర్మకు నమస్కరించి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.


* * *

దూత సుమేధరాజ్య సరిహద్దులోకి ప్రవేశించి, వీరసింహుడి అజ్ఞ ప్రకారం అక్కడ సైనికులతో సిద్ధంగా వున్న సర్పదంతుడితో, శంకరవర్మ బంగారువిగ్రహాన్ని అప్పగించడానికి తిరస్కరించిన విషయం చెప్పాడు. సర్పదంతుడు, వెంటనే దళనాయకులతో, "ఈ క్షణమే మనం జయపురి రాజభవనం కేసి బయలుదేరాలి. అక్కడ మనల్ని ఎదుర్కొనే వాళ్ళెవ్వరూ వుండరనుకుంటాను. అయితే...." అని ఇంకేదో చెప్పబోయేంతలో "ఆగు!" అన్న గంభీరకంఠస్వరం వినిపించింది.



సర్పదంతుడు కోపాశ్చర్యాలతో చుట్టుపక్కలకలయచూశాడు. చిన్నచిన్నచెట్లూ, పొదలూ తప్ప అక్కడ మరేమీ కనిపించలేదు. మరుక్షణమే పొదల చాటునుంచి ఒక బాణం దూసుకువచ్చి, సర్పదంతుడి ఎదుట నేలపై గుచ్చుకున్నది. సర్పదంతుడు ఆ బాణాన్ని అందుకుని, దాని కొసకు వున్న లేఖను తీసి చదివాడు: "జయపురి ప్రజల శాంతికి భంగం కలిగించకండి. శంకరవర్మను వదిలి తిరిగి వెళ్ళమని హెచ్చరిస్తున్నాము. ఇది యువరాజు సందీపుడి అజ్ఞ!"

యువరాజు సందీపుడు! ఇంతకు పూర్వం వచ్చిన హెచ్చరికలలో పేరు వుండేదికాదు. ఇప్పుడు తిరుగుబాటుదారులకు కొత్తగా నాయకుడు ఏర్పడ్డాడన్న మాట! ఎవడీ యువరాజు సందీపుడు? సర్పదంతుడి మనసులో ఆశ్చర్యంతో పాటు భయం కూడా ప్రవేశించింది. తనను వెన్నంటి శత్రువులు వస్తున్నారని తెలిసీ, తను సైనికులను ఎలా నడపడం? సర్పదంతుడికి గుండె దడదడలాడసాగింది. అయినా, తిరిగి వెళదామన్నా అక్కడ వీరసింహుడి ఆగ్రహం నుంచి తప్పించుకోవడం సాధ్యం కాదు. ముందుకు వెళ్ళడం ఒక్కటే మార్గం! అందువల్ల, అతడు సైనికులను, "కదలండి ముందుకు!" అని ఆజ్ఞాపించాడు.



ఆ రోజు సాయంకాలం జయపురి ప్రజలు విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు చేయడంలో నిమగ్నులై వున్నారు. శంకరవర్మకు వీరసింహుడు పంపిన బెదిరింపు గురించి వాళ్ళకేమీ తెలియదు. పున్నమి రోజయిన రేపే విగ్రహప్రతిష్ఠాపన!

హఠాత్తుగా పరాయి సైనికదళాలు తమ రాజభవనం కేసి నడవడం చూసి, జయపురి ప్రజలు అమితాశ్చర్యం చెందారు. కొందరు, కొంత దూరంలో, ఆ దళాన్ని వెంబడించి వెళ్ళారు. ఒక యువకుడు పరుగెత్తిపోయి సంగతిని రాజుకు తెలియజేశాడు. రాజు శంకరవర్మ భవనం నుంచి వెలుపలికి వచ్చాడు. ఆలోగానే సర్పదంతుడు అక్కడికి వచ్చాడు. అతనితో శంకరవర్మ, "మీకు ఏం కావాలి?" అని అడిగాడు.


"కనకదుర్గ బంగారు విగ్రహం!" అన్నాడు సర్పదంతుడు.

"ఆ విగ్రహాన్ని వదులుకోలేనని మీ దూతతో చెప్పి పంపాను కదా!" అన్నాడు శంకరవర్మ.

"వదులుకునేట్టు మేము చేస్తాం; అవసరమయితే బలప్రయోగంతో లాక్కుపోతాం!" అన్నాడు సర్పదంతుడు.

శంకరవర్మ కొంత సేపు మౌనంగా ఆలోచించి, "ఏమాత్రం రక్తపాతం జరగడమూ నాకు ఇష్టం లేదు. మీ ఇష్టానుసారం ఏం చేయాలో చేయండి," అన్నాడు.

గూఢచారులు సర్పదంతుణ్ణి, భవనంలో కుడివైపున ఉన్న ఒక గది లోపలికి తీసుకుపోయారు. అక్కడ వున్న బంగారు విగ్రహాన్ని, సర్పదంతుడి ఆజ్ఞ ప్రకారం, ఇద్దరు సైనికులు కష్టపడి ఎత్తుకున్నారు. అప్పుడు వీరసింహుడు పంపిన దూత ఒకడు వచ్చి సర్పదంతుడి చెవిలో ఏదో రహస్యంగా చెప్పాడు. తిరుగుబాటుదార్లవశం కాకుండా బంగారు విగ్రహాన్ని భద్రంగా సుమేధ రాజధానికి చేర్చే ఉపాయం వీరసింహుడు చెప్పిపంపాడు. నదీమార్గంలో ప్రయాణం సాగించినట్టు


RAZI

యితే తిరుగుబాటుదార్లు నదిలోకి దూకి, అంత సులభంగా అడ్డుపడలేరని వీర సింహుడు భావించాడు. వీరసింహుడు చెప్పి పంపినప్రకారం సర్పదంతుడు విగ్రహంతోసహా నదీతీరం చేరాడు.


అదొక పాయలాంటి చిన్న నది. ఒక చిన్న పడవలో ఇద్దరు భటులు విగ్రహాన్ని పట్టుకుని కూర్చున్నారు. నలుగురు పడ వను తెడ్లతో నడపడం ప్రారంభించారు. పడవకు సమీపంలో నదికి ఇరువైపులా ఆయుధాలు ధరించి సైనికులు నడవ సాగారు. సర్పదంతుడు వారి వెంట విజయ గర్వంతో నడవసాగాడు.

కొంతదూరం వెళ్ళాక, ఒకచోట నదికి రెండువైపులా బ్రహ్మాండమైన మర్రి వృక్షాలు వున్నాయి. వాటి కొమ్మలు నది మీదికి విస్తరించి ఉన్నాయి. సైనికులు మర్రివృక్షం కిందికి వచ్చినప్పుడు కొంత దూరంలో వింతశబ్దంతో బాణాసంచా పేలడం కనిపించింది. సైనికులందరూ ఆశ్చర్యంతో అటు కేసి చూశారు. సరిగ్గా అదే సమయంలో మర్రివృక్షం పైనుంచి భూతం లాంటి ఆకారం తమ మీదికి రావడం, రెప్పపాటులో తమ వద్ద వున్న బంగారు విగ్రహం మాయం కావడం గమనించి పడవలోనివాళ్ళు దిగ్భ్రాంతి చెందారు. ఒక యువకుడు మర్రికొమ్మకు కట్టిన బలమైన తాడును ఒక చేత్తో పట్టుకుని తమ మీదికి దూకి, మరొక చేత్తో బంగారు విగ్రహాన్ని అవలీలగా ఎత్తుకునిపోయి అవతలిగట్టు చేరాడు. ఇవతలిగట్టున వున్న భటులు ఇంకా బాణా సంచా వేడుకను చూస్తూనే ఉన్నారు.

పడవలోని భటులు, "బందిపోటు! బందిపోటు!" అని అరిచేలోగా బంది పోటు నదికి అవతలిగట్టున సిద్ధంగా ఉన్న గుర్రాన్ని ఎక్కి అరణ్యంలోకి వెళ్ళిపోయాడు.

సైనికులు, కనుచూపు దూరంలో గుర్రంపై అడవిలోకి మాయమైపోయిన ఆ ఆకారం కేసి అమితాశ్చర్యంతో చూస్తూ అలాగే వుండిపోయారు.—(ఇంకావుంది)





బందిపోటు యువరాజు

15

[జయపురి రాజు శంకరవర్మ, తమ పూర్వుల శిథిల భవనాల నుంచి బయటపడిన కనకదుర్గ బంగారు విగ్రహాన్ని, వీరసింహుడికి అప్పగించడానికి నిరాకరించాడు. వీరసింహుడి సేనాధిపతి సర్పదంతుడు కొందరు సైనికులతో వచ్చి, విగ్రహాన్ని బలవంతంగా తీసుకుని, పడవలో వెళుతూన్నప్పుడు—ఎవరో హఠాత్తుగా పడవలోకి దూకి, దానిని ఎత్తుకుపోయారు. —తరవాత]

"ఆగండి!" అని అరుస్తూ సర్పదంతుడు పడవను సమీపించి. "ఎక్కడ బంది పోటు? పడవ వెనకే ఈదుకుంటూ రావడానికి వాడేమీ మొసలి కాదు కదా! వాడు మిమ్మల్ని సమీపించినప్పుడు మీరందరూ నిద్రపోయారా? లేక కలలు కంటున్నారా?" అని గద్దించాడు.

"ప్రభూ, బందిపోటు ఆ విగ్రహాన్ని ఎత్తుకుని రెప్పపాటులో అరణ్యంలోకి పారిపోయాడు!" అన్నారు పడవలోని భటులు గట్టు మీదికి దిగుతూ.

వాళ్ళు చెప్పిన విషయం అర్థం చేసుకోవడానికి సర్పదంతుడికి కొంత సేపు పట్టింది. ఒక చేత్తో తాడు పట్టుకుని పడవలోకి దూకి, మరొక చేత్తో అంత బరువైన విగ్రహాన్ని అవలీలగా ఎత్తుకుని అవతలి గట్టుకు చేరడం సర్పదంతుడికి నమ్మ శక్యంగా లేదు. ఆ బంగారు విగ్రహాన్ని



శంకరవర్మ భవనం నుంచి నలుగురు దృఢకాయులయిన భటులు, మోయలేక మోసుకుంటూ వచ్చి, నదీతీరం చేర్చారు. అంత బరువయిన విగ్రహాన్ని, ఒక చేత్తో అవలీలగా ఎత్తుకుని అవతలి గట్టును ఎలా చేరగలిగాడా వ్యక్తి?

సైనికులు తలలు వంచుకుని సర్పదంతుడి ముందు నిలబడ్డారు.

సులభంగా తమ వశం అయిందనుకున్న విలువయిన ఆ బంగారు విగ్రహం హఠాత్తుగా చేజారిపోయిందన్న బాధవల్ల కలిగిన ఆగ్రహంతో, సర్పదంతుడు పక్కనున్న ఒక భటుణ్ణి లాగి లెంపకాయ కొట్టి, "ఎవడో అనామకుడు వచ్చి, నిక్షేపం లాంటి విగ్రహాన్ని ఎత్తుకుపోతూ వుంటే మీరంతా నిద్రపోయారా?" అని కేకలు వేశాడు.

చెంపదెబ్బ తిన్న సైనికుడు అవమానంతో కుంచించుకుపోయాడు. అతనికి దెబ్బ మీద దెబ్బ. ఎందుకంటే విగ్రహాన్ని ఎత్తుకుపోతూ, ఆ వ్యక్తి కూడా అదే సైనికుణ్ణి ఒక తాపు తన్నాడు. అయినా— బందిపోటు పడవ మీదికి దూకినప్పుడు, నదికి ఇరువైపులా ఆయుధాలు ధరించి నడుస్తూన్న సైనికులు సైతం అతన్ని పట్టుకోలేకపోయారు. అలాంటప్పుడు తను మాత్రం ఎలా పట్టుకోగలనని సర్పదంతుడితో చెబుదామనుకున్నాడు సైనికుడు. కాని అలా చెప్పడానికి ధైర్యం చాలలేదు. అందువల్ల అతడు తెలివిగా, "ప్రభూ! ఇంతమంది యోధుల కళ్ళు కప్పి, కేవలం ఒక మానవుడు ఆ విగ్రహాన్ని ఎత్తుకుని వెళ్ళడం సాధ్యమని మీరు భావిస్తున్నారా?" అని అడిగాడు.

"అంటే, ఏమిటి నీ ఉద్దేశం?" అని అడిగాడు సర్పదంతుడు.

"ఏదో దుష్టశక్తి ఆ విగ్రహాన్ని అపహరించుకుని వెళ్ళిందే తప్ప కేవలం బందిపోటు కాదు!" అన్నాడు భటుడు.

"అలాగా!" అని సర్పదంతుడు కొంతసేపు మౌనంగా ఆలోచించి, "అయితే, ఆ



విషయం నువ్వే మన రాజు సమక్షంలో చెప్పు," అన్నాడు.

శాంతిపురం వెళ్ళి, వీరసింహుడితో సర్పదంతుడూ, భటులూ—చుట్టూ కటిక చీకటి కమ్ముకున్న అర్ధరాత్రి సమయంలో భూతం వంటి భయంకరాకారం ఒకటి హఠాత్తుగా పడవలోకి దూకి త్రుటిలో విగ్రహంతో సహా మాయమై పోయిందని గోరంతలు కొండంతలు చేసి చెప్పారు.

వీరసింహుడికి వారి మాటలు నమ్మ శక్యం కాలేదు. అయినా, అతడు ఇటీవల అన్నిటా అపజయాలనే ఎదుర్కోవలసి వస్తున్నది. ఒకవేళ ఎవరైనా తన మీద మంత్రప్రయోగం, చేతబడి లాంటివేమైనా చేశారా? అలా చేసి ఉంటే వాటిని సరిదిద్దడం ఎలా? తనను ఈ బాధల నుంచి కాపాడగల సమర్థుడయిన మాంత్రికుడుగాని, భూతవైద్యుడుగాని ఎక్కడ వున్నాడో అని వీరసింహుడు తీవ్రంగా ఆలోచించసాగాడు.

* * *

జయపురిని విషాదం కమ్ముకున్నది. కొత్తగా కట్టిన గుడిలో కనకదుర్గ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ఆనందోత్సాహాలతో వున్న ప్రజలకు, సర్పదంతుడి చర్య దిగ్భ్రాంతిని కలిగించింది. సుమేధ రాజ్యాన్ని పరమదుర్మార్గుడు పాలిస్తున్నాడని తెలుసుగాని, వాడి క్రూరదృష్టి తమపై పడుతుందని వారు ఊహించలేక పోయారు!

శంకరవర్మ ఒక గదిలో మౌనంగా కూర్చున్నాడు. ఆయనను సమీపించడానికి ఎవరూ సాహసించలేక పోయారు. కాని శంకరవర్మ ఏకైక కుమార్తె సుకన్య నెమ్మదిగా తండ్రిని సమీపించి, "నాన్నా, ఆ దేవత మళ్ళీ మన దగ్గరికి తిరిగి రాగలదని నాకు అనిపిస్తున్నది." అన్నది మధురస్వరంతో.

శంకరవర్మ విచారంతో చిన్నగా నవ్వాడు.



కనకదుర్గ విగ్రహం పట్ల సుకన్య ఎంతో ప్రేమను పెంచుకున్నది. శంకరవర్మ, విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవం కోలాహలంగా జరపాలని నిర్ణయించడానికి ముఖ్య కారణమే సుకన్య. అటువంటి విగ్రహం శత్రువుల వశం కావడంతో ఆమె చెప్పలేనంతగా బాధపడింది. అయినా, ఆమె తన బాధ బయటకు కనిపించకుండా తండ్రిని ఓదార్చడానికి ప్రయత్నిస్తున్నది. ఆ సంగతి గ్రహించిన శంకరవర్మ, పొంగిపొరలుతూన్న దుఃఖాన్ని బలవంతంగా అపుకోవడానికి ప్రయత్నిస్తూ, కుమార్తెను ఓదార్పుగా దగ్గరికి తీసుకున్నాడు.

"నాయనా!" అన్న కంఠస్వరం వినిపించింది.

శంకరవర్మ ఆశ్చర్యంగా తల పైకెత్తి చూశాడు. జయానంద ముని ఆశ్రమంలోని చిలుక మల్లి, స్తంభం మీద కూర్చుని వున్నది.

శంకరవర్మ లేచి నిలబడ్డాడు. చిలుక స్తంభంపైనుంచి నేల మీదికి దూకి, మళ్ళీ ఎగిరి ఒక దీపస్తంభం మీద కూర్చుని వెనక్కు తిరిగి చూసింది. మల్లి తనను పిలుస్తున్నదని గ్రహించిన శంకరవర్మ, దానిని అనుసరించి ముందుకు నడిచాడు. అతని వెంట సుకన్య కూడా బయలుదేరింది.

కొంతసేపటికి చిలుక ఉద్యానవనం చేరింది. పిండారబోసినట్టు వెన్నెల కాస్తున్నది. చిలుక ఒక దానిమ్మచెట్టు కొమ్మపై వాలింది. శంకరవర్మ చిలుక కేసి చూస్తూ నడుస్తున్నప్పుడే సుకన్య, "చూశావా నాన్నా, దేవత మళ్ళీ మన దగ్గరికే చేరింది!" అన్నది ఉత్సాహంగా.

సర్పదంతుడు తీసుకుపోయిన కనకదుర్గ బంగారు విగ్రహం దానిమ్మచెట్టు కింద కనిపించింది. సుకన్య గబగబా వెళ్ళి, విగ్రహం దగ్గర కూర్చుని, ఆనంద బాష్పాలు రాలుస్తూ, "నాన్నా, నేను చెప్పాను కదా, దేవత మళ్ళీ మన దగ్గరికి

వస్తుందని. ఇప్పుడు చూశావా?'' అన్నది పట్టరాని ఉత్సాహంతో.

శంకరవర్మ ఏమీ మాట్లాడలేదు. చేజారి పోయిన విగ్రహం తిరిగి వచ్చిందన్న మాట నిజమే. అయినా, అది ఇక్కడికి ఎలా వచ్చింది? దానిని ఇక్కడికి తీసుకు వచ్చినవారెవరు? అని ఆలోచిస్తూ శంకర వర్మ చుట్టుపక్కల కలయజూశాడు.

మల్లి కిలకిలా నవ్వింది. శంకరవర్మ అటుకేసి తిరిగి చూశాడు. చెట్టు వెనక నుంచి వస్తూన్న ఒక అందమైన యువకుడి భుజం మీద మల్లి కూర్చుని వున్నది!

ఆ యువకుడు శంకరవర్మను సమీ పించి, ఆయనకు నమస్కరించి, ''మీకు నేనెవరో తెలియదు. అయినా, మిమ్మల్ని గురించి గురుదేవులు జయానందముని నాకు చెప్పారు!'' అన్నాడు.

''నువ్వు యువరాజు సందీపుడే కదా?'' అన్నాడు శంకరవర్మ అమితానందంతో.

''అవును, మీ సేవకుణ్ణి!'' అన్నాడు యువరాజు సందీపుడు.

మరుక్షణమే శంకరవర్మ యువరాజును ఆప్యాయంగా కౌగిలించుకుని, ''నీ దర్శనం కోసం ఎంతగా తపించిపోతు న్నానో తెలుసా? ఇన్నాళ్ళకు నా కోరికను నెరవేర్చినందుకు ఆ దేవుడికి కృతజ్ఞులు చెప్పాలి. అయినా, సర్పదంతుడు పట్టుకు పోయిన ఆ విగ్రహం మళ్ళీ ఇక్కడికి ఎలా వచ్చిందో అంతుబట్టడం లేదు!'' అన్నాడు.





అలాంటి పని చేయగలనా అన్నది అను మానమే. అయితే, నేనాపని చేసినప్పుడు ఏదో ఒక వింతశక్తి నన్నూ, నా చేతులనూ ఆవహించినట్టు భావిస్తున్నాను. అయితే, ఆ వింతశక్తి ఎక్కడి నుంచి వచ్చింది మాత్రం తెలియడం లేదు!'' అన్నాడు సందీపుడు.

''ఆ మహత్తరశక్తి దేవత నుంచే వచ్చి వుంటుంది. ఆమె మళ్ళీ ఇక్కడికి రావాలని సంకల్పించింది. మీ ద్వారా ఇక్కడికి చేరింది,'' అన్నది సుకన్య మధురమైన కంఠస్వరంతో.

సందీపుడు సుకన్య కేసి ఆశ్చర్యంగా చూశాడు. దానిని గమనించిన శంకరవర్మ మందహాసం చేస్తూ, ''యువరాజా, ఆమె నా కుమార్తె సుకన్య. యువరాజుతో ఎలా మాట్లాడాలో తెలియదు. ఇకమీదటే నేర్చుకోవాలి!'' అన్నాడు.

''అయినా, నిజం మాట్లాడడం ఆమెకు నేర్పనవసరం లేదు కదా!'' అంటూ నవ్వాడు యువరాజు.

శంకరవర్మ కుమార్తెతో, ''సుకన్యా, యువరాజు ప్రస్తుతం మన అతిథి. ఆయనకు సకల మర్యాదలు చేయడం మన కర్తవ్యం,'' అన్నాడు.

''నేను మీతో రాజభవనానికి రావడానికి సిద్ధమే. అయితే, అక్కడే చాలాసేపు

''ఆ కనకదుర్గ విగ్రహాన్ని తెచ్చి మీకు అప్పగించే మహాభాగ్యం నాకే కలిగింది!'' అన్నాడు యువరాజు సందీపుడు.

''అలాగా! ఎలా తెచ్చావు?'' అని అడిగాడు శంకరవర్మ.

విగ్రహాన్ని పడవలో తీసుకుపోతూన్న సర్పదంతుడి భటులనుంచి ఎలా తీసుకు వచ్చిందీ క్లుప్తంగా తెలియజేశాడు సందీపుడు. అంతావిన్న శంకరవర్మ, ''అయినా, ఇంత బరువయిన విగ్రహాన్ని ఒక్క చేత్తో ఎలా ఎత్తగలిగావు?'' అని అడిగాడు అమితాశ్చర్యంతో.

''ఆ సంగతి తలుచుకుంటే నాకూ ఆశ్చర్యంగానే ఉన్నది. మరొకసారి



ఉండలేను. ఎందుకంటే నా రాకకోసం నా మిత్రులు ఆదుర్దాగా ఎదురుచూస్తూ వుంటారు. మరొక ముఖ్యమైన విషయం ఏమంటే, వీరసింహుడు ఏక్షణాన్నయినా మీమీదికి సైన్యాన్ని పంపవచ్చు. నేనూ, నా మిత్రులూ మీకు రక్షణ కల్పించడానికి శాయశక్తులా కృషి చేస్తాము. అయినా, మీరూ అప్రమత్తులై ఉండాలి,'' అని చెబుతూ యువరాజు సందీపుడు శంకరవర్మ వెంట రాజభవనంలో ప్రవేశించాడు.

యువరాజు ఆసనంలో కూర్చున్న తరవాత, సుకన్య ఆయనకు పళ్ళూ, ఫలహారాలూ తేవడానికి లోపలికి వెళ్ళింది. అప్పుడు శంకరవర్మ సందీపుడితో, ''యువరాజా, నా భద్రత గురించి నాకు అంతగా విచారం లేదు. అయితే నీ భద్రత చాలా ముఖ్యం. నిజం చెప్పాలంటే వీరసింహుడు ప్రాణాలతో ఉన్నంతవరకు నీకు రక్షణ ఉండదు. ఆ దుర్మార్గుణ్ణి ఇంకా సహించడం మంచిది కాదనుకుంటాను. ఆ పరమ కర్కోటకుడి అంతు చూడడానికి ఇదే సరైన తరుణం,'' అన్నాడు.

''వీరసింహుణ్ణి హతమార్చడానికి మాకు చాలా అవకాశాలు లభించాయి. అయినా వాణ్ణి యుద్ధంలో ఓడించాలన్నదే నా ఆశయం. వాడు నా తండ్రిని కుట్రపన్ని హతమార్చిన మాట వాస్తవమే. అయినా, అదే పద్ధతిలో వాణ్ణి చంపాలని నేను ఆశించడం లేదు. వాడు మాతో యుద్ధం చేసి సైనికబలాన్నంతా కోల్పోయి ఆపైన మరణించాలి. ఒకవేళ యుద్ధంలో నేనే ఓడిపోతే, ఓటమిని మనస్ఫూర్తిగా అంగీకరిస్తాను,'' అన్నాడు సందీపుడు ఎంతో గంభీరంగా.

పళ్ళెం నిండా పళ్ళూ, ఫలహారాలతో గదిలోకి అడుగుపెట్టడానికి వచ్చిన సుకన్య యువరాజు మాటలు విని, అతని వెనక అలాగే నిలబడిపోయింది. యువరాజు మాటలకు శంకరవర్మ పరమానందం చెందాడు. —(ఇంకావుంది)





బందిపోటు యువరాజు

16

[వీరసింహుడి ఆజ్ఞ ప్రకారం సర్పదంతుడు, శంకరవర్మనుంచి బంగారు విగ్రహాన్ని బలపంతంగా వశపరచుకుని దానిని నదీమార్గం గుండా కాంతిపురానికి చేర్చడానికి పూనుకున్నాడు. అయితే, యువరాజు నందీపుడు మార్గమధ్యంలోనే ఆ విగ్రహాన్ని అపహరించి, శంకరవర్మకు అప్పగించాడు. నందీపుణ్ణి చూసి శంకరవర్మ పరమానందంచెందాడు. —తరవాత]

భటులు తీసుకువచ్చిన బంగారు విగ్రహం పడవనుంచి మాయమైపోయిందన్న వార్త విని, వీరసింహుడు కొంతసేపు మౌనంగా ఊరుకుని, ఆ తరవాత పిడికిలి బిగించి, "మాయలు! మంత్రాలు! మంత్ర తంత్రాలకే హడిలిపోయి మనం ఊరుకోవాలా? అంతమాత్రానికి మనకు సైన్యం దేనికి? దళ నాయకులెందుకు?" అన్నాడు ఆగ్రహంతో.

"ప్రభూ, మనదగ్గర సైనిక బలం ఉన్న మాట నిజమే. అయినా, అతీత శక్తులను ఎదుర్కొని మానవశక్తి ఎంతవరకు పోరాడగలదు? అరణ్య మధ్యంలో మృగాలు మన సైనికులను తరిమికొట్టిన దృశ్యం తమరు చూశారు కదా! వాటిమీద ఏవో అతీత శక్తుల ప్రభావం లేకపోతే, ఆ మృగాలు ఒక్కసారిగా అలా తిరగబడేవేనా!" అన్నాడు సర్పదంతుడు.



దానికి వీరసింహుడు వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. అయితే, తన బలహీనతను కప్పి పుచ్చడానికి ప్రయత్నిస్తూ, "సరే, జరిగిందేదో జరిగిపోయింది. మరి ఇప్పుడా బంగారు విగ్రహం ఎక్కడున్నదో తెలుసుకోవద్దా? ఇలాంటి అవమానాలను భరిస్తూ ఎంతకాలమని చేతులు కట్టుకుని కూర్చుంటాము?" అని సభ మారుమ్రోగేలా అరిచాడు.

అంతలో ఆస్థాన ప్రధాన గూఢచారి అక్కడికి వచ్చి, వీరసింహుడికి వంగి నమస్కరించాడు.

"ఏమిటి వార్త?" అని అడిగాడు వీరసింహుడు.

"మహాప్రభూ! మన భటుల నుంచి మాయమయిన బంగారు విగ్రహం, ప్రస్తుతం శంకరవర్మ రాజ్యంలో ఉన్నది. కొత్తగా కట్టిన గుడిలో రేపే విగ్రహప్రతిష్ఠాపన జరుపబోతున్నారు!" అన్నాడు గూఢచారి.

"నిజంగానా!" అని అడిగాడు వీరసింహుడు ఉత్సాహంగా.


"అవును ప్రభూ, ముమ్మాటికీ నిజం!" అన్నాడు గూఢచారి.

వెంటనే లేచి నిలబడిన వీరసింహుడు, పట్టరాని ఆవేశంతో, "అంటే, బంగారు విగ్రహాన్ని దొంగిలించడానికి శంకరవర్మే ఏ మాంత్రికుణ్ణో నియోగించాడన్నమాట! ఆ నీచుడికి జీవితంలో మరచిపోని గుణపాఠం నేర్పాలి!" అన్నాడు.

"ప్రభూ, ఇప్పుడే వెళ్ళి ఆ విగ్రహాన్ని తీసుకురమ్మని సెలవా!" అన్నాడు సర్పదంతుడు.

"ఎందుకూ? మళ్ళీ దాన్ని మాంత్రికుడి పరం చేయడానికా? నువ్వు వద్దు ఆ పనికి మేమే స్వయంగా వెళతాము. సాహసవంతులయిన వీరులు కొందరు మా వెంట రావడానికి వెంటనే ఏర్పాటు చెయ్. విగ్రహాన్ని మేమే స్వాధీనం చేసుకుంటాం. మాయలు, మంత్రాలు ఎలా పని చేస్తాయో మేమే చూస్తాం!" అని ఆజ్ఞాపించాడు వీరసింహుడు.

జయపురి ప్రజలు అంతులేని ఆనందోత్సాహాలతో ఉన్నారు. యువరాజు సందీపుడు కనకదుర్గ విగ్రహాన్ని తెచ్చి తనకు అప్పగించిన విషయాన్ని రాజు శంకరవర్మ రహస్యంగా దాచాడు. ఆ కారణంగా, విగ్రహం మళ్ళీ తమ రాజ్యానికి చేరడం జయపురి ప్రజలకు అద్భుతంగా తోచింది. కొత్తగా కట్టిన గుడిలో విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి పిల్లలూ, పెద్దలూ ఇనుమడించిన ఉత్సాహంతో పని చేయసాగారు.



యువరాణి సుకన్య విగ్రహాన్ని వదిలిపెట్టకుండా పక్కనే కూర్చున్నది. తండోపతండాలుగా వచ్చిన ప్రజలు కనకదుర్గ విగ్రహాన్నీ, పక్కనే ఉన్న యువరాణినీ చూసి ఎంతగానో మురిసిపోయారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు పండితులు నిర్ణయించిన శుభఘడియలు ఆసన్నమయ్యాయి. మంగళవాయిద్యాలు మ్రోగుతూ వుండగా, ఆలయపూజారీ, శంకరవర్మా, సుకన్యా విగ్రహాన్ని రాజభవనం నుంచి ఆలయం దగ్గరికి భక్తితో మోసుకుపోతున్నారు.

''ఆపండి ఉత్సవం!'' అన్న కేక వినిపించింది. మేళతాళాల శబ్దంలో, వీరసింహుడి కేక మొదట ఎవరికీ వినిపించలేదు. అయినా, గుర్రాల మీద వచ్చిన సైనికులను చూడగానే మేళతాళాలు వాయించేవాళ్ళు భయంతో అలాగే ఆగిపోయారు.

మొదట వీరసింహుడూ, అతని వెంట సర్పదంతుడూ, అంగరక్షకులూ వచ్చారు.

''శంకరవర్మా! యుద్ధం చేయడం నీ అభిమతం కాదనుకుంటాను. ఒకవేళ నీకు యుద్ధం చేయాలన్న కోరిక ఉన్నట్టయితే అందుకు మేము సిద్ధంగా వచ్చాం,'' అన్నాడు వీరసింహుడు.

''మీతోనే కాదు; మరెవరితోగాని యుద్ధం చేసే శక్తి నాకు లేదని నీకు తెలుసు. మమ్మల్నీ, మా ప్రజల్నీ ప్రశాంతంగా జీవించడానికి అనుమతించు,'' అన్నాడు శంకరవర్మ.



దూకి శంకరవర్మను సమీపించి, "నాకు సుకన్యపై ప్రేమ!" అన్నాడు నువ్వుతూ.

"ఏమిటి నువ్వు అంటున్నది?" అని అడిగాడు శంకరవర్మ ఆశ్చర్యంగా.

"బంగారు విగ్రహాన్ని వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నాను." అన్నాడు వీరసింహుడు.

"చాలా సంతోషం! ధన్యవాదాలు!" అన్నాడు శంకరవర్మ.

"అయితే, దానికి బదులుగా నువ్వు నాకు నీ కుమార్తెను ఇవ్వాలి! అవును, నేను సుకన్యను పెళ్ళాడదలిచాను. ఆమెను సుమేధకు పట్టపురాణిని చేస్తాను. ఆ సుకుమారికి శాంతిపుర రాజసౌధంలో సుఖజీవితం సమకూరుస్తాను!" అన్నాడు వీరసింహుడు వికారంగా నవ్వుతూ.

"వీరసింహా!" అని అరిచాడు శంకరవర్మ.

"నువ్వు మా సామంతుడివి. మహాప్రభువులయిన మమ్మల్ని సగౌరవంగా సంబోధించడం శ్రేయస్కరం!" అని హెచ్చరించాడు వీరసింహుడు.

"వీరసింహా! దౌర్జన్యానికి సైతం ఒక హద్దు వుంటుంది!" అన్నాడు శంకరవర్మ.

"దౌర్జన్యం! ఏది దౌర్జన్యం? మహాప్రభువులు ఒక సామంతుడి కూమార్తెను వివాహమాడాలనుకోవడం దౌర్జన్యమవు

"నువ్వు బంగారు విగ్రహాన్ని శాంతియుతంగా మాకు అప్పగించావంటే, మేము మీ శాంతికి ఎటువంటి హానీ కలిగించం!" అన్నాడు వీరసింహుడు.

"అది అసాధ్యం!" అన్నది సుకన్య.

వీరసింహుడు ఆమె కేసి ఆశ్చర్యంగా చూశాడు. సుకన్య విగ్రహాన్ని గట్టిగా కౌగిలించుకున్నది.

"ఎవరామె?" అని అడిగాడు వీరసింహుడు.

"నా కుమార్తె సుకన్య. ఆమెకు విగ్రహం పట్ల ఎంతో ప్రేమ." అన్నాడు శంకరవర్మ.

"విగ్రహంపట్ల ప్రేమా!" అంటూ వీరసింహుడు గుర్రం పైనుంచి కిందికి

తుందా? శంకరవర్మా, నువ్వు ప్రాణ ప్రదంగా భావించే బంగారు విగ్రహం గురించీ, పిచ్చుకగూడు లాంటి నీ చిన్న రాజ్యం గురించీ ఒక్కసారి ఆలోచించి చూడు!'' అన్నాడు వీరసింహుడు.

''ఆత్మగౌరవం కాపాడుకోవడానికి నా సర్వస్వాన్నీ పోగొట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాను!'' అన్నాడు శంకరవర్మ.

''శంకరవర్మా, మహారాజునైన నేను నీ కుమార్తెను వివాహమాడడం నీకు గౌరవప్రదం కాదా? నువ్వు నా అభీష్టాన్ని నెరవేర్చినట్టయితే విగ్రహం నీదవుతుంది. కాదన్నావో నీకు నీ విగ్రహమూ దక్కదు; నీ కుమార్తే దక్కదు. అంతేకాదు, నీ రాజ్యం కూడా నా వశమవుతుంది. ఒకవేళ ఎదిరించి పోరాడావో రక్తపాతం, నీకు పరాజయం తప్పవు. ఆలోచించుకో,'' అని హెచ్చరించాడు వీరసింహుడు.

''నాన్నా, అతని కోర్కెను మన్నించు. ఆ విగ్రహం మీ దగ్గరే ఇక్కడే ఉండేట్టయితే, నేను అతని వెంట వెళ్ళడానికి సిద్ధమే!'' అన్నది సుకన్య.

''ఏమిటి తల్లీ ఆ మాటలు! తెలిసే అలా అంటున్నావా?'' అన్నాడు శంకరవర్మ.

''శభాష్! సుకన్య పరిస్థితిని అర్థం చేసుకునే అలా చెబుతున్నది!'' అన్నాడు వీరసింహుడు.



''ఏమిటి పరిస్థితి!'' అంటూ శంకరవర్మ వీరసింహుడి కేసి తిరిగాడు.

ఆ సమయంలో వ్యాపారి వంటి యువకుడొకడు సుకన్యను సమీపించి ఆమె చెవిలో ఏదో చెప్పి, శంకరవర్మ కేసి చూశాడు. వ్యాపారివేషంలో ఉన్న యువకుడు యువరాజు సందీపుడని శంకరవర్మ గ్రహించాడు. ఆయన కళ్ళు ఒక్కసారి ఆనందంతో మెరిశాయి.

ఆ తరవాత ఆయన కుమార్తె వైపు తిరిగి, ''నువ్వు ఆ మాట మనస్ఫూర్తిగా అంటున్నావా తల్లీ!'' అని అడిగాడు.

''అవును నాన్నా, ఆ విషయంలో మీకెలాంటి అనుమానం వద్దు. ఎందుకంటే



నాకు కావలసిందల్లా ఆ విగ్రహం మీదగ్గరే ఉండడం. పైగా, రక్తపాతం జరగడం నాకు సుతరామూ ఇష్టంలేదు. పైపెచ్చు మనం ఎంతకాదన్నా మహారాజు అంగీకరించరు కదా. అంతేకాదు; చక్కటి యువకుడయిన రాజును పెళ్ళాడడంలో తప్పేమిటి?'' అన్నది సుకన్య.

''శభాష్! చాలా చక్కగా చెప్పావు యువరాణీ!'' అన్నాడు వీరసింహుడు, ఆనందంతో పొంగిపోతూ.

శంకరవర్మ అంగీకార సూచకంగా తల ఊపాడు.

మరుక్షణమే సుకన్యను వీరసింహుడి వెంట పంపడానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. చక్కగా, అలంకరించిన ఏనుగును తీసుకువచ్చి, సుకన్యను పెళ్ళికూతురిలా సింగారించి, ప్రధాన చెలికత్తెతోపాటు ఏనుగు అంబారీపై కూర్చొబెట్టారు. ఏనుగుముందు వీరసింహుడూ, సర్పదంతుడూ వెళుతూ ఉండగా, దాని వెనక సైనికులు బయలుదేరారు.

వాళ్ళందరూ అరణ్యాన్ని సమీపిస్తూండగా, జయానందముని పెంచే చిలుక మళ్లీ ఎగురుతూ వచ్చి, ఒక లేఖను సుకన్య ఒడిలో జారవిడిచి వెళ్ళింది. దానిని ఎవరూ గమనించలేదు. సుకన్య ఆ లేఖను చదివి, చెలికత్తె చెవిలో ఏదో చెప్పి, కళ్ళు మూసుకుని స్పృహ కోల్పోయినట్టు ఆమె ఒడిలోకి ఒరిగిపోయింది.

''ఆపండి! ఆపండి!'' అని అరిచింది చెలికత్తె.

అందరూ అలాగే నిలబడిపోయారు.

''యువరాణిగారు మూర్ఛపోయారు. కిందికి దించి వెంటనే వైద్యులను పిలిపించండి!'' అన్నది చెలికత్తె మళ్ళీ.

వెంటనే సుకన్యను అంబారీపైనుంచి కిందికి దించారు. వీరసింహుడి ఆజ్ఞ ప్రకారం నిమిషాలలో అక్కడొక గుడారం ఏర్పాటు చేశారు. ఒక దూత జయపురికి వెళ్ళి, ఆస్థాన వైద్యుణ్ణీ, ఇద్దరు యువతులనూ వెంటబెట్టుకుని వచ్చాడు. వాళ్ళు


RAZI

ముగ్గురూ యువరాణి వున్న గుడారంలోకి వెళ్ళి కొంతసేపటికి వెలుపలికి వచ్చి, వీరసింహుడితో, ''మహారాజా! యువరాణి గారు కొంతసేపట్లో కోలుకుంటారు. మరీ నీరసంగా ఉన్నారు. ఆమెకు విశ్రాంతి అవసరం. అయినా, ఏనుగుపై ప్రయాణం మంచిది కాదు. మేనా ఏర్పాటుచేయండి," అని సలహా ఇచ్చి వెళ్ళిపోయారు.

జయపురినుంచి అక్కడికి మేనాను తెప్పించడానికి సాయంకాలమయింది. ఆ తరవాత వీరసింహుడు చెలికత్తెను దగ్గరికి పిలిచి, ''యువరాణి ఇప్పుడు ప్రయాణానికి సిద్ధమే కదా?'' అని అడిగాడు.

''యువరాణిగారు విశ్రాంతి తీసుకుంటున్నారు. తమరే లోపలికి వెళ్ళి అడగవచ్చు కదా!'' అన్నది చెలికత్తె నవ్వుతూ.

వీరసింహుడు పరమానందంతో గుడారంలోపలికి వెళ్ళి చిన్నగా దగ్గుతూ, ''యువరాణీ!'' అని పిలిచాడు. ఏమాత్రం అలికిడిలేదు. అతడు మెల్లగా పడకను సమీపించాడు. మసక వెలుతురులో పడక మీద పట్టు వస్త్రం కదలడం తళుక్కుమన్నది. అది సుకన్య చేయి అనుకుని వీరసింహుడు, దానిని ప్రేమగా తాకుతూ, ''యువరాణీ!'' అన్నాడు మెల్లగా.

ఆ క్షణమే పట్టుబట్టను తొలగించుకుని పైకి వచ్చిన ఒక కోతిపిల్ల, వీరసింహుడి ముఖాన్ని గోళ్ళతో గాయపరిచి, ఒక్క గెంతున బయటకు దూకి పారిపోయింది!

వీరసింహుడు ఒక్క క్షణం అవాక్కయిపోయాడు. ఆశాభంగంతో, అవమాన భారంతో కొంతసేపు అక్కడినుంచి కదలలేకపోయాడు. ఇంతలో ఇక్కడికి కోతిపిల్ల ఎలా వచ్చింది? మళ్ళీ మంత్ర ప్రయోగమా? మాయమంత్రాలతో ఎవరైనా యువరాణిని అమాంతం కోతిపిల్లగా మార్చేశారా? ఒకవేళ అలా జరిగివుంటే కోతిపిల్లను మళ్ళీ యువరాణిగా మార్చడం సాధ్యమే కదా? వీరసింహుడు ఇలా అనుకుంటూ, ''పట్టుకోండి! దానిని పట్టుకోండి!'' అని అరుస్తూ గుడారం నుంచి బయటకు వచ్చాడు. —(ఇంకావుంది)





బందిపోటు యువరాజు

17

[వీరసింహుడు శంకరవర్మ కుమార్తె సుకన్యను, శాంతిపురానికి తీసుకుపోయే మార్గంలో, ఆమె స్పృహతప్పి పడిపోయింది. గుడారం వేయించి, సుకన్యకు విశ్రాంతి ఏర్పాటు చేశారు. సాయంకాలానికి, వీరసింహుడు గుడారంలోకి వెళ్ళి, సుకన్యను పలకరించబోయాడు. యువరాణి స్థానంలో ఉన్న ఒక కోతిపిల్ల అతడి ముఖాన్ని గాయపరచి పారిపోయింది. —తరవాత]

వీరసింహుడు పట్టరాని ఆగ్రహంతో, కోతి పిల్లను పట్టుకోమని సైనికులను ఆజ్ఞాపించాడు. యువరాణి సుకన్యను ఏ మాంత్రికుడో తన మాయాజాలంతో కోతి పిల్లగా మార్చాడనే వీరసింహుడు భావించాడు. గుడారం లోపలికి వెళ్ళివచ్చిన వైద్యుల వెంట యువరాణి మారువేషంలో తప్పించుకుని వుంటుందనిగానీ, వైద్యుడు వెంట తెచ్చిన పెద్ద సంచీలో రహస్యంగా పెంపుడు కోతిపిల్లను తెచ్చి, అక్కడ వదిలి వుండవచ్చని గానీ అతడు ఊహించలేకపోయాడు.

వీరసింహుడి కేకలు సర్పదంతుడికి కూడా ఆశ్చర్యం కలిగించాయి. మాయాజాలం మీద, మంత్రతంత్రాల మీద వాడికి నమ్మకం లేదు. కాని మంత్రప్రభావంవల్లే తమకీగతి పడుతున్నదన్న భావాన్ని వీరసింహుడికి కలిగించినవాడు సర్పదంతుడే.



బంగారు విగ్రహాన్ని రక్షించలేని తన చేత కానితనాన్ని కప్పిపుచ్చడానికే వాడా కట్టుకథ చెప్పాడు. వీరసింహుడు దాన్ని నమ్మాడు. ఇప్పుడు యువరాణి మాయం కావడానికి కారణం మనుషుల తంత్రమే తప్ప, మాంత్రికుల మాయాజాలం కాదని సర్పదంతుడికి తెలుసు. అయినా, వీర సింహుడి భ్రాంతిని పోగొడితే తన అబద్ధం బయటపడిపోతుందని వాడు భయ పడ్డాడు.

''మహాప్రభూ, మనకు ఏ మాంత్రికు డయినా సహాయం చేస్తే తప్ప మనం ఇలాంటి మంత్రప్రభావం నుంచి బయట పడలేము!'' అన్నాడు సర్పదంతుడు.

''అది నిజమే కాని, కోతిపిల్లను యువ రాణిగా మార్చగల మాంత్రికు డెవడైనా నీకు తెలుసా? వాడికి ఎంత ధనమైనా ఇవ్వడానికి మేము సిద్ధంగా వున్నాం,'' అన్నాడు వీరసింహుడు.

''తమ ఆలోచన అద్భుతంగా వున్నది ప్రభూ! అయినా, మనం మొదట కోతిగా మారిన యువరాణిని పట్టుకోవాలి. అసంఖ్యాకమైన కోతులలో దానిని కను గొనడం ఎలా అన్నదే సమస్య!'' అన్నాడు సర్పదంతుడు.

వీరసింహుడు ఏదో చెప్పబోయాడు. అంతలో ఒక చిలుక అతని తల మీదుగా ఎగరడం కనిపించింది. అతడు తలెత్తి చూడగానే, చిలుక గొట్టంలాంటి దానిని అతడి మీదికి జారవిడిచి ఎగిరిపోయింది.

సర్పదంతుడు లేఖను తీసి వీరసింహు డికి ఇచ్చాడు. వీరసింహుడు కాగడా వెలుతురులో ఆ లేఖను చదివాడు: ''వీర సింహా! నీచమైన నీ కోరిక నుంచి తప్పించు కోవడానికే యువరాణి కోతిపిల్లగా మారి పోయింది! నీకు సిగ్గులేదా? ఇంకా నీలో ఏపాటి వివేకం మిగిలివున్నా, మర్యాదగా శాంతిపురం తిరిగి వెళ్ళు. శంకరవర్మకు గాని, జయపురి ప్రజలకు గాని హాని తల పెట్టావో నీ ప్రాణాలు దక్కవు జాగ్రత్త! ఇది యువరాజు సందీపుడి ఆజ్ఞ!''

''యువరాజు సందీపుడు! ఎవడీ యువరాజు?'' అని అరిచాడు వీర సింహుడు.

ఇంతకు ముందు కూడా సర్పదంతుడికి ఇటువంటి హెచ్చరికలు వచ్చాయిగాని, వాడా విషయం వీరసింహుడికి చెప్పలేదు. ఎందుకంటే, అది వాడు వీరసింహుణ్ణి మభ్యపెడుతూన్న మాయమంత్రాలకు వ్యతిరేకమైన విషయం!

''బందిపోట్ల నాయకుడై ఉంటాడు ప్రభూ!'' అన్నాడు సర్పదంతుడు.

''దుర్మార్గుడయిన బందిపోట్ల నాయకుడు తనను యువరాజని చాటుకుంటాడా? ఎంత పొగరు? ఇప్పుడే మనం జయపురిని ఆక్రమిద్దాం. వాడు ఏం చేస్తాడో చూద్దాం. సైన్యం సిద్ధమే కదా?'' అని అడిగాడు వీరసింహుడు.

''క్షణంలో సిద్ధం చేస్తాను ప్రభూ! పైగా, జయపురికి సైన్యమే లేదు. వాళ్ళు మనల్ని ప్రతిఘటించలేరు కదా!'' అన్నాడు సర్పదంతుడు.

''మూర్ఖుడా, ఆ సంగతి కూడా మాకు తెలియదనుకున్నావా? ఒకవేళ జయపురి, అమృతపురి రక్షణను కోరినట్టయితే, ఆ సేనలను ఎదుర్కోవడానికి సిద్ధంగా వున్నావా? ఆ విషయం మాకు తెలియాలి,'' అన్నాడు వీరసింహుడు.



సర్పదంతుడు కొంతసేపు మౌనం వహించి, ''ప్రభూ, అమృతపురి సైనికంగా చాలా బలపడిందని చారుల ద్వారా తెలిసింది. మనం సైనిక బలాన్ని పెంచుకుంటే తప్ప, అమృతపురి సేనలను ఎదుర్కోవడం ఆపదను కొని తెచ్చుకోవడమే అవుతుంది!'' అన్నాడు.

''మళ్ళీ నువ్వు పాతపాటే పాడుతున్నావు. మనం సైనికబలాన్ని పెంచుకోవడం ఎలా? ఆయుధాలు కొనడానికి కావలసిన ధనం గాని, ధాన్యం గాని సమకూర్చుకోలేక పోయాం. ప్రతిదానికీ తిరుగుబాటుదార్లు అడ్డు తగులుతున్నారు. ప్రజల అండదండలతో



పాటు, ఆ దుర్మార్గులకు అరణ్య మృగాల, పక్షుల సహాయం కూడా లభిస్తున్నాయి!'' అన్నాడు వీరసింహుడు బాధగా.

''ఏదైనా రహస్యనిధి దొరికినా బావుం డేది!'' అన్నాడు సర్పదంతుడు.

''రహస్యనిధి! రహస్యనిధి!'' అంటూ వీరసింహుడు కొంతసేపు తీవ్రంగా ఆలోచించాడు. హఠాత్తుగా అతడి కొక ఆలోచన వచ్చింది. పురాతన భవనాలలో రహస్య నిధులు వుంటాయి కదా! మరి శాంతిపుర రాజభవనంలో మాత్రం రహస్య నిధులు ఎందుకు ఉండవు?

''రాజభవనానికి వెళదాం!'' అంటూ వీరసింహుడు గుర్రం మీదికి ఎక్కి కూర్చుని అదిలించాడు. అతడి వెంట సైన్యం కూడా బయలుదేరింది!

* * *

వీరసింహుడికి రాత్రల్లా నిద్రపట్టలేదు. సర్పదంతుడితో కలిసి రాజభవనంలోని గదులన్నిటినీ పరిశోధించి చూశాడు. రాజ భవనంలో చిరకాలంగా పని చేస్తూన్న వృద్ధులయిన ఇద్దరు సేవకులను పిలిపించి, ''మేము చూడని గదులేవైనా వుంటే చూపండి. చూపారంటే మీకు చక్కటి బహుమతి ఇస్తాం. తెలిసీ చూపక పోయారో చిత్రవధ చేయిస్తాం.'' అని బెది రించాడు. ఆఖరికి ఆ ఇద్దరిలో ఒక సేవ కుడు వాళ్ళను చీకటి గొయ్యిలా వున్న మారుమూలకు తీసుకుపోయాడు. గోడను అనుకుని సన్నటి సందువంటి మార్గం కనిపించింది. ఆ మార్గంగుండా కొంత దూరం వెళ్ళాక, ఎప్పుడో తాళం వేసిన పాత తలుపు కనిపించింది.

వీరసింహుడూ, సర్పదంతుడూ చాలా కష్టపడి తాళాన్ని బద్దలు కొట్టారు. ఇరువురూ చిన్న కాగడా వెలుగులో గది లోపలికి జొరబడ్డారు. అక్కడ భోషాణాల వంటి కొన్ని పెట్టెలు ఒకదానిపై ఒకటి అమర్చబడి ఉన్నాయి. వీర సింహుడు ఒక ఇనుపపెట్టెను తెరిచాడు. నిండా రకరకాల పురాతన ఆభరణాలు!

"సర్పదంతా! మన సమస్య తీరి పోయింది!" అని కేక వేశాడు వీరసింహుడు.

సర్పదంతుడి కళ్ళు పెద్దవయ్యాయి. పట్టరాని ఆనందంతో ఇరువురూ ఒక్క నిమిషం మాట్లాడలేకపోయారు. ఆతరవాత తేరుకుని ఒక్కొక్క పెట్టెగా తెరిచి, వాటిలోని ఆభరణాలు చూసి, పొంగిపోయారు.

"ఆభరణాలు దొరికాయి. కాని, వాటితో ఆయుధాలు కొనడం ఎలా అన్నదే ప్రస్తుత సమస్య!" అన్నాడు వీరసింహుడు.

"ప్రభూ, అదేం సమస్య కాదు. చంద్రపురి ఆయుధ వ్యాపారులను పిలిపించి, వాళ్ళచేత ఆభరణాల విలువను బేరీజు వేయిద్దాం. ఆ తరవాత ఆయుధాల బేరం కుదుర్చుకోవడం సులభం!" అన్నాడు సర్పదంతుడు.

"కొన్ని ముఖ్యమైన ఆభరణాలు తప్ప, ఉపయోగం లేని అలంకార ప్రాయాలయిన మిగతా విలువయిన ఆభరణాలనూ, వెండి బంగారు పాత్రలనూ వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. మనకు ఆయుధాలు కావాలి. సైనికబలం వుంటే జయపురినే కాదు; సుసంపన్నమైన అమృతపురిని కూడా అవలీలగా ఆక్రమించవచ్చు!" అన్నాడు వీరసింహుడు ఆనందంగా.



గదికి గట్టి తాళం బిగించి, ఇరువురూ వెలుపలికి వచ్చారు.

మర్నాడు ఉదయమే, నమ్మకస్థులయిన దూతల ద్వారా తమ సందేశాన్ని చంద్రపురికి పంపారు. వాళ్లు తిరిగి వచ్చి, చంద్రపురి వ్యాపారుల నుంచి నిపుణులు మూడు రోజులలో వస్తారని తెలియజేశారు. తన చిరకాల వాంఛ తీరుతుందన్న ఆశతో వీరసింహుడు కలలు గనసాగాడు.

మూడు రోజుల తరవాత ఒక గూఢచారి వీరసింహుడి వద్దకు వచ్చి, "ప్రభూ, చంద్రపురి వర్తకుల నుంచి ఇరవై అయిదుగురు నిపుణులు బయలుదేరి వస్తున్నారు!" అని చెప్పాడు.



"ఇరవై అయిదుగురా! ఐదారుగురే రాగలరని అనుకున్నాం. అంటే, మన పట్ల అంతటి గౌరవం అన్నమాట! సర్ప దంతా, మంచి మంచి వంటలు చేయించు. వాళ్ళందరికీ రాజభవనంలోనే బస ఏర్పాటు చేయించు. ఈ క్షణమే ఏర్పాట్లు ప్రారంభించు," అని వీరసింహుడు సర్పదంతుణ్ణి ఆజ్ఞాపించాడు.

నిపుణులు శాంతిపుర రాజభవనం చేరేసరికి రాత్రయింది. వీరసింహుడు స్వయంగా ఎదురు వెళ్ళి వాళ్ళకు స్వాగతం చెప్పాడు. అల్పాహార విందు అయ్యాక, వారిని ప్రధాన మంటపంలోకి తీసుకుపోయాడు. రహస్యమందిరంలో దొరికిన విలువైన బంగారు ఆభరణాలూ, వస్తువులూ భోషాణాలలో అక్కడ వున్నాయి.

ఒకేచోట అసంఖ్యాకమైన ఆభరణాలనూ, వాటి నాణ్యతనూ చూసి అమితాశ్చర్యం చెందిన నిపుణులు, "ఆహా! వీరసింహ మహారాజు మహాభాగ్యవంతుడు! మహా భాగ్యవంతుడు!" అని పదేపదే పొగడసాగారు.

తరవాత అందరూ విందు భోజనం చేశాక, నిపుణులు ప్రధాన మంటపం కేసి నడుస్తూ, వీరసింహుడితో, "ఇక్కడ ఏఏ ఆభరణాలు ఎన్నెన్ని ఉన్నాయి, వాటి విలువ ఎంత అన్న విషయాలు పరిశోధించి నిర్ణయించాలి. మణులు, మాణిక్యాలు పొదిగిన రాణిగారి హంసతూలికాతల్పం, శయనమందిరం గోడలకు తాపిన మణుల విలువ ఎంత వుంటుందో పరిశోధించాలి. దానికి తెల్లవాళ్ళూ సరిపోవచ్చు. అందువల్ల మీరు మంటపానికి వెలుపల తలుపు తాళం వేస్తే మాకు రక్షణ, ప్రశాంతత లభిస్తాయి! సూర్యోదయం కల్లా మా పనులు నిరాటంకంగా పూర్తవుతాయి!" అన్నారు.

"అలాగే, మీ ఇష్టానుసారమే చేద్దాం," అని వీరసింహుడు మంటపానికి వెలుపల తాళం వేయించాడు.


RAZI

నిపుణులు తమ పనిలో నిమగ్నులయ్యారు. అర్ధరాత్రి దాటేవరకు లోపలి నుంచి సందడి వింటూనే ఉన్నది.

తెల్లవారగానే వీరసింహుడు తలుపు తాళం తెరిపించాడు. మనుషుల అలికిడి లేదు. కష్టపడి పని చేయడంవల్ల నిపుణులు అలిసి, నిద్రపోయారేమో అని లోపలికి వెళ్ళి వెదికి చూశారు. కాని, ఏ ఒక్కరి జాడా కనిపించలేదు!


ఆభరణాలెక్కడ? భోషాణాలెక్కడ? నిపుణులు ఏమయ్యారు? వీరసింహుడూ, సర్పదంతుడూ పిచ్చివాళ్ళలా అరుస్తూ, భవనంలోని గదులన్నిటినీ గాలించారు. కాని ప్రయోజనం లేకపోయింది!


"బందిపోట్లు! వచ్చినవాళ్ళందరూ బందిపోట్లు! వేసిన తాళం వేసినట్టే వుంది. ఆ దుర్మార్గులు ఎలా తప్పించుకున్నారు?" అని అరిచాడు వీరసింహుడు.

రాణిగారి శయనాగారంలోని రహస్యమార్గ ద్వారం, తెరిచి వుండడంతో, సర్పదంతుడు జరిగిన విషయం గ్రహించాడు. ఆ రహస్యమార్గం గుండానే వచ్చిన వాళ్ళు భోషాణాలతో సహా ఆభరణాలను తీసుకుని వెళ్ళి ఉండాలి!

అక్కడ కనిపించిన ఒక లేఖలో ఇలా ఉన్నది: "రాజకుటుంబానికి చెందిన అమూల్య ఆభరణాలను మీ నుంచి కాపాడాము. అవి రాజవంశానికి వారసుడయిన యువరాజు సందీపుడి సంరక్షణలో భద్రంగా ఉన్నవి. మరొక విషయం. మీ మనుషులను వెంటనే దక్షిణ దిక్కుగా వున్న 'ఏనుగుకొండ' దగ్గరికి పంపండి. చంద్రపురి నుంచి వచ్చిన అసలు ఆయుధ వ్యాపారులు అక్కడే వున్నారు. వాళ్ళకు ఆహారపానీయలు అందజేయండి. అంతే కాదు. వాళ్ళను బంధించిన తాళ్ళు తెగగొట్టడానికి కత్తులు తీసుకుపోవడం మరిచిపోకండి!"

సర్పదంతుడు భటులతో బయలుదేరి వెళ్ళి, తిరుగుబాటుదార్లు బంధించిన వర్తకులను బంధాలనుంచి విడిపించాడు! —(ముగింపు వచ్చే సంచికలో)





18

[వీరసింహుడు అనుకున్నవి ఏ·ఒక్కటీ జరగలేదు. జయపురినుంచి అపహరించిన బంగారు విగ్రహం మార్గంలోనే మాయమయింది. వివాహమాడాలనుకుని జయపురి నుంచి శాంతి పురానికి తీసుకువస్తూన్న యువరాణి తప్పించుకున్నది. రాజభవనంలో లభించిన రహస్య నిధులను వ్యాపారుల వేషాలలో వచ్చిన తిరుగుబాటుదార్లు తరలించుకు వెళ్ళారు.—తరవాత]

"నాకు నా మనవణ్ణి చూడాలని ఉన్నది వసంతా," అన్నాడు అమృతపురి రాజు సత్యసేనుడు.

"తన తండ్రి రాజ్యాన్ని మళ్ళీ తన వశం చేసుకున్న తరవాతే, యువరాజు సందీపుడు తమను దర్శించి ఆశీస్సులు పొందాలని ప్రతిజ్ఞ బూనాడు ప్రభూ! అంతవరకు ఓర్పు వహించక తప్పదు. ఉదారగుణ సంపన్నుడయిన ఆ సాహస వీరుడి ఆదేశం ప్రకారమే మేము మా పోరాటం సాగిస్తున్నాం. మీ ఆశీర్వాద బలంతో, ఇప్పుడు మేము వీరసింహుడి సేనలను ముఖాముఖీ ఎదుర్కొనే స్థాయికి ఎదిగాం, ప్రభూ!" అన్నాడు వసంతుడు.

"వసంతా, సందీపుణ్ణి తలుచుకుంటే నాకెంతో ఆనందంగా ఉన్నది. అయినా, సుమేధ రాజ్యాన్ని అసలువారసుడికి అప్పగించడానికి మీరు సాగిస్తూన్న ధర్మ



పోరాటంలో నేనూ నా కర్తవ్యాన్ని నిర్వహించాలి కదా!'' అన్నాడు సత్యసేనుడు.

''ప్రభూ, తమ అండదండలవల్లే కదా మా పోరాటం నిరాటంకంగా సాగుతున్నది? తమ సైనికులే మాకు శిక్షణనిస్తున్నారు. పైగా, మా ఆత్మవిశ్వాసానికి మూలాధారం అమృతపురి సైన్యం అన్న సంగతి మీకు తెలియనిదా? అయినా, మేము జరుపనున్న ఆఖరి పోరాటంలో మీ సైన్యం కీలకపాత్ర వహించవలసి ఉన్నది!'' అన్నాడు వసంతుడు ఆవేశంతో.

రాజు సత్యసేనుడు మంత్రినీ, సేనాధిపతినీ పిలిపించాడు. నలుగురూ రహస్యాలోచనలు జరపసాగారు!

''మళ్ళీ ఒక అద్భుతం జరిగింది, ప్రభూ!'' అన్నాడు ప్రధాన గూఢచారి వీరసింహుడితో.

''ఏమిటది?'' అని అడిగాడు వీరసింహుడు.

''కోతిపిల్ల, యువరాణి సుకన్యగా మారిపోయింది ప్రభూ,'' అన్నాడు గూఢచారి!

''నిజంగానా! సుకన్య ఇప్పుడెక్కడ ఉన్నది?'' అంటూ లేచి నిలబడ్డాడు వీరసింహుడు.


''ఆమె తల్లిదండ్రుల వద్ద ఉన్నది, ప్రభూ,'' అన్నాడు గూఢచారి.

''జయపురిలోనా? అయితే ఆ సంగతి శంకరవర్మ మనకింకా ఎందుకు తెలియజేయలేదు?'' అని వీరసింహుడు కొంతసేపు తీవ్రంగా ఆలోచించి, ఒక రాజోద్యోగిని, దగ్గరికి పిలిచి, ''శంకరవర్మతో కఠినంగా ప్రవర్తించడం మాకు ఇష్టం లేదు. రేపో మాపో అతని కుమార్తెను పెళ్ళాడాలి కదా! అందుకే నువ్వు జయపురికి వెళ్ళి మేమే వచ్చి స్వయంగా సుకన్యను వెంటబెట్టుకుని వెళతామని శంకరవర్మకు మా మాటగా తెలియజెయ్. ఈసారి ప్రయాణ సమయంలో మేము సుకన్యను ఒక్క క్షణం కూడా వదిలివుండము. అంతేకాదు. సుకన్య మళ్ళీ

కోతిపిల్లగా మారిపోకుండా చూసుకోవడానికి ఒక గట్టి మాంత్రికుడు కూడా మా వెంట ఉంటాడు!'' అన్నాడు.

అప్పుడే, పొడవాటి గడ్డంతో, విచిత్ర వేషధారణతో ఒక మాంత్రికుడు అక్కడికి వచ్చాడు.

శంకరవర్మ దగ్గరికి వెళ్ళిన దూత తిరిగి వచ్చి, వీరసింహుడికి నమస్కరించి, "ఘోర అవమానం జరిగి పోయింది ప్రభూ. నన్నూ, నన్ను దూతగా పంపిన మిమ్మల్నీ ఘోరంగా అవమానించారు ప్రభూ!'' అన్నాడు.



"ఏమిటీ! మమ్మల్ని అవమానించడమా! ఎవరాపని చేసిన నీచులు?'' అని అడిగాడు వీరసింహుడు కోపంగా.

"మీ దూతనైన నన్ను చూడడానికే మొదట నిరాకరించారు ప్రభూ. శంకరవర్మ సలహాదారుడయిన ఒక యువకుడు....మిమ్మల్ని....మిమ్మల్ని....'' అని ఆ తరవాత ఏదో చెప్పడానికి భయపడ్డాడు.

"ఏమన్నాడేమిటి?'' అని గద్దించాడు వీరసింహుడు.

"ఆ యువకుడు, 'యువరాణి కోతిపిల్లగా మారిపోయిందని భ్రమపడిన వీరసింహుడే అసలు కోతి. ఆ దుష్టుడి బారినుంచి మా యువరాణి సుకన్య ఉపాయంతో తప్పించుకున్నది. యువరాణి కోరిక మేరకే కోతిపిల్ల వీరసింహుడి ముఖాన్ని గాయపరచింది. ఇంతకుమించి, మేము వీరసింహుడికి చెప్పవలసిందేమీ లేదని చెప్పు.' అని చెప్పాడు ప్రభూ,'' అన్నాడు దూత.

"అంత పొగరా! ఈ క్షణమే శంకరవర్మనూ, వాడి రాజ్యాన్నీ సర్వనాశనం చేస్తాను. సుకన్యకు నిలవ నీడలేకుండా చేస్తాను. జయపురి ప్రజలందరినీ హతమారుస్తాను. ఇళ్ళను నేలమట్టం చేయిస్తాను, ఆఖరికి గొడ్డూ గోదను కూడా వదిలిపెట్టను!'' అని అరిచాడు వీరసింహుడు.



''తమను అవమానించిన ఆ నీచులకు సరైన గుణపాఠం నేర్పాలి ప్రభూ!'' అన్నాడు దూత.

వెంటనే వీరసింహుడు సర్పదంతుణ్ణి పిలిపించి, ''ఈ క్షణమే మనం జయపురి మీదికి దండెత్తాలి. సైన్యం సిద్ధం చెయ్. ఏది ఏమైనా ఫరవాలేదు!'' అని ఆజ్ఞాపించాడు.

''జయపురి సుమేధ రాజ్యంలో ఒక భాగంగా కలిసిపోతుంది తప్ప మరే ప్రమాదమూ ముంచుకురాదు ప్రభూ. పైగా జయపురి విజయం మన సైనికులలో నూతనోత్తేజం కలిగిస్తుంది,'' అన్నాడు సర్పదంతుడు.

''అవును, చాలా కాలంగా మన సైనికులు కేవలం మన జీతబత్తాలతోనే కాలక్షేపం చేస్తున్నారు. జయపురిని జయించామంటే అక్కడి ధనాన్ని కొల్లగొట్టవచ్చు. అయినా, కొల్లగొట్టినవాటిలో విలువైన ఆభరణాలనూ, ధనాన్నీ మనకు అప్పగించాలనుకో....ఏమంటావు?'' అని అడిగాడు వీరసింహుడు.

''అక్షరాలా నిజం ప్రభూ! మీ ఆజ్ఞానుసారం ఇప్పుడే సైన్యాన్ని సిద్ధం చేస్తాను,'' అన్నాడు సర్పదంతుడు.

పొరుగుదేశాన్ని కబళించాలన్న దురాశ కారణంగా, సర్పదంతుడికి జయపురికి సైన్యమే లేదన్న విషయం స్ఫురించలేదు. ఇక వీరసింహుడికి, శంకరవర్మ మీద వెంటనే పగసాధించాలన్న దురాగ్రహం కొద్దీ, జయపురికి సైన్యం లేకపోయినా శంకరవర్మ, అమృతపురి రాజు సహాయాన్ని అర్థించవచ్చునన్న ఆలోచన రాలేదు!

సర్పదంతుడు అక్కడి నుంచి వెళ్ళిపోయాక, వీరసింహుడికి ఆ సంగతి హఠాత్తుగా స్ఫురించి పక్కనేవున్న మాంత్రికుడితో, ''మన సైనికులు ఎంతటివారినైనా ఎదుర్కొని వెనుదిరగకుండా పోరాడడానికి ఏదైనా మార్గం ఉన్నదా?'' అని అడిగాడు.

''లేకేం ప్రభూ! సైనికులేనా? వాళ్ళు ఎక్కిన గుర్రాలు కూడా ఒక్క అడుగు వెనక్కు వేయకుండా ముందుకు సాగేట్టు చేయగలను. గుర్రాలకు పెట్టే మేతలో మంత్రజలం చల్లుతాను. ఆ మేత తిన్న గుర్రాలకు శత్రుసైనికులంటేనే కాదు; జలప్రవాహమన్నా, అగ్ని జ్వాలలన్నా ఎలాంటి భయం ఉండదు. గుర్రాలు వెనుదిరగనప్పుడు వాటిపై వున్న సైనికులెలా వెనక్కు రాగలరు చెప్పండి,'' అన్నాడు మాంత్రికుడు మందహాసంతో పొడవాటిగడ్డాన్ని చేత్తో దువ్వుకుంటూ.



''శభాష్!'' అన్నాడు వీరసింహుడు.

మధ్యాహ్నానికి సైన్యం సిద్ధమయింది. సర్పదంతుడూ, మాంత్రికుడూ వెంటరాగా వీరసింహుడే సైన్యాన్ని నడిపించాడు. సాయంకాలానికి జయపురి రాజ్యసరిహద్దులను చేరారు. అప్పుడు మాంత్రికుడు, ''ప్రభూ, మనం రాత్రికి ఇక్కడే బసచేసి, మంత్రజలం చల్లిన మేతను గుర్రాలకు పెడదాం. తెల్లవారేసరికి ఒక్కొక్క గుర్రానికి ఐదు గుర్రాల బలం వస్తుంది!" అన్నాడు.

''అలాగే చేద్దాం. వేకువజామున జయపురిని ముట్టడిద్దాం!'' అన్నాడు వీరసింహుడు.

ఆ రోజు రాత్రి, మాంత్రికుడు నిష్ఠతో ఏవేవో మంత్రాలు చెబుతూ, కమండలం వంటి పెద్ద పాత్ర నుంచి, మంత్రజలాన్ని మేతపై చిలకరించి, ఆ మేతను గుర్రాలకు తినిపించాడు.

తెల్లవారగానే వీరసింహుడు, గుర్రంపై ఎక్కి సైనికులను, ''ఇప్పుడు మన గుర్రాలకు అపురూపమైన మంత్రశక్తి ఉన్నది. ఎవరెదిరించినా సరే, విజయం మనదే! ధైర్యంగా ముందుకు సాగండి,'' అని ఆజ్ఞాపించాడు.

అయితే వాడెక్కిన గుర్రం కూడా ముందుకు కదలలేదు. దానిని అదుపు చేయడం కూడా కష్టమనిపించింది. గుర్రం బలం పెరిగిందనుకుని వీరసింహుడు ఒక్కక్షణం సంతోషించాడు.



మరుక్షణమే గుర్రం ఒక్కసారిగా ముందరికాళ్ళు పైకెత్తి వింతగా సకిలించడంతో, వీరసింహుడు అనుమానంగా వెనక్కు తిరిగి చూశాడు. మిగతా గుర్రాలను అదుపుచేయడానికి సైనికులందరూ నానా తంటాలు పడుతున్నారు.

"ఉరకండి ముందుకు!" అని హెచ్చరించాడు వీరసింహుడు.

అతికష్టం మీద సైన్యం జయపురి రాజభవనాన్ని సమీపించింది. అయితే, రాజభవనాన్ని చుట్టుముట్టాలనుకున్నప్పుడు, గుర్రాలన్నీ ముందుకు కదలకుండా వెనకకాళ్ళపై లేచి భయానకంగా సకిలించసాగాయి. దాంతో సైనికులు ఒక్కొక్కరూ, కిందపడసాగారు. మరి కొందరు గుర్రపు రికాబులలో పాదాలు పట్టుకుపోవడం వల్ల గుర్రాలపై నుంచి తల్లకిందులుగా వేలాడసాగారు.

"సర్వదంతా ఏమిటిదంతా? మాంత్రికుడు ఏం చేశాడు?" అని అరిచాడు వీరసింహుడు.

గుర్రాలపైనుంచి కింద పడకుండా ఉండడానికి ఇద్దరూ నానాతంటాలు పడసాగారు.

"దుర్మార్గుడా, ఇలా చూడు!" అని ఒక గంభీర కంఠస్వరం వినిపించింది.

వీరసింహుడు తల పైకెత్తి చూశాడు.

రాజభవనం ఉపరితలం మీద కనిపించిన మాంత్రికుడు తన పొడవాటి గడ్డాన్నీ, తలపై పెట్టుకున్న పెద్ద జుట్టునూ తీసి పక్కన పెడుతూ, "నేను గుర్తున్నానా?" అని అడిగాడు.

"నువ్వు....నువ్వు....శాంతిదేవుడి దుష్ట మంత్రివి. మాంత్రికుడి వేషంలో వచ్చి మోసం చేశావా?" అని హుంకరించాడు వీరసింహుడు.

"నిజమే. నిన్ను నేను మోసం చేశాను! మీ గుర్రాలకు పిచ్చెత్తేలాగా చేశాను. అయినా, ధర్మాత్ముడయిన శాంతిదేవ మహారాజుకు నువ్వు చేసిన ద్రోహంలో ఇదేపాటి? వెంటనే సైన్యంతో సహా

లొంగిపో! లేదా ఒక్కరి ప్రాణం కూడా దక్కదు!'' అని హెచ్చరించాడు వృద్ధ మంత్రి.

''ప్రాణాలు దక్కవా? నువ్వూ, ముసలివాడైన ఆ శంకరవర్మ కలిసి, సుమేధ సైన్యంతో వచ్చిన మా ప్రాణాలు తీయగలరా?'' అంటూ వీరసింహుడు హేళనగా నవ్వాడు.

''మూర్ఖుడా! కళ్ళు తెరచి అటు చూడు!'' అన్నాడు వృద్ధమంత్రి.

మరుక్షణమే వందలాది సైనికులు ఆయుధాలతో కోట బురుజుల మీదికి వచ్చారు.



ఆ దృశ్యాన్ని చూసిన వీరసింహుడి గుండె దడదడలాడింది!

అప్పుడే వృద్ధమంత్రి దగ్గరికి వచ్చిన శంకరవర్మ, ''వీరసింహా! రక్తపాతాన్ని అరికట్టడానికే మేము నిన్ను రెచ్చగొట్టి ఇక్కడికి సైన్యంతో వచ్చేలా చేశాము. ధర్మప్రభువయిన శాంతిదేవ మహారాజు కుమారుడు యువరాజు సందీపుడి ఆదేశానుసారమే ఈ పథకం రూపొందించాము. ప్రాణాలపై ఆశవుంటే మర్యాదగా లొంగిపోయి, యువరాజు శరణు వేడుకో. నీ సైన్యాన్ని అమృతపురి సేనలు చుట్టుముట్టాయి. శాంతిపుర రాజభవనం తిరుగుబాటుదార్ల నాయకుడయిన వసంతుడి వశమయింది. మర్యాదగా లొంగిపో,'' అని హెచ్చరించాడు.

వీరసింహుడు చుట్టుపక్కల ఒకసారి కలయజూశాడు. సైనికులు చాలామంది కిందపడి గాయాలతో మూలుగుతున్నారు.

"సుమేధ సైనికులారా, ఇటు చూడండి! ఇదిగో మీ శాంతిదేవ మహారాజు గారి కుమారుడు యువరాజు సందీపుడు!'' అన్నాడు శంకరవర్మ.

యువరాజు సందీపుడు శంకరవర్మ పక్కన వచ్చి నిలబడ్డాడు.

"యువరాజు సందీపుడికీ....జై....జై,'' అంటూ సైనికులు జయ జయ ధ్వానాలు చేశారు.

''శభాష్! మీరందరూ లొంగిపోయినట్టు భావిస్తున్నాను. ఆయుధాలను కింద పడవేసి ఒక పక్కగా వచ్చి నిలబడండి. మిమ్మల్ని క్షమించి, సుమేధరాజ్య సైన్యంలోనే కొనసాగే విధంగా చూస్తాం," అని, శంకరవర్మ వీరసింహుడి కేసి తిరిగి, ''వీరసింహా ఇదే తుది హెచ్చరిక! యువరాజు శరణుపొంది, ప్రజా సమక్షంలో విచారణకు నిలబడు. లేదా నీ ప్రాణాలు దక్కవు!'' అని అన్నాడు.

వీరసింహుడు విచారంగా ఏదో ఆలోచిస్తూ వుండగా అతడెక్కిన గుర్రం హఠాత్తుగా ముందరి కాళ్ళెత్తి సకిలించి అతణ్ణి దభీమని కిందపడతోసి దూరంగా పారిపోయింది.

శంకరవర్మ అంగరక్షకులు వీరసింహుణ్ణి బంధించి చెరసాలకు నడిపించారు.

సర్పదంతుడు యువరాజుకు లొంగిపోతున్నట్టు చేతులు పైకెత్తాడు. వాణ్ణి కూడా భటులు బంధించారు.

యువరాజు సందీపుణ్ణి చూసి తాతగారయిన అమృతపురి రాజు సత్యసేనుడు ఆనందబాష్పాలు రాల్చాడు. క్రూరుడయిన వీరసింహుడి అరాచకాలు అంతమొందినందుకు సుమేధరాజ్య ప్రజలు పరమానందం చెందారు.

జయానందముని సమక్షంలో సందీపుడికి సుమేధరాజ్య పట్టాభిషేకం జరిగింది. సందీపుడు తన పరివారంతో సహా అరణ్యానికి వెళ్ళి, తల్లిదండ్రుల సమాధులకు భక్తిపూర్వకంగా నమస్కరించి, అక్కడ స్మారక మందిరాలు నిర్మించడానికి ఏర్పాటు చేశాడు.

ఆ తరవాత, సందీపుడికీ సుకన్యకూ వైభవోపేతంగా వివాహం జరిగింది. వారసులు లేనందువల్ల అమృతపురి, జయపురి రాజ్యాలు కూడా సుమేధతో కలిసి సువిశాల సామ్రాజ్యం ఏర్పడింది.

రాజు సందీపుడూ, రాణి సుకన్యాదేవీ చిరకాలం ప్రజానురంజకంగా పరిపాలన జరిపారు. —(ఐపోయింది)

